thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. No. TELTEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

Published From Jagital, Hyderabad, Adilabad, Warangal

| సంపుటి : 21 | సంచిక : 147 | జగిత్యాల ఆదివారం 30 ఆగస్టు, 2026 | ఎడిటర్ : మొహ్మద్ ఇమ్రాన్ | పేజీలు 12 + 8 జిల్లా అనుబంధం | వెల : 1.00 |

### భారత్ అఫ్గాన్ షెడ్యూల్ విడుదల



11

### అది అంటరానితనానికి మరో రూపం



.. వివరాలు 4లో

- ఖర్గే దళితుడైనందుకే మైదానం శుద్ధి చేశారా?
- బీజేపీ, ఆర్ఎస్ఎస్‌పై రాహుల్ గాంధీ ఆగ్రహం
- బాధ్యులపై కేసులు పెట్టి అరెస్ట్ చేయాలని డిమాండ్

### నేపాల్ వరదల్లో మరో విషాదం

- ఆచూకీ లేని ఇన్ఫోసిస్ పబ్లిక్ సర్వీసెస్ సిఇవో
- లక్ష్మీనాథ్ గోపిశెట్టి ఆచూకీ కోసం ముమ్మర గాలింపు



4

### ప్రధాని మరోమారు విదేశీ పర్యటన

- ఉజ్బెకిస్తాన్, కిర్గిజ్‌లలో పర్యటించనున్న మోడీ

4



# ఒక్క అర్హుడి ఓటూ పోకూడదు





## అనర్హులకు మాత్రం జాబితాలో చోటుండొద్దు

### 92.86 లక్షల మందికి నోటీసుల పరిస్థితిపై సమగ్ర పరిశీలన జరగాలి

### 'సర్' గడువును మరో నాలుగు వారాలు పొడిగించాలి

### ఎన్నికల సంఘానికి సీఎం రేవంత్ రెడ్డి లేఖ

తెలంగాణలో 2026 ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ వల్ల అర్హత ఉన్న ఏ ఒక్క ఓటరు హక్కు కోల్పోకూడదని, అనర్హులెవరూ జాబితాలో చేరకూడదని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ మేరకు భారత ఎన్నికల సంఘం ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌కు ఆయన లేఖ రాశారు. జూన్ 10 నాటికి రాష్ట్రంలో ఉన్న 3.38 కోట్ల మంది ఓటర్లలో 73.39 లక్షల మందిని గైర్హాజరైన, నివాసం మారిన, మరణించిన లేదా నకిలీ ఓటర్లుగా గుర్తించారని, అందులో 45.19 లక్షల మందిని శాశ్వతంగా నివాసం మారిన వారిగా చూపడం ఆందోళనకరమని లేఖలో పేర్కొన్నారు. అలాగే 92.86 లక్షల మంది ఓటర్లకు నోటీసులు జారీ చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఎన్నికల సంఘానికి వివరించారు. ఓటర్ల జాబితా సవరణలో లోపాలున్నాయని, తాత్కాలికంగా ఇళ్లలో లేనివారిని నివాసం మారిన వారిగా గుర్తిస్తూ తగిన ప్రత్యామ్నాయం చూపకుండానే పాత ఓటు తొలగిస్తున్నారని సీఎం ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా హైదరాబాద్, మేడ్చల్-మల్కాజ్‌గిరి, రంగారెడ్డి జిల్లాల్లోనే అధిక కేసులు కేంద్రీకృతమయ్యాయని తెలిపారు. ఈ నేపథ్యంలో సెప్టెంబర్ 16తో ముగిసే అభ్యంతరాలు, ఫిర్యాదుల గడువును మరో నాలుగు వారాల పాటు పొడిగించి, అక్టోబర్ 19న ఉండే తుది జాబితా ప్రచురణను సవరించాలని కోరారు. అలాగే నోటీసులు అందుకున్న కూలీలు, వృద్ధులకు పత్రాలు ఇచ్చేందుకు 3-4 వారాల సమయం ఇవ్వాలని, జీవో 172 ఆధారాలతో సహా ఇతర గుర్తింపు పత్రాలను అంగీకరించేలా మార్గదర్శకాలను విస్తరించాలని విజ్ఞప్తి చేశారు. *- హైదరాబాద్, ఆగస్టు 29*



# 7 నుంచి అసెంబ్లీ

### ఉదయం 10 గంటలకు సమావేశాలు ప్రారంభం

### సభ్యులకు సర్క్యులర్ పంపిన అసెంబ్లీ కార్యదర్శి

### అధికార, ప్రతిపక్షాల మధ్య వాడీవేడి చర్చలకు అవకాశం

**హైదరాబాద్, ఆగస్టు 29:** తెలంగాణ శాసనసభ, శాసన మండలి సమావేశాలకు ముహూర్తం ఖరారైంది. సెప్టెంబర్ 7 నుంచి సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు అసెంబ్లీ కార్యదర్శి అధికారిక సర్క్యులర్ జారీ చేశారు. సెప్టెంబర్ 7న ఉదయం 10 గంటలకు సమావేశాలు ప్రారంభమవుతాయని శాసనసభ, శాసన మండలి సభ్యులకు సమాచారం పంపించారు. వర్షాకాల అసెంబ్లీ సమావేశాలను సెప్టెంబర్‌లో నిర్వహిస్తామని ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. గత బీఆర్ఎస్ పదేళ్ల పాలనతో పాటు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుపై సభలో విస్తృత చర్చకు సిద్ధమని ప్రతిపక్షాలకు సవాల్ విసిరారు. మాజీ సీఎం కేసీఆర్ కూడా సభకు వచ్చి చర్చలో పాల్గొనాలని కోరారు. ప్రభుత్వ విధానాలు, అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, సాగునీటి ప్రాజెక్టులతో పాటు పలు కీలక అంశాలు సమావేశాల్లో చర్చకు వచ్చే అవకాశం ఉంది. తాజా రాజకీయ పరిణామాల నేపథ్యంలో అధికార, ప్రతిపక్షాల మధ్య వాడీవేడి చర్చలు జరిగే అవకాశముంది.

## చెరువుల ఆక్రమణలకు చెక్!



- చిన్న నీటిపారుదలకు ప్రత్యేక చట్టం తేవాలి
- ఎఫ్‌టీఎల్ హద్దులు గుర్తించి ఆక్రమణలు తొలగించాలి
- నీటి వినియోగ సామర్థ్యం పెంచేలా వ్యవస్థ పునర్వ్యవస్థీకరణ
- సీఎం రేవంత్ రెడ్డికి రైతు కమిషన్ నివేదిక

2

## ఎంఐఎం ఎమ్మెల్సీ సస్పెన్షన్



- రాజీనామా చేయాలని అధిష్ఠానం ఆదేశం
- తక్షణమే పదవి వీడాలని శాసన మండలి చైర్మన్‌కు పంపాలని స్పష్టీకరణ

ఎంఐఎం ఎమ్మెల్సీ మిర్జా రహ్మత్ బేగ్‌పై పార్టీ అధిష్ఠానం కీలక నిర్ణయం తీసుకుంది. ఆయన పార్టీ సభ్యత్వాన్ని తక్షణమే రద్దు చేసినట్లు పార్టీ జాయింట్ సెక్రటరీ ఎస్ఏ హుస్సేన్ అన్వర్ సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. ఎమ్మెల్సీ పదవికి కూడా వెంటనే రాజీనామా చేసి, రాజీనామా పత్రాన్ని శాసన మండలి చైర్మన్‌కు సమర్పించాలని పార్టీ ఆదేశించింది. 2

### గోల్ఫ్ టూరిజం హబ్‌గా తెలంగాణ

#### బ్యాండ్ అంబాసిడర్‌గా కపిల్ దేవ్

#### మంత్రి జూపల్లి కృష్ణారావు వెల్లడి

2





### నీట్ పీజీ పరీక్షకు ముందు విషాదం

- హాస్టల్‌లో విద్యార్థిని బలవన్మరణం
- కర్నూలుకు చెందిన యశ్వితగా గుర్తింపు
- కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు

2

## బంగాళాఖాతంలో మరో అల్పపీడనం!

- తెలుగు రాష్ట్రాలకు మళ్లీ వర్ష సూచన
- సెప్టెంబర్ 2 వరకు పలు ప్రాంతాల్లో వానలు
- ఉరుములు, మెరుపులతో వర్షాలు..
- అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిక

2





### కౌశిక్‌రెడ్డి వ్యవహారంపై ఎథిక్స్ కమిటీ పరిశీలన

వచ్చే సమావేశానికి కడియంను కూడా పిలవాలని నిర్ణయం

2





### కొత్త కారు ప్రారంభంలో విషాదం

- అదుపుతప్పి మామపైకి దూసుకెళ్లిన కారు
- ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి

2



# ఉద్యమకారుల రుణం తీర్చుకోవడం బాధ్యత

## సిఎం రేవంత్‌కు నివేదిక ఇచ్చిన కమిటీ

**హైదరాబాద్, ఆగస్ట్ 29:** తెలంగాణ ఉద్యమకారుల రుణం తీర్చుకోవడం ప్రభుత్వ బాధ్యత అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ముఖ్యమంత్రితో తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ భేటీ అయింది. కమిటీ సభ్యులు కేశవరావు, కోదండరామ్, రాములునాయక్, మోతె శోభన్‌రెడ్డి ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జేఏసీలతో జరిపిన సంప్రదింపుల వివరాలతో కూడిన నివేదికను సీఎంకు అందజేశారు. ఉద్యమకారుల గుర్తింపు కసరత్తును జాప్యం లేకుండా పూర్తి చేయాలని సీఎం వారికి సూచించారు. ప్రత్యేక వెబ్‌సైట్ ఏర్పాటు చేసి డిజిటల్ దరఖాస్తులు స్వీకరించాలన్నారు. ఉద్యమకారులకు 250 గజాల స్థలం ఇచ్చేందుకు, పింఛన్, హెల్త్‌కార్డులు, ఉచిత బస్సు ప్రయాణం కల్పించేందుకు ముఖ్యమంత్రి సానుకూలంగా ఉన్నట్లు కమిటీ వెల్లడించింది.

# ఎంఐఎం ఎమ్మెల్సీ సస్పెన్షన్

## రాజీనామా చేయాలని అధిష్ఠానం ఆదేశం

**హైదరాబాద్:** ఎంఐఎం పార్టీకి చెందిన శాసన మండలి సభ్యుడు (ఎమ్మెల్సీ) మిర్జా రహ్మత్ బేగ్‌ను పార్టీ అధిష్ఠానం ప్రాథమిక సభ్యత్వం నుండి తక్షణమే బహిష్కరిస్తూ సస్పెండ్ చేసింది. ఈ మేరకు పార్టీ జాయింట్ సెక్రటరీ ఎస్.ఎ. హుస్సేన్ అన్వర్ సోషల్ మీడియా వేదికగా ప్రకటన విడుదల చేశారు. పార్టీ తీసుకున్న సస్పెన్షన్ నిర్ణయంతో పాటు, ఆయన తన ఎమ్మెల్సీ పదవికి వెంటనే రాజీనామా లేఖను శాసన మండలి చైర్మన్‌కు సమర్పించాలని ఎంఐఎం నాయకత్వం ఆదేశించింది. మహిళ పట్ల అసభ్య ప్రవర్తన ఆరోపణలతో పాటు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయిన వివాదాస్పద వీడియో అంశంపై పార్టీ తీవ్రంగా పరిగణించినట్లు తెలుస్తోంది. అయితే సస్పెన్షన్‌కు గల ఖచ్చితమైన అధికారిక కారణాలను ఎంఐఎం అధికారికంగా వెల్లడించలేదు. రహ్మత్ బేగ్‌పై అధిష్ఠానం తీసుకున్న ఈ హఠాత్ నిర్ణయం రాష్ట్ర రాజకీయ వర్గాల్లోనూ, ముఖ్యంగా పాతబస్తీ రాజకీయాల్లోనూ తీవ్ర కలకలం రేపింది.

# బంగాళాఖాతంలో అల్పపీడనం!

## తెలుగు రాష్ట్రాలకు మళ్లీ వర్ష సూచన

**విశాఖపట్టణం, ఆగస్ట్ 29 :** బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉన్నదని.. ఈ అల్పపీడన ప్రభావంతో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో మళ్లీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఈ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. ఆంధ్రప్రదేశ్‌లో వాతావరణ పరిస్థితులు వేగంగా మారుతున్నాయి. ముఖ్యంగా ఉత్తరాంధ్రలోని శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో నేడు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. కొన్ని చోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన వానలు పడొచ్చని అంచనా వేశారు. బంగాళాఖాతంలో సంభవిస్తున్న వాతావరణ మార్పుల కారణంగా వర్షాల తీవ్రత పెరిగే అవకాశం ఉందని, సెప్టెంబర్ 2 వరకు ఉత్తరాంధ్రతోపాటు రాయలసీమలోని పలు ప్రాంతాల్లో వర్షాలు కొనసాగుతాయని అధికారులు తెలిపారు. తెలంగాణలోని పలు జిల్లాల్లో సైతం తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. రానున్న 24 గంటల్లో హైదరాబాద్ నగరంలో ఆకాశం మేఘావృతమై ఉంటుందని, అప్పుడప్పుడు వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొన్నది. వర్షాల నేపథ్యంలో ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు హెచ్చరించారు. ఉరుములు, మెరుపులు సంభవించే సమయంలో చెట్లు, విద్యుత్ స్తంభాలు, బహిరంగ ప్రదేశాలకు దూరంగా ఉండాలని సూచించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, రైతులు వాతావరణ హెచ్చరికలకు అనుగుణంగా వ్యవసాయ పనులు చేపట్టాలని కోరారు. వర్షం కురుస్తున్న సమయంలో వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

# కొత్త కారు ప్రారంభంలో విషాదం

## అదుపుతప్పి మామపైకి దూసుకెళ్లిన కారు

**హైదరాబాద్, ఆగస్ట్ 29:** కొత్త కారు కొన్న ఓ కుటుంబం సంతోషం నిమిషాల వ్యవధిలోనే విషాదంగా మారింది. కారుకు పూజ చేయించడం కోసం అల్లుడితో పాటు గుడికి వెళ్లిన మామ.. అదే కారు కిందపడి ప్రాణాలు కోల్పోయారు. నగరానికి చెందిన ఓ దంపతులు ఇటీవల కొత్త కారును కొనుగోలు చేశారు. దానికి పూజ చేయించేందుకు తమ బంధువు(మామయ్య) రామచంద్రరావును ఆహ్వానించారు. దీంతో అల్లుడు, కుమార్తెతో కలిసి పెద్దమ్మగుడికి వెళ్లారాయన. అల్లుడు కారును డ్రైవింగ్ చేస్తుండగా.. ఒక్కసారిగా అదుపుతప్పి రామచంద్రరావు మీదకు దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ఆయనకు తీవ్రగాయాలయ్యాయి. అప్రమత్తమైన కుటుంబసభ్యులు.. హుటాహుటిన స్థానిక ఆసుపత్రికి తరలించారు. అయితే.. పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ ఆయన మృతిచెందారు. దీంతో ఆ కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

# నీట్ పీజీ పరీక్షకు ముందు విషాదం

## హాస్టల్‌లో విద్యార్థిని బలవన్మరణం..

**హైదరాబాద్, ఆగస్టు 29:** నీట్ పీజీ పరీక్షకు ఒకరోజు ముందు హైదరాబాద్‌లో విషాదం చోటుచేసుకుంది. ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని అపరాజిత హాస్టల్‌లో ఉంటూ పరీక్షకు సిద్ధమవుతున్న కర్నూలుకు చెందిన ఎంబీబీఎస్ విద్యార్థిని యశ్విత విషం తీసుకుని బలవన్మరణానికి పాల్పడింది. యశ్విత గత ఆరు నెలలుగా హైదరాబాద్‌లో ఉంటూ నీట్ పీజీ పరీక్షకు సిద్ధమవుతోంది. ఆమె కర్నూలుకు చెందిన వ్యాపారి రామ్మోహన్ రెడ్డి ఏకైక కుమార్తెగా పోలీసులు గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఘటనకు గల కారణాలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పరీక్షల ఒత్తిడి కారణమై ఉండవచ్చనే కోణంతో పాటు ఇతర కారణాలపైనా పోలీసులు విచారణ జరుపుతున్నారు.

# ఒక్క అర్హుడి ఓటూ పోకూడదు

- అనర్హులకు మాత్రం జాబితాలో చోటుండొద్దు
- 92.86 లక్షల మందికి నోటీసుల పరిస్థితిపై సమగ్ర పరిశీలన జరగాలి
- 'సర్' గడువును మరో 4 వారాలు పొడిగించాలి
- ఎన్నికల సంఘానికి సీఎం రేవంత్ రెడ్డి లేఖ

**హైదరాబాద్, ఆగస్టు 29:** తెలంగాణలో 2026 ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో అర్హత ఉన్న ఏ ఒక్క ఓటరు పేరు తొలగిపోకూడదని, అదే సమయంలో అనర్హులెవరూ జాబితాలో చేరకుండా చూడాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. అభ్యంతరాలు, క్లెయిమ్‌లకు తగిన సమయం ఇవ్వడంతో పాటు ఓటర్లకు అవసరమైన సహాయం అందించేలా చర్యలు చేపట్టాలని కోరుతూ కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు లేఖ రాశారు. 2026 జూన్ 10 నాటికి రాష్ట్రంలో 3.38 కోట్ల మంది ఓటర్లు ఉండగా, వారిలో 73.39 లక్షల మందిని గైర్హాజరు, నివాసం మారిన, మరణించిన, ఒకటికి మించి నమోదైన ఓటర్లుగా గుర్తించినట్లు ఎన్నికల సంఘం గణాంకాలను సీఎం ప్రస్తావించారు. వీరిలో 45.19 లక్షల మందిని శాశ్వతంగా నివాసం మారిన వారిగా గుర్తించడం ఆందోళనకరమని పేర్కొన్నారు. డిజిటలైజ్ చేసిన 2.65 కోట్ల గణన పత్రాల్లో 60.50 లక్షల పత్రాల్లో లోపాలు ఉన్నాయని, మరో 32.36 లక్షల పత్రాలకు గత ఓటర్ల జాబితాతో అనుసంధానం జరగలేదని తెలిపారు. దీంతో మొత్తంగా సుమారు 92.86 లక్షల మందికి నోటీసులు జారీ చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని, ఇది రాష్ట్రంలోని దాదాపు మూడో వంతు ఓటర్లను ప్రభావితం చేసే అంశమని వివరించారు. గణన సిబ్బంది పరిశీలన సమయంలో తాత్కాలికంగా ఇంట్లో లేనివారిని, శాశ్వతంగా నివాసం మారిన వారిని ఒకే విధంగా పరిగణించడం సరికాదని సీఎం పేర్కొన్నారు. నివాసం మారిన వారికి కొత్త ప్రాంతంలో ఓటరుగా నమోదు చేసుకునేందుకు ఫారం-6 ద్వారా సహాయం అందించకుండానే పాత ప్రాంతంలోని ఓటును తొలగించడం వల్ల ఓటుహక్కు కోల్పోయే ప్రమాదముందని తెలిపారు. పేరు తొలగించే ముందు అధికారికంగా నోటీసు ఇవ్వాలని కోరారు. పోలింగ్ రోజు కేంద్రానికి వెళ్లే వరకు తమ ఓటు తొలగిపోయిన విషయం తెలియని పరిస్థితి ఏర్పడకూడదని స్పష్టం చేశారు. ఉద్యోగాలు, వివాహాలు, తాత్కాలిక నివాస మార్పుల కారణంగా ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందని తెలిపారు. హైదరాబాద్, మేడ్చల్-మల్కాజ్‌గిరి, రంగారెడ్డి జిల్లాల్లోనే రాష్ట్రంలోని గైర్హాజరు, నివాసం మారిన, మరణించిన, ఒకటికి మించి నమోదైన ఓటర్లలో 58.6 శాతం మంది ఉన్నారని సీఎం పేర్కొన్నారు. పరిశీలన నోటీసుల్లోనూ 41.9 శాతం ఈ మూడు జిల్లాల్లోనే ఉన్నాయని తెలిపారు. హైదరాబాద్‌లో ఒక్కో నియోజకవర్గంలో సగటున 78 వేలకుపైగా కేసులు ఉన్న నేపథ్యంలో అదనపు అధికారులను నియమించాలని కోరారు. సమీప భవిష్యత్తులో తెలంగాణలో ఎన్నికలు లేనందున సవరణ ప్రక్రియను హడావుడిగా ముగించాల్సిన అవసరం లేదని సీఎం పేర్కొన్నారు. అభ్యంతరాలు, క్లెయిమ్‌ల స్వీకరణకు ప్రస్తుతం ఉన్న గడువును మరో నాలుగు వారాలు పొడిగించి, అందుకు అనుగుణంగా తుది ఓటర్ల జాబితా ప్రచురణ తేదీని సవరించాలని కోరారు. రోజువారీ కూలీలు, వలస కార్మికులు, వయోవృద్ధులు నోటీసులకు స్పందించి అవసరమైన పత్రాలు సమర్పించేందుకు వారం రోజుల సమయం సరిపోదని, కనీసం మూడు నుంచి నాలుగు వారాల గడువు ఇవ్వాలని సూచించారు. గ్రామాలు, మున్సిపల్ వార్డుల్లో ముందుగానే విస్తృత ప్రచారం నిర్వహించి కనీసం రెండుసార్లు గ్రామసభలు, వార్డు కమిటీ సమావేశాలు నిర్వహించాలని సీఎం కోరారు. ఆయా సమావేశాల్లో ముసాయిదా ఓటర్ల జాబితాలను బహిరంగంగా చదివి



వినిపించాలని సూచించారు. పట్టణ ప్రాంతాల్లో నియోజకవర్గ, పోలింగ్ కేంద్రాల స్థాయిలో సహాయ కేంద్రాలను ఏర్పాటు చేసి అవసరమైన పత్రాలపై ఓటర్లకు అవగాహన కల్పించాలని కోరారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం జారీ చేసే కుటుంబ నమోదు ధ్రువపత్రంతో పాటు మండల స్థాయిలో సులభంగా పొందగలిగే ఇతర ధ్రువపత్రాలను కూడా అంగీకరించేలా ఆధారాల జాబితాను విస్తరించాలని సూచించారు. ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా, అర్హులైన ప్రతి ఒక్కరి ఓటుహక్కును పరిరక్షించేలా ఎన్నికల సంఘం చర్యలు తీసుకోవాలని రేవంత్ రెడ్డి కోరారు. సహాయ కేంద్రాల ఏర్పాటు, గ్రామసభల నిర్వహణతో పాటు అవసరమైన పరిపాలనా సహకారాన్ని రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో అందించేందుకు సిద్ధంగా ఉందని లేఖలో స్పష్టం చేశారు.

# చెరువుల ఆక్రమణలకు చెక్!

- చిన్న నీటిపారుదలకు ప్రత్యేక చట్టం తేవాలి
- ఎఫ్‌టీఎల్ హద్దులు గుర్తించి ఆక్రమణలు తొలగించాలి
- నీటి వినియోగ సామర్థ్యం పెంచేలా వ్యవస్థ పునర్వ్యవస్థీకరణ
- సీఎం రేవంత్ రెడ్డికి రైతు కమిషన్ నివేదిక



**హైదరాబాద్, ఆగస్టు 29:** రాష్ట్రంలో చిన్న నీటిపారుదల వ్యవస్థను సమూలంగా పునర్వ్యవస్థీకరించాలని తెలంగాణ వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ ప్రభుత్వానికి సిఫారసు చేసింది. నీటి వినియోగ సామర్థ్యాన్ని పెంచే సాంకేతిక విభాగాలతో వ్యవస్థను బలోపేతం చేయడంతో పాటు చెరువుల పరిరక్షణకు ప్రత్యేకంగా చిన్న నీటిపారుదల చట్టాన్ని తీసుకురావాలని సూచించింది. తెలంగాణ వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం.కోదండ రెడ్డి నేతృత్వంలో సభ్యులు రాములు నాయక్, రాంరెడ్డి గోపాల్ రెడ్డి, గంగాధర్, ఎం.భవానీరెడ్డి జూబ్లీహిల్స్‌లోని నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి చిన్న నీటిపారుదల వ్యవస్థపై రూపొందించిన నివేదికను అందజేశారు. రాష్ట్రంలోని చిన్న, పెద్ద నీటిపారుదల వనరులను అనుసంధానిస్తూ కమాండ్ ఏరియా ఆధారిత నిర్వహణ వ్యవస్థలను ఏర్పాటు చేయాలని కమిషన్ సూచించింది. చెరువుల పూర్తిస్థాయి నీటిమట్టం హద్దులను వెంటనే గుర్తించి, ఆక్రమణలను తొలగించి పరిరక్షించాలని సిఫారసు చేసింది. తెలంగాణలో నీటి భద్రత, వ్యవసాయ స్థిరీకరణ, గ్రామీణ జీవనోపాధుల అభివృద్ధికి చెరువుల పునరుద్ధరణ అత్యంత అవసరమని పేర్కొంది. కమిషన్ సిఫారసులపై ప్రతినిధులతో చర్చించిన సీఎం రేవంత్ రెడ్డి పంటల మార్పిడి, ఉద్యాన పంటల సాగు విస్తరణ, రైతు ఉత్పత్తిదారుల సంఘాల ఏర్పాటుపై మరింత దృష్టి పెట్టాలని సూచించారు. గత రెండేళ్లలో చేపట్టిన కార్యక్రమాలు, ప్రభుత్వానికి అందించిన సూచనలను కమిషన్ సభ్యులు ముఖ్యమంత్రికి వివరించారు. కమిషన్ పనితీరుపై రేవంత్ రెడ్డి సంతృప్తి వ్యక్తం చేశారు.

# గోల్ఫ్ టూరిజం హబ్‌గా తెలంగాణ

- బ్యాండ్ అంబాసిడర్‌గా కపిల్ దేవ్
- మంత్రి జూపల్లి కృష్ణారావు వెల్లడి




**హైదరాబాద్, ఆగస్ట్ 29:** పర్యాటకం, క్రీడల ప్రచారానికి కపిల్‌దేవ్ సేవలు వినియోగించు కుంటామని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. తెలంగాణ గోల్కొండ మాస్టర్స్ 12వ ఎడిషన్ నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి జూపల్లి కృష్ణారావు పాల్గొన్నారు. శామీర్‌పేట సమీపంలోని జవహర్‌నగర్‌లో 130 ఎకరాల్లో గోల్ఫ్ కోర్సు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా గోల్ఫ్ క్రీడాకారులను ఆకర్షించేలా మౌలిక వసతులు అభివృద్ధి చేస్తామన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని అంతర్జాతీయ పర్యాటక, క్రీడా రంగంలో ముందంజలో నిలిపేందుకు ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. అందులో భాగంగా క్రీడలు, పర్యాటక రంగాలు రెండింటినీ మిళితం చేస్తూ తెలంగాణను 'గోల్ఫ్ టూరిజం హబ్'గా తీర్చిదిద్దేందుకు సమగ్ర ప్రణాళికను సిద్ధం చేసింది. రాష్ట్ర పర్యాటక , సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. హైదరాబాద్ శివారు ప్రాంతమైన షామీర్‌పేట సమీపంలోని జవహర్‌నగర్‌లో దాదాపు 130 ఎకరాల విస్తీర్ణంలో ఒక భారీ గోల్ఫ్ కోర్సును నిర్మించనున్నారు. దేశ విదేశాల నుంచి వచ్చే క్రీడాకారులను, పర్యాటకులను ఆకట్టుకునేలా దీనిని అంతర్జాతీయ ప్రమాణాలతో రూపకల్పన చేయనున్నారు. దీంతోపాటు, ప్రకృతి అందాలకు నిలయమైన నాగర్‌కర్నూల్ జిల్లాలోని సోమశిల వద్ద మరో ప్రపంచస్థాయి గోల్ఫ్ కోర్సును అభివృద్ధి చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. పబ్లిక్-ప్రైవేట్ పార్టనర్‌షిప్ విధానంలో ఈ రెండింటిని నిర్మించి, పర్యాటకులకు ఉన్నత స్థాయి వసతులను కల్పించనున్నారు. భారీ ప్రాజెక్టులతో పాటు తెలంగాణ పర్యాటక , క్రీడారంగాలను ప్రపంచస్థాయిలో ప్రచారం చేసేందుకు ప్రముఖ భారతీయ క్రికెట్ దిగ్గజం, గోల్ఫ్ క్రీడాభిమాని కపిల్ దేవ్ సేవలను వినియోగించుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆయనకున్న ప్రపంచవ్యాప్త గుర్తింపు ద్వారా విదేశీ పర్యాటకులను, పెట్టుబడిదారులను తెలంగాణ వైపు ఆకర్షించడమే ఈ నిర్ణయం ముఖ్య ఉద్దేశం. ప్రాజెక్టుల ద్వారా రాష్ట్రానికి కేవలం పర్యాటక ఆదాయం మాత్రమే కాకుండా, స్థానికంగా ఉన్న యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. విదేశీ పర్యాటకుల రాకతో హోటల్, రవాణా రంగాలకు కూడా మహర్దశ పడుతుంది. ప్రకృతి సౌందర్యం, ఆధునిక క్రీడా వసతుల మేళవింపుతో తెలంగాణను అంతర్జాతీయ పర్యాటక కేంద్రంగా మార్చడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ దిశగా వేగంగా అడుగులు వేస్తోంది.

# కౌశిక్ రెడ్డి వ్యవహారంపై ఎథిక్స్ కమిటీ పరిశీలన

## వచ్చే సమావేశానికి కడియంను కూడా పిలవాలని నిర్ణయం

హైదరాబాద్, ఆగస్ట్ 29: శాసనసభ ఎథిక్స్ కమిటీలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అంశంపై చర్చ జరిగింది. ఛైర్మన్ రేవూరి ప్రకాశ్‌రెడ్డి అధ్యక్షతన ఎథిక్స్ కమిటీ శనివారం సమావేశమైంది. ఈ భేటీలో పలు పార్టీలకు చెందిన సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కౌశిక్‌రెడ్డిపై చేసిన అభియోగాలు తొలగించాలని బీఆర్ఎస్ సభ్యులు డిమాండ్ చేశారు. గత అసెంబ్లీ సమావేశాల్లో కడియం శ్రీహరిని ఉద్దేశించి చేయి చూపించి బెదిరించారని, అసభ్య పదజాలంతో దూషించారని కౌశిక్‌రెడ్డిపై కాంగ్రెస్ సభ్యులు రెండు అభియోగాలు మోపారు. వీడియోలో సైగలు తప్ప వాయిస్ లేదని, ఇతర సభ్యుల వ్యాఖ్యలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని బీఆర్ఎస్ డిమాండ్ చేసింది. వివరణ చెప్పుకోవడానికి కౌశిక్‌రెడ్డికి అవకాశం ఇవ్వాలని ఆ పార్టీ సభ్యులు కోరారు. మరోవైపు.. సభా హుందాతనాన్ని గౌరవించాలని కాంగ్రెస్ సభ్యులు పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కావొద్దంటే కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. కౌశిక్‌రెడ్డిపై అభియోగాలు వెనక్కి తీసుకోవాలని బీఆర్ఎస్, భాజపా సభ్యులు ప్రతిపాదించారు. ఎథిక్స్ కమిటీలో కూడా భాజపా, బీఆర్ఎస్ కలిసే పనిచేస్తున్నాయని కాంగ్రెస్ సభ్యులు ఆరోపించారు. వచ్చే సమావేశానికి కౌశిక్‌రెడ్డి, కడియం శ్రీహరిని పిలవాలని ఎథిక్స్ కమిటీ నిర్ణయించింది.



# రీల్స్ కోసం కాదు.. రియల్ లైఫ్ కోసం ఆడండి

## యువత క్రీడలపై దృష్టి పెట్టాలి

- ధ్యాన్‌చంద్ జీవితం క్రీడాకారుడికి స్ఫూర్తి
- తెలంగాణను స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్దుతాం
- మంత్రి వాకిటి శ్రీహరి




**హైదరాబాద్, ఆగస్టు 29:** యువత సోషల్ మీడియా రీల్స్‌పై కాకుండా తమ భవిష్యత్తు కోసం క్రీడలపై దృష్టి సారించాలని రాష్ట్ర క్రీడలు, యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి పిలుపునిచ్చారు. 'రీల్స్ కోసం కాదు.. రియల్ లైఫ్ కోసం ఆటలు ఆడండి' అని యువతకు సూచించారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి వేడుకలను గచ్చిబౌలి హాకీ స్టేడియంలో ఘనంగా నిర్వహించారు. మంత్రి వాకిటి శ్రీహరి, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి, సోనిబాలదేవి, హాకీ అసోసియేషన్ అధ్యక్షుడు కొండా విజయ్, క్రీడాశాఖ అధికారులు, క్రీడాకారులు ధ్యాన్‌చంద్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం తెలంగాణ హాకీ లీగ్ ఫైనల్ మ్యాచ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ భారతీయ క్రీడా స్ఫూర్తిని ప్రపంచానికి చాటిన గొప్ప క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ అని కొనియాడారు. అద్భుతమైన ఆటతీరు, క్రమశిక్షణ, ఏకాగ్రతతో భారత హాకీకి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తీసుకొచ్చారని పేర్కొన్నారు. ఆయన స్ఫూర్తితో తెలంగాణ క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణను క్రీడారంగంలో దేశంలోనే అగ్రగామిగా నిలిపేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. క్రీడాకారులకు మెరుగైన మౌలిక వసతులు, శిక్షణ, ప్రోత్సాహం అందిస్తూ రాష్ట్రాన్ని స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్దుతామని వాకిటి శ్రీహరి తెలిపారు.

# ముఖ్యమంత్రిని పనిచేసుకోనివ్వాలి

## కేబినేట్ పునర్వ్యవస్థీకరణతో కొత్తదనం తేవాలి

### మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి



**హైదరాబాద్, ఆగస్ట్ 29:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. రేవంత్ రెడ్డి యువకుడు, ఉత్సాహవంతుడని అన్నారు. ముఖ్యమంత్రిని పని చేసుకోనివ్వాలని, ఆటంకాలు సృష్టించకూడదని చెప్పారు. కాంగ్రెస్ క్యాడర్‌లో అసంతృప్తి ఉందని.. కానీ, కాంగ్రెస్ పాలనపై సాధారణ ప్రజలు సంతృప్తికరంగానే ఉన్నారన్నారు. మీడియాతో చిట్ చాట్ నిర్వహించిన ఆయన కీలక విషయాలపై స్పందించారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రారంభించిన పథకాలను కొనసాగిస్తూనే సీఎం రేవంత్ రెడ్డి కొత్త వాటిని అమలు చేస్తున్నారని గుత్తా సుఖేందర్ రెడ్డి కొనియాడారు. ఈ సందర్భంగా మంత్రివర్గంపైనా కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం ఉన్న క్యాబినెట్‌ను పునర్వ్యవస్థీకరించాలని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండున్నర సంవత్సరాలు అయ్యిందని, క్యాబినెట్ పునర్వ్యవస్థీకరణ చేస్తే కొత్తదనం వస్తుందన్నారు. తెలంగాణలో ఏ రాజకీయ పార్టీలోనూ క్రమశిక్షణ లేదని, కాంగ్రెస్‌లో గ్రూపు తగాదాలు తగ్గించాలన్నారు. అదేవిధంగా పార్టీ లైన్ దాటిన వారిపై వేటు వేయకపోతే నష్టం జరుగుతుందన్నారు. పార్టీలో లీకేజీలను కంట్రోల్ చేయాలని, క్రమశిక్షణ ముఖ్యమని ఆయన చెప్పుకొచ్చారు. మరోవైపు, నాలుగు పంటలకూ రైతు భరోసా అందించాలని శాసన మండలి ఛైర్మన్ విజ్ఞప్తి చేశారు. రిజిస్ట్రేషన్ చట్టం–1908లోని సెక్షన్ 22–ఏని రద్దు చేయాలని సూచించారు. ప్రజలకు ఉచిత పథకాలను తగ్గించాలని, నిజమైన లబ్ధిదారులకే వాటిని అందించాలన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమకారులను నిర్లక్ష్యం చేయొద్దని, వారికి న్యాయం చేయాలని శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి సూచించారు.

# సీజన్ వ్యాధుల పట్ల అప్రమత్తం కండి

## కేసులు పెరుగుతున్న జిల్లాలపై ప్రత్యేకదృష్టి

### అధికారులతో సమీక్షలో మంత్రి దామోదర ఆదేశాలు



**హైదరాబాద్, ఆగస్ట్ 29:** సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, అజాగ్రత్తగా ఉంటే విజృంభిస్తాయని మంత్రి దామోదర్ రాజనర్సింహ హెచ్చరించారు. ఈ మేరకు ఆయన అధికారులో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. శనివారం రాష్ట్ర సచివాలయంలో జరిగిన ఈ సమావేశంలో రాష్ట్రంలో సీజన్ వ్యాధుల పరిస్థితిపై ఆరోగ్య శాఖ అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. డెంగ్యూ, మలేరియా, చికన్‌గున్యా కేసులు తగ్గుముఖం పట్టాయన్నారు. గతేడాదితో పోలిస్తే డయేరియా, డిసెంట్రీ కేసులు కూడా తక్కువగా నమోదు అయినట్లు తెలిపారు. టైఫాయిడ్ కేసులు స్వల్పంగా పెరిగాయన్నారు. కేసులు పెరుగుతున్న జిల్లాలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని మంత్రి ఆదేశించారు. ఫీవర్ సర్వేలను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. ప్రతి జ్వరం కేసును పర్యవేక్షించి.. అవసరమైన పరీక్షలు, చికిత్స అందించాలని మంత్రి తెలిపారు. ప్రభుత్వ హాస్పిటళ్లలో మందులు, టెస్టింగ్ కిట్లు అందుబాటులో ఉంచాలన్నారు. ఐఎల్ఐ, స్వైన్‌ఫ్లూ కేసులపై అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో ఐఎల్ఐ కేసులపై రోజువారీగా పర్యవేక్షించాలని రాజనర్సింహ తెలిపారు. అయితే, ప్రస్తుతం రాష్ట్రంలో సీజనల్ ఇన్‌ఫ్లూయెంజా పూర్తిగా నియంత్రణలోనే ఉందని మంత్రికి అధికారులు వివరించారు. దోమల నివారణ చర్యలను మరింత ముమ్మరం చేయాలని దామోదర రాజనర్సింహ ఆదేశాలు జారీ చేశారు. ప్రతి శుక్రవారం 'డ్రై డే' కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలన్నారు. నిల్వ నీటి తొలగింపు, లార్వా నిర్మూలన, ఫాగింగ్ కొనసాగించాలని సూచించారు. గ్రామాలు, పట్టణాలు, పాఠశాలలు, హాస్టళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రజారోగ్య పరిరక్షణకే ప్రభుత్వ అత్యున్నత ప్రాధాన్యమని స్పష్టం చేశారు. వ్యాధులు వచ్చిన తర్వాత చికిత్స కంటే.. ముందస్తు నివారణే లక్ష్యమన్నారు. ప్రతి జిల్లాలో ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్‌లు అప్రమత్తంగా పనిచేయాలని సూచించారు. సీజనల్ వ్యాధుల కేసులను ఏమాత్రం తేలికగా తీసుకోవద్దని మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశాలు జారీ చేశారు.

# ధనిక రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిన బిఆర్ఎస్

## వడ్డీలకే సంపాదన అంతా ఖర్చు చేస్తున్నాం

### మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి




**సూర్యాపేట, ఆగస్ట్ 29:** ధనిక తెలంగాణ రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా చేసినా సంక్షేమం ఆగడంలేదని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ధనిక రాష్ట్రం అంటూ గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిందన్నారు. చేసిన అప్పులకు వడ్డీలు కట్టలేక తాము ఎంతో యాతన పడుతున్నామని అన్నారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. జిల్లాలోని నూతనకల్, మద్దిరాల మండలాల్లో 15 గ్రామాల్లో సుమారు మూడు వేల ఎకరాలకు సంబంధించిన భూమి పట్టాలను అందజేస్తున్నామన్నారు. పిల్లల చదువు కోసం, అవసరాల కోసం భూమిని అమ్ముకొనే అవకాశం లేక ఇబ్బంది పడుతున్న విషయాన్ని తన దృష్టికి తీసుకవచ్చారని తెలిపారు. ఈ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంది కాబట్టే పట్టాదార్ పాస్‌బుక్కులను పంపిణీ చేస్తున్నామని చెప్పారు. 'మీరు తలక్రిందులుగా తపస్సు చేసినా మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుంది' అని మంత్రి స్పష్టం చేశారు. 63 వేల కోట్ల ఆడబిడ్డలకు సున్నా వడ్డీకి రుణాలు ఇచ్చామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మొదటి విడత ఇందిరమ్మ ఇళ్లు అందించామని తెలిపారు. సర్వే కోసం 70 రెవెన్యూ గ్రామాలను తీసుకున్నామని.. ఈ సర్వేతో దొంగ పట్టాలను గుర్తించవచ్చని చెప్పారు. రాబోయే సంవత్సరన్నర కాలంలో ప్రతి అంగుళం సర్వే చేస్తామన్నారు. పేదలకు ఇళ్లు ఇస్తే ప్రభుత్వంపై విషం చిమ్ముతున్నారని ప్రతిపక్షాలపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు.




# మహారాష్ట్ర అంగీకారమే లక్ష్యం

## ప్రాణహిత-చేవెళ్లపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

### తుమ్మిడిహట్టి వద్ద 152 మీటర్ల ఎత్తుతో బ్యారేజీ నిర్మాణానికి తెలంగాణ ప్రభుత్వం సన్నాహాలు

**హైదరాబాద్:** ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టు పునరుద్ధరణ దిశగా తెలంగాణ ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోంది. ప్రాణహిత నదిపై తుమ్మిడిహట్టి వద్ద 152 మీటర్ల ఎత్తుతో బ్యారేజీని నిర్మించి, మహారాష్ట్ర ప్రభుత్వ అంగీకారం పొందడమే తమ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. కేంద్ర జలశక్తి శాఖ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 1న న్యూఢిల్లీలో జరగనున్న ఇరు రాష్ట్రాల ఉన్నత స్థాయి సమావేశం నేపథ్యంలో, ఆయన సచివాలయంలో అధికారులతో సన్నాహక సమీక్ష నిర్వహించారు. తుమ్మిడిహట్టి వద్ద 152 మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మిస్తే, భారీ ఎత్తిపోతల (లిఫ్టులు) అవసరం లేకుండానే ప్రతి ఏటా సుమారు 80 టీఎంసీల ప్రాణహిత జలాలను గ్రావిటీ ద్వారా సహజ సిద్ధంగా సుందిళ్ల బ్యారేజీకి తరలించవచ్చని మంత్రి వివరించారు. విద్యుత్ భారం తగ్గడంతో పాటు ముంపు ప్రభావాన్ని తగ్గించేందుకు కేంద్ర జల, విద్యుత్ పరిశోధన కేంద్రం అధ్యయనాలను పరిగణనలోకి తీసుకున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చొరవతో కేంద్ర జలశక్తి శాఖ స్పందించి ఇరు రాష్ట్రాల మధ్య చర్చలు ఏర్పాటు చేయడం సానుకూల పరిణామమని, ఈ సమావేశంలో సాంకేతిక, చట్టపరమైన అంశాలను మహారాష్ట్రకు స్పష్టంగా వివరించనున్నట్లు తెలిపారు.



# భవిష్యత్ పోరాటాలపై బీజేపీ కసరత్తు

## 22ఏ భూములపై త్వరలోనే కార్యాచరణ

### పార్టీ నేతలతో బీజేపీ చీఫ్ రామ్ సమీక్ష

**హైదరాబాద్, ఆగస్ట్ 29:** తెలంగాణలో తమ పార్టీని బలోపేతం చేసే దిశగా బీజేపీ కసరత్తులు చేస్తోంది. ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు తమ గొంతుకను వినిపిస్తోంది. ఈ మేరకు ఆ పార్టీ చీఫ్ రాంచందర్ రావు అధ్యక్షతన ఫీజు బకాయిల చెల్లింపు కోసం ఇటీవల దీక్ష నిర్వహించిన విషయం తెలిసిందే. మరో రెండు పోరాటాలకు బీజేపీ నాయకులు సన్నద్ధమవుతున్నారు. 22ఏలో చేర్చిన భూమి సంబంధించిన బాధితులకు అండగా నిలిచేందుకు వచ్చే నెల 5,6 తేదీల్లో టీబీజేపీ నేతలు మరో దీక్ష నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో శనివారం రాంచందర్ రావు అధ్యక్షతన సమావేశం జరగనుంది. ఈ భేటీలో బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొననున్నారు. ఈ సమావేశంలో 22–ఏ వ్యవహారంపై చేసే దీక్షపై సుదీర్ఘంగా చర్చ జరగనున్నట్లు సమాచారం. దీక్షకు సంబంధించిన కార్యాచరణపై రాంచందర్ రావు నాయకులకు దిశానిర్దేశం చేయనున్నారు. అంతేకాకుండా రాష్ట్రంలో పార్టీ బలాబలాలపై కూడా చర్చించనున్నట్లు తెలుస్తోంది. పార్టీని బలోపేతం చేసే దిశలో భవిష్యత్తు కార్యాచరణపై కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది. ఈ సమావేశం అనంతరం బీజేపీ తదుపరి కార్యాచరణపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్ రావు క్లారిటీ ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. మరోవైపు ఫసల్ బీమా పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆదిలాబాద్ నుంచి అసెంబ్లీ వరకు రైతుయాత్ర చేపట్టేందుకు పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ పాయల్ శంకర్ సిద్ధమవుతున్నారు.

# నేడు నగరంలో హైదరాబాద్ రన్నర్స్ మారథాన్

## పలుచోట్ల ట్రాఫిక్ ఆంక్షలు విధించిన పోలీసులు

**హైదరాబాద్, ఆగస్ట్ 29:** నగరంలో ఆగస్టు 30న ఆదివారం నిర్వహించనున్న హైదరాబాద్ రన్నర్స్ మారథాన్ నేపథ్యంలో ట్రాఫిక్ పోలీసులు ఆంక్షలు, మళ్లింపులు ప్రకటించారు. ఉదయం 4:30 గంటల నుంచి 9:30 గంటల వరకూ మారథాన్ జరిగే మార్గాల్లో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడనుంది. పీపుల్స్ ఎ÷–లాజా నుంచి జీఎంసీ బాలాజీ స్టేడియం, గచ్చిబౌలి వరకు నె÷–లకెస్ రోడ్, ట్యాంక్‌బండ్, ఖైరతాబాద్, సోమాజిగూడ, పంజాగుట్ట, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, రోడ్ నంబర్ 45 మీదుగా మారథాన్ కొనసాగనుంది. ఈ నేపథ్యంలో నె÷–లకెస్ రోడ్ వైపు మినిస్టర్స్ రోడ్, రాణిగంజ్ నుంచి వచ్చే వాహనాలకు అనుమతి ఉండదు. పంజాగుట్ట, రాజ్‌భవన్ వైపు వెళ్లే వాహనాలను షాదాన్?రవీంద్రభారతి మార్గంలో మళ్లించనున్నారు. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ వైపు వెళ్లే వాహనాలు రోడ్ నంబర్ 10, 12?క్యాన్సర్ హాస్పిటల్ మీదుగా ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలని అధికారులు సూచించారు. లిబర్టీ, కర్బాలా, ముషీరాబాద్ నుంచి ట్యాంక్‌బండ్ వైపు వచ్చే వాహనాలకు కూడా పలు ప్రాంతాల్లో మళ్లింపులు ఉంటాయి. బేగంపేట నుంచి రాజ్‌భవన్, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ వెళ్లే వాహనాలను గ్రీన్‌లాండ్స్ వద్ద మళ్లించనున్నారు. పంజాగుట్ట ÷÷–లఓల్గ÷వర్, సాగర్ సొసైటీ, ఎన్‌టీఆర్ భవన్ వద్ద కూడా ఆంక్షలు ఉంటాయని తెలిపారు. సైబరాబాద్ కేబుల్ బ్రిడ్జి నుంచి జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 45 వైపు వాహనాలకు అనుమతి ఉండదని స్పష్టం చేశారు. వాహనదారులు ఉదయం 4:30 నుంచి 9:00 గంటల మధ్య ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకుని ట్రాఫిక్ పోలీసులకు సహకరించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

# ఇద్దరిని బలిగొన్న వేపచెట్టు వివాదం

## గొడ్డళ్లతో నరుకున్న ఇరువర్గాలు

### అడ్డుకోబోయిన ఎస్ఐకి తీవ్ర గాయాలు

**సూర్యాపేట, ఆగస్ట్ 29:** సూర్యాపేటజిల్లాలో ఓ చిన్న వివాదం పెద్దదిగా మారి ఇద్దరి ప్రాణాలను బలి తీసుకున్నది. మేళ్లచెరువు మండలం ఎర్రగడ్డతండాలో ఇంటి పక్కన ఉన్న వేపచెట్టు విషయమై రెండు వర్గాల మధ్య చిచ్చు రేగింది. దారుణమైన రక్తపాతానికి దారితీసింది. మాటామాటా పెరిగి తీవ్ర ఆగ్రహంతో ఊగిపోయిన ఇరు వర్గాలు విచక్షణ కోల్పోయి ఏకంగా గొడ్డళ్లతో పరస్పరం దాడులకు తెగబడటం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. ఈ దాడిలో ఒకరిపై ఒకరు వేసుకున్న గొడ్డలి వేట్లకు ఇద్దరు వ్యక్తులు రక్తపు మడుగులో కుప్పకూలి అక్కడికక్కడే ప్రాణాలు వదిలారు. ఆ ఇద్దరు వ్యక్తులు ఘర్షణను అడ్డుకునేందుకు రంగంలోకి దిగిన మేళ్లచెరువు ఎస్ఐ నవీన్‌కుమార్‌కు సైతం తీవ్ర గాయాలయ్యాయి. ఓ చిన్న చెట్టు వివాదం ఇద్దరి ప్రాణాలు తీయడంతో పాటు పోలీసులకే గాయాలయ్యే స్థాయికి వెళ్లడంతో ఎర్రగడ్డతండాలో ప్రస్తుతం తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.



## సంపాదకీయం



# నేపాల్‌లో సహాయక చర్యలే పెను సవాల్!

### వరద బురదలో కొనసాగుతున్న గాలింపు

### మృతదేహాల భద్రతకు మార్చురీల కొరత

ఆకస్మిక వరదలతో అతలాకుతలమైన నేపాల్‌లో ఇప్పుడు సహాయక చర్యలే పెను సవాల్‌గా మారాయి. ఊళ్లకు ఊళ్లు దెబ్బతినడం, రహదారులు, ఇతర మౌలిక వసతులు ధ్వంసం కావడంతో బురద తొలగింపు నుంచి గల్లంతైన వారి కోసం గాలింపు వరకు అడుగడుగునా ఆటంకాలు ఎదురవుతున్నాయి. పర్యాటక రంగంపై ఎక్కువగా ఆధారపడే నేపాల్‌కు ఈ విపత్తు నుంచి పూర్తిగా కోలుకోవడం, ధ్వంసమైన ప్రాంతాలను పునర్నిర్మించడం దీర్ఘకాలిక సవాల్‌గా మారే పరిస్థితి కనిపిస్తోంది. అందుతున్న సమాచారం ప్రకారం వరదల్లో మృతుల సంఖ్య 600 దాటగా, 2,500 మందికి పైగా ఆచూకీ తెలియాల్సి ఉంది. గాలింపు చర్యలు కొనసాగుతున్న నేపథ్యంలో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో గల్లంతైన వారిని గుర్తించడంతో పాటు వెలికితీస్తున్న మృతదేహాలను భద్రపరచడం కూడా అధికారులకు పెద్ద సమస్యగా మారింది. నేపాల్‌లోని మార్చురీలన్నింటి సామర్థ్యం కలిపి సుమారు 350 మృతదేహాలకే పరిమితమని సమాచారం. మృతుల సంఖ్య ఇప్పటికే అంతకు మించిపోవడంతో ఆస్పత్రులు, మార్చురీలపై తీవ్ర ఒత్తిడి ఏర్పడింది. గల్లంతైన వారి కుటుంబ సభ్యులు వచ్చి గుర్తించే వరకు మృతదేహాలను భద్రపరిచేందుకు ప్రభుత్వం తాత్కాలిక కేంద్రాలను ఏర్పాటు చేస్తోంది. అక్కడ ఉష్ణోగ్రతను సుమారు సున్నా డిగ్రీల వద్ద ఉంచేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. సహాయక బృందాలు మృతదేహాలను వెలికితీసిన వెంటనే గుర్తింపు ప్రక్రియ చేపడుతున్నాయి. మృతదేహాల ఫొటోలు తీసి, అవసరమైతే శుభ్రపరిచిన అనంతరం ప్రత్యేక గుర్తింపు సంఖ్యతో కూడిన ట్యాగ్‌ను బాడీ బ్యాగ్‌కు అమర్చుతున్నారు. ఆ తర్వాత తాత్కాలిక భద్రతా కేంద్రాలకు తరలిస్తున్నారు. గల్లంతైన వారి కోసం వచ్చే కుటుంబ సభ్యులకు వెలికితీసిన మృతదేహాల ఫొటోలను చూపించి గుర్తించే ప్రయత్నం చేస్తున్నారు. కుటుంబ సభ్యులు గుర్తించిన తర్వాత అవసరమైన అధికారిక ప్రక్రియను పూర్తి చేసి మృతదేహాన్ని అప్పగిస్తున్నారు. ముఖం ఆధారంగా గుర్తించడం సాధ్యం కాని మృతదేహాల విషయంలో వేలిముద్రలు, డీఎన్‌ఏ సహా అవసరమైన నమూనాలను సేకరిస్తున్నారు. వెంటనే గుర్తింపు సాధ్యం కాకపోయినా భవిష్యత్తులో శాస్త్రీయ పద్ధతుల్లో గుర్తించేందుకు వీటిని భద్రపరుస్తున్నారు. బంధువులు ఎవరూ ముందుకు రాని లేదా గుర్తించలేని మృతదేహాలను నిరవధికంగా భద్రపరచడం సాధ్యం కాకపోవడంతో.. అవసరమైన నమూనాలు సేకరించి, గుర్తింపు ట్యాగ్‌లు అమర్చిన తర్వాత నిబంధనల ప్రకారం తదుపరి ప్రక్రియ చేపడుతున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. గుర్తుతెలియని, ఎవరూ స్వీకరించని మృతదేహాల నిర్వహణకు జిల్లా స్థాయి యంత్రాంగం కేంద్ర అధికారులతో సమన్వయం చేసుకుంటోంది. విపత్తు తీవ్రత పెరగడంతో నేపాల్ విదేశీ సహాయక బృందాల సేవలను స్వీకరిస్తోంది. భారత్, చైనాకు చెందిన గాలింపు, సహాయక బృందాలను కొన్ని ప్రభావిత ప్రాంతాల్లోకి అనుమతిస్తున్నట్లు సమాచారం. గల్లంతైన విదేశీ పౌరుల కుటుంబాల ఆందోళనల నేపథ్యంలో నిపుణుల బృందాలు స్థానిక అధికారులతో కలిసి గాలింపు చర్యల్లో పాల్గొంటున్నాయి. ప్రస్తుతం గల్లంతైన వారిని గుర్తించడం, బాధితులను ఆదుకోవడం, మృతదేహాలను గుర్తించి కుటుంబాలకు అప్పగించడం తక్షణ ప్రాధాన్యంగా మారింది. అయితే ఆ తర్వాత నేపాల్ ముందున్న మరో భారీ సవాల్ పునర్నిర్మాణం. వరదల్లో దెబ్బతిన్న గ్రామాలు, రహదారులు, వంతెనలు, విద్యుత్, ఇతర మౌలిక వసతులను తిరిగి నిర్మించాల్సి ఉంది. వరద నీరు తగ్గినా నేపాల్ కష్టాలు మాత్రం తగ్గలేదు. బురదలో గల్లంతైన వారి కోసం గాలింపు ఒకవైపు.. మృతుల గుర్తింపు మరోవైపు.. ధ్వంసమైన ప్రాంతాల పునర్నిర్మాణం ఇంకోవైపు.. ఇప్పుడు ఆ చిన్న దేశం ముందున్నది సుదీర్ఘమైన పునరుద్ధరణ పోరాటమే.



# అది అంటరానితనానికి మరో రూపం

- ఖర్గే దళితుడైనందుకే మైదానం శుద్ధి చేశారా?
- బీజేపీ, ఆర్ఎస్ఎస్‌పై రాహుల్ గాంధీ ఆగ్రహం
- బాధ్యులపై కేసులు పెట్టి అరెస్ట్ చేయాలని డిమాండ్
- బీజేపీ, ఆర్ఎస్ఎస్‌పై తీవ్ర విమర్శలు
- హల్ద్వానీ ఘటనపై ముదిరిన వివాదం



**ఢిల్లీ, ఆగస్టు 29 :** ఉత్తరాఖండ్ 'శుద్ధీకరణ' ఘటనను లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తప్పుబట్టారు. భారతీయ జనతాపార్టీ, ఆర్ఎస్ఎస్‌లపై తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. భారతదేశంలో అస్పృశ్యతను చట్టబద్ధంగా నిషేధించారని, మల్లికార్జున ఖర్గే దళితుడనే కారణంతో ఇలా మైదానాన్ని శుద్ధి చేయడం ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ చట్టం ప్రకారం తీవ్రమైన నేరమని రాహుల్ పేర్కొన్నారు. శనివారం ఢిల్లీలోని ఇందిరా భవన్‌లో నిర్వహించిన మీడియా ప్రతినిధుల సమావేశంలో రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. 'శుద్ధీకరణ' సమాజంలో ఇంకా బతికే ఉన్న అంటరానితనానికి మరో పేరని ఆయన వ్యాఖ్యానించారు. శుద్ధీకరణ పూజను నిర్వహించిన వారిపై, దీనికి మద్దతు ఇచ్చిన ఉత్తరాఖండ్ స్థానిక బీజేపీ నేతలపై వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేసి అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. దళితులు సమాజంలో ఎదగడం, గౌరవంగా బతకడం బీజేపీ, ఆర్ఎస్ఎస్‌కు ఇష్టం లేదని, ఈ ఘటన వారి కులవివక్ష భావజాలాన్ని స్పష్టం చేస్తోందని మండిపడ్డారు.

### ఇంతకీ ఏం జరిగిందంటే..

ఆగస్టు 8వ తేదీన హల్ద్వానీలోని రాంలీలా మైదానంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జరిగిన ర్యాలీలో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పాల్గొన్నారు. ఖర్గే ర్యాలీ ముగిసిన రెండు రోజుల తర్వాత 'శ్రీరామ్ సేన' అనే స్థానిక సంస్థ ఆ మైదానంలో గంగాజలం చల్లి, హవనం (పూజ) నిర్వహించి మైదానాన్ని 'శుద్ధి' చేసింది. దీంతో వివాదం మొదలైంది.

# ప్రధాని మరోమారు విదేశీ పర్యటన

### ఉజ్బెకిస్తాన్, కిర్గిజ్‌లలో పర్యటించనున్న మోడీ



**న్యూఢిల్లీ, ఆగస్ట్ 29:** ప్రధాని నరేంద్ర మోదీ మరో విదేశీ పర్యటనకు సిద్ధం అయ్యారు. రెండు దేశాల విదేశీ పర్యటనకు బయలుదేరనున్నారు. ఉజ్బెకిస్తాన్ అధ్యక్షుడు షవ్‌కత్ మిర్జియోయెవ్ ఆహ్వానం మేరకు ఆగస్టు 29, 30 తేదీల్లో ప్రధాని మోదీ ఉజ్బెకిస్తాన్‌లో ద్వైపాక్షిక పర్యటన చేయనున్నారు. తాష్కెంట్‌లో ఇరు దేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసే అంశాలపై కీలక చర్చలు జరగనున్నాయి. ఉజ్బెకిస్తాన్‌లో ప్రధాని మోదీకి ఇది నాలుగో పర్యటన కానుంది. ఈ పర్యటనలో భారత్, ఉజ్బెకిస్తాన్ వ్యూహాత్మక భాగస్వామ్యంతో పాటు.. వాణిజ్యం, పెట్టుబడులు, రక్షణ రంగాల్లో పరస్పర సహకారంపై ఇరు దేశాల నేతలు చర్చించనున్నారు. అలాగే డిజిటల్ కనెక్టివిటీ, ఇంధనం, విద్య తదితర రంగాల్లో ద్వైపాక్షిక సంబంధాలను మరింత విస్తరించే అంశాలపై కూడా చర్చలు జరగనున్నాయి. భారత్ 'విక్షిత్ భారత్ 2047' అభివృద్ధి దార్శనికతతో పాటు ఉజ్బెకిస్తాన్ 'ఉజ్బెకిస్తాన్–2030' అభివృద్ధి ప్రణాళికలపై కూడా ఇరు దేశాల మధ్య అభిప్రాయాల మార్పిడి జరగనుంది. భవిష్యత్‌లో ఆర్థిక, సాంకేతిక, మౌలిక వసతుల రంగాల్లో పరస్పర సహకారాన్ని పెంచుకునే అవకాశాలను పరిశీలించనున్నారు. తాష్కెంట్‌లో ప్రధాని మోదీ పలు ప్రత్యేక కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. లాల్ బహదూర్ శాస్త్రి మెమోరియల్‌ను సందర్శించడంతో పాటు తాష్కెంట్ స్టేట్ యూనివర్సిటీ ఆఫ్ ఓరియంటల్ స్టడీస్‌లోని మహాత్మా గాంధీ కేంద్రాన్ని కూడా సందర్శించనున్నారు. ఉజ్బెకిస్తాన్ పర్యటన అనంతరం ప్రధాని మోదీ ఆగస్టు 31 నుంచి సెప్టెంబర్ 1 వరకు కిర్గిజ్ రిపబ్లిక్‌లో పర్యటించనున్నారు. కిర్గిజ్ అధ్యక్షుడు సదిర్ జపరోవ్ ఆహ్వానం మేరకు ప్రధాని మోదీ బిష్కెక్‌కు వెళ్లనున్నారు. ఈ పర్యటనలో భాగంగా 26వ షాంఘై సహకార సంస్థ శిఖరాగ్ర సమావేశంలో ప్రధాని మోదీ పాల్గొంటారు. ఎస్‌సీఓ 25వ వార్షికోత్సవం సందర్భంగా ఈ శిఖరాగ్ర సమావేశం జరగనుంది. 2017 నుంచి భారత్ ఎస్‌సీఓలో పూర్తి సభ్యదేశంగా కొనసాగుతోంది. ఎస్‌సీఓ సమావేశంలో భద్రత, అనుసంధానం, ప్రాంతీయ సహకారం, అభివృద్ధి అవకాశాలపై భారత ప్రాధాన్యతలను ప్రధాని మోదీ ప్రస్తావించనున్నారు. ఈ సందర్భంగా ఎస్‌సీఓ సభ్యదేశాల నేతలతో ప్రధాని మోదీ ద్వైపాక్షిక సమావేశాలు నిర్వహించే అవకాశం ఉంది. అలాగే కిర్గిజ్ రిపబ్లిక్‌లో జరిగే 6వ వరల్డ్ నోమాడ్ గేమ్స్ ప్రారంభోత్సవానికి కూడా ప్రధాని మోదీ హాజరుకానున్నారు. మధ్య ఆసియా సాంస్కృతిక వారసత్వానికి ప్రతీకగా నిలిచే ఈ క్రీడలు ప్రాంతీయ సాంస్కృతిక సంబంధాలకు ప్రత్యేక ప్రాధాన్యతను కలిగి ఉన్నాయి.

# నేపాల్ వరదల్లో మరో విషాదం

### ఆచూకీ లేని ఇన్ఫోసిస్ పబ్లిక్ సర్వీసెస్ సిఇవో

### లక్ష్మీనాథ్ గోపిశెట్టి ఆచూకీ కోసం ముమ్మర గాలింపు



**న్యూఢిల్లీ, ఆగస్ట్ 29:** నేపాల్‌లో బీభత్సం సృష్టించిన ఆకస్మిక వరదల్లో ఇన్ఫోసిస్ పబ్లిక్ సర్వీసెస్ సీఈఓ లక్ష్మీనాథ్ గోపిశెట్టి ఆచూకీ గల్లంతైంది. ఆయన వ్యక్తిగత పర్యటన నిమిత్తం నేపాల్‌కు వెళ్లినట్లు ఇన్ఫోసిస్ వెల్లడించింది. ప్రస్తుతం ఆయనతో సంబంధాలు తెగిపోయాయని, ఆచూకీ కోసం సంబంధిత అధికారులతో కలిసి గాలిస్తున్నామని తెలిపింది. గోపిశెట్టి కుటుంబ సభ్యులతో సంస్థ సంప్రదింపులు జరుపుతూ, వారికి అవసరమైన సాయాన్ని అందిస్తున్నట్లు పేర్కొంది. కాగా.. నేపాల్–చైనా సరిహద్దు ప్రాంతంలో ఈ నెల 26న సంభవించిన జల ప్రళయంలో పలు రహదారులు, వంతెనలు, భవనాలు కొట్టుకుపోయాయి. ముఖ్యంగా నేపాల్‌లోని రసువా జిల్లా, చైనాలోని టిబెట్ ప్రాంతాల్లో భారీ నష్టం వాటిల్లింది. సహాయక చర్యలకు ప్రతికూల వాతావరణం, దెబ్బతిన్న రవాణా, సమాచార వ్యవస్థలు సవాలుగా మారాయి. ఈ విపత్తు కారణంగా వందలాది మంది భారతీయుల ఆచూకీ గల్లంతైనట్లు భారత విదేశాంగ శాఖ తెలిపింది. సుమారు 320 మంది భారతీయులు ఇంకా అందుబాటులోకి రాలేదని వెల్లడించింది. అటు చైనాలో సుమారు 400 మంది భారతీయులు చిక్కుకున్నప్పటికీ సురక్షితంగా ఉన్నారంది. ఆయా కుటుంబ సభ్యులు వారితో కాంటాక్ట్‌లో ఉన్నారని తెలిపింది. చైనా వైపు చిక్కుకున్న వారిలో కొంతమంది ఇప్పటికే నేపాల్‌కు చేరుకున్నారు. తమిళనాడుకు చెందిన 21 మంది భారతీయులు కూడా సురక్షితంగా ఢిల్లీ చేరుకున్నారు. నేపాల్‌లో సహాయక చర్యలు కొనసాగుతుండగా, గల్లంతైన భారతీయుల ఆచూకీ కోసం భారత దౌత్య అధికారులు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. గోపిశెట్టి ఇన్ఫోసిస్ పబ్లిక్ సర్వీసెస్‌కు నాయకత్వం వహిస్తూ ప్రభుత్వ రంగ సంస్థలకు వ్యూహరచన, సాంకేతికత, కార్యకలాపాలు, డిజిటల్ పరివర్తనలో సలహాదారుడిగా వ్యవహరిస్తున్నారు. గతంలో ఇన్ఫోసిస్‌లో గ్లోబల్ వైస్ ప్రెసిడెంట్‌గా, యాక్సెంచర్‌లో మేనేజింగ్ డైరెక్టర్‌గా పనిచేశారు.

# ఢిల్లీలో పెరిగిన సీఎన్‌జీ ధరలు

### కిలోపై రూ.3.89 చొప్పున పెంపు




**న్యూఢిల్లీ, ఆగస్ట్ 29:** దేశ రాజధాని ఢిల్లీతో పాటు పరిసర ప్రాంతాల్లో సీఎన్‌జీ ధరలు మరోసారి పెరిగాయి. శనివారం ఉదయం 6 గంటల నుంచి కిలో సీఎన్‌జీపై రూ.3.89 చొప్పున పెంచుతున్నట్లు నగర గ్యాస్ పంపిణీ సంస్థ ఇంద్రప్రస్థ గ్యాస్ లిమిటెడ్ ప్రకటించింది. దీంతో ఢిల్లీలో ప్రస్తుతం కిలో సీఎన్‌జీ ధర రూ.86.98కి చేరుకుంది. అలాగే, నోయిడాలో రూ.95.59, ఘాజియాబాద్‌లో రూ.95.59, గురుగ్రామ్‌లో రూ.92.01, మీరట్‌లో రూ.95.47, ముజఫర్‌నగర్‌లో రూ.95.47, షామ్లిలో రూ.95.47కు ధరలు చేరుకున్నాయి. పశ్చిమాసియాలో మళ్లీ ఉద్రిక్తతలు పెరగడం, అంతర్జాతీయ మార్కెట్లో ఎల్ఎన్‌జీ ధరలు భారీగా పెరగడం తాజా ధరల పెంపునకు ప్రధాన కారణమని ఐజీఎల్ వెల్లడించింది. పశ్చిమాసియా సంక్షోభం ప్రారంభమైన తర్వాత సీఎన్‌జీ ధరలు పెరగడం ఇది ఐదోసారి. మే 15 నుంచి ఇప్పటివరకు నాలుగు విడతల్లో ధరలు పెరిగాయి. తాజా పెంపుతో ఢిల్లీ, పరిసర ప్రాంతాల్లో వేలాది మంది సీఎన్‌జీ వాహనదారులపై అదనపు భారం పడనుంది. సీఎన్‌జీతో నడిచే ప్రైవేటు కార్లు, ట్యాక్సీలు, ఆటోలు, వాణిజ్య వాహనాల నిర్వహణ వ్యయం పెరగనుంది. దీంతో ఈ భారం చివరికి ప్రయాణికులపై పడనుంది. అంతర్జాతీయంగా ఎల్ఎన్‌జీ ధరలు సంక్షోభానికి ముందు స్థాయితో పోలిస్తే దాదాపు రెట్టింపయ్యాయని ఐజీఎల్ తెలిపింది. సీఎన్‌జీ సరఫరాకు అవసరమైన సహజ వాయువులో గణనీయమైన భాగాన్ని దిగుమతి చేసుకున్న ఎల్ఎన్‌జీ ద్వారానే సమకూర్చుకుంటున్నామని పేర్కొంది. హోర్ముజ్ జలసంధి మీదుగా ఎల్ఎన్‌జీ కార్గో రవాణాకు అంతరాయం ఏర్పడటంతో ధరలు ఒక్కసారిగా పెరిగాయని వివరించింది. అలాగే, శీతాకాలం సమీపిస్తుండటంతో యూరప్ దేశాలు సహజ వాయువు నిల్వలను పెంచుకునేందుకు ప్రయత్నిస్తున్నాయని చెప్పింది. దీంతో ఎల్ఎన్‌జీ ధరలకు రెక్కలొచ్చి సీఎన్‌జీ సరఫరా వ్యయం గణనీయంగా పెరిగిందని పేర్కొంది. ఈ కారణంగానే రేట్లు పెంచాల్సిన పరిస్థితి నెలకొందని ఐజీఎల్ వెల్లడించింది.

# నేపాల్ వరదలపై మల్లికార్జున ఖర్గే ఆందోళన

### తక్షణ సాయం అందించాలని మోడీకి లేఖ

**న్యూఢిల్లీ, ఆగస్ట్ 29:** నేపాల్‌లో సంభవించిన విధ్వంసకర వరదలపై కాంగ్రెస్ అధ్యక్షుడు, రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాకు ఆయన లేఖ రాశారు. నేపాల్‌లో భారీ వరదల కారణంగా పెద్ద ఎత్తున ప్రాణ, ఆస్తి నష్టం సంభవించిందని ఖర్గే పేర్కొన్నారు. వరదల కారణంగా 500 మందికి పైగా ప్రాణాలు కోల్పోగా, దాదాపు 1,000 మందికి పైగా గల్లంతైనట్లు ఖర్గే తన లేఖలో తెలిపారు. వేలాది మంది ప్రజలు ఆహారం, మందులు, నివాసం, ఇతర అత్యవసర సదుపాయాల కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విపత్కర పరిస్థితుల్లో భారత ప్రభుత్వం నేపాల్ ప్రభుత్వంతో సమన్వయం చేసుకుని బాధితులకు అవసరమైన మానవతా, సహాయక చర్యలను అందించాలని ఖర్గే కోరారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలను వేగవంతం చేసి, బాధితులకు అవసరమైన ఆహారం, మందులు, నివాసం వంటి అత్యవసర సదుపాయాలు అందేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా వరదల కారణంగా నేపాల్‌లోని వివిధ ప్రాంతాల్లో భారతీయులు, భారతీయ మూలాలున్న వ్యక్తులు కూడా చిక్కుకుపోయారని ఖర్గే తెలిపారు. వారిని గుర్తించి సురక్షితంగా భారత్‌కు తరలించేందుకు రెస్క్యూ, తరలింపు చర్యలను ముమ్మరం చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. నేపాల్‌లో నెలకొన్న విపత్కర పరిస్థితుల్లో భారత ప్రభుత్వం వేగంగా స్పందించి సహాయక చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని ఖర్గే తన లేఖ ద్వారా స్పష్టం చేశారు. బాధిత ప్రజలకు మానవతా దృక్పథంతో అవసరమైన అన్ని రకాల సహాయాన్ని అందించాలని కేంద్రాన్ని కోరారు.



చురకలు



# ముందస్తు వైద్య పరీక్షలతో వ్యాధులను తొలిదశలోనే గుర్తించవచ్చు

## నివా బుపా సిద్దిపేట బ్రాంచ్ మేనేజర్ వెంకటేశ్వర్లు




**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, ఆగస్టు 29, :**
ముందస్తుగా వైద్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా అనేక రకాల వ్యాధులను తొలిదశలోనే గుర్తించి, సరైన సమయంలో చికిత్స పొందడం ద్వారా ఆరోగ్య సమస్యలను నివారించు కోవచ్చని నివా బుపా ఆరోగ్య బీమా సంస్థ సిద్దిపేట బ్రాంచ్ మేనేజర్ వెంకటేశ్వర్లు తెలిపారు.సిద్దిపేట ప్రెస్ క్లబ్‌లో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 31వ తేదీ సోమవారం సిద్దిపేట పట్టణంలోని నివా బుపా ఆరోగ్య బీమా కార్యాలయంలో ఉచిత ఆరోగ్య వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. శిబిరంలో వివిధ రకాల రక్త, మూత్ర పరీక్షలను ఉచితంగా నిర్వహించడంతో పాటు అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేస్తామని చెప్పారు. సిద్దిపేట పట్టణంలోని యాక్సిస్ బ్యాంక్‌పై ఉన్న నివా బుపా ఆరోగ్య బీమా కార్యాలయంలో ఈ వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సిద్దిపేట పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉచిత ఆరోగ్య వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని వెంకటేశ్వర్లు కోరారు. ఈ కార్యక్రమంలో నివా బుపా సిబ్బంది సామ్యూల్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# తెలుగు భాషా దినోత్సవం ఘనంగా

- లక్ష్మీదేవిపల్లిలో విద్యార్థులకు పాట, పద్యం, కవిత, ఉపన్యాస పోటీలు



**సిద్దిపేట రూరల్, ఆగస్టు 29, :**
గిడుగు వెంకట రామమూర్తి పంతులు జయంతిని పురస్కరించుకొని తెలుగు భాషా దినోత్సవాన్ని సిద్దిపేట నియోజకవర్గం లక్ష్మీదేవిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినీ, విద్యార్థులకు పాటలు, పద్యాలు, ఉపన్యాసాలు, కవితా పోటీలు నిర్వహించారు. పోటీల్లో ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచిన విద్యార్థులకు తెలుగు ఉపాధ్యాయులు పిన్నిటి మహేంద్రారెడ్డి కథల పుస్తకాలను బహుమతులుగా అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు తెలుగు భాష గొప్పతనాన్ని చాటుతూ తమ ప్రతిభను ప్రదర్శించారు. తెలుగు భాషను పరిరక్షించడంతో పాటు భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఉపాధ్యాయులు పేర్కొన్నారు.కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయ బృందం, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆదర్శ పాఠశాలలో ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం




**చిన్నకోడూరు, ఆగస్టు 29, :**
మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఇబ్రహీంనగర్‌లోని పీఎం శ్రీ ఆదర్శ పాఠశాల, కళాశాలలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాలబాలికలకు వివిధ క్రీడా పోటీలు నిర్వహించారు. టేబుల్ టెన్నిస్, వాలీబాల్ తదితర క్రీడల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీల్లో ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు క్రీడల ద్వారా శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, జట్టు స్ఫూర్తిని పెంపొందించుకోవాలని ఉపాధ్యాయులు సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జ్ ఉపాధ్యాయులు చంద్రశేఖర్, ఉపాధ్యాయ బృందం, స్థానిక శారీరక విద్యా దర్శకులు గుండి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.<

# ఎమ్మెల్యేని కలిసిన ఆర్డబ్ల్యూఎస్ డిఈ



**జగిత్యాల ప్రతినిధి, ఆగష్టు 29, :**
ఆర్డబ్ల్యూఎస్ ఇంట్రా డిఈగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన జలంధర్ రెడ్డి శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ని మర్యాదపూర్వకంగా కలిసి మొక్క అందజేశారు. ఏఈలు రాజశేఖర్ తరుణ్, రాహుల్ ఉన్నారు.

# రాజీ పడదగ్గ కేసులను లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోండి

- జిల్లా సెషన్స్ జడ్జి ఆర్ సుదర్శన్




**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, ఆగస్టు 29, :**
రాజీ పడదగ్గ కేసులను సెప్టెంబర్ 12న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవాలని జిల్లా సెషన్స్ జడ్జి ఆర్ సుదర్శన్ కక్షిదారులకు సూచించారు. లోక్ అదాలత్ ద్వారా కేసులను త్వరితగతిన పరిష్కరించు కోవడంతో సమయం, ఖర్చు ఆదా అవుతుందని తెలిపారు. శనివారం సిద్దిపేట జిల్లా కోర్టులో జిల్లా సెషన్స్ జడ్జి ఆర్ సుదర్శన్, జిల్లా అదనపు న్యాయ మూర్తి జయప్రసాద్, జిల్లా న్యాయ సేవా సాధికార సంస్థ కార్యదర్శి సౌజన్యతో కలిసి విలేకరుల సమావేశం నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ 12న సిద్దిపేట జిల్లా కోర్టుతో పాటు దుబ్బాక, గజ్వేల్, చేర్యాల, హుస్నాబాద్ కోర్టుల్లో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించ నున్నట్లు తెలిపారు. రాజీ ద్వారా పరిష్కరించుకునే అవకాశం ఉన్న కేసులను లోక్ అదాల త్‌లో పరిష్కరించుకోవచ్చని పేర్కొన్నారు. ఈ ఏడాది మార్చిలో నిర్వహించిన లోక్ అదాలత్‌లో 756 కేసులు పరిష్కరించగా, మోటారు వాహన ప్రమాదాలకు సంబంధించిన కేసుల్లో రూ.92.26 లక్షల నష్టపరిహారం ఇప్పించినట్లు తెలిపారు. బ్యాంకు కేసులకు సంబంధించి రూ.30.32 లక్షల మేర పరిష్కారం సాధించినట్లు వివరించారు. జూన్‌లో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 814 కేసులు పరిష్కరించగా, మోటారు వాహనాలకు సంబంధించిన కేసుల్లో రూ.78.65 లక్షల నష్టపరిహారం ఇప్పించినట్లు తెలిపారు. బ్యాంకు కేసులకు సంబంధించి రూ.5.77 లక్షల మేర సెటిల్‌మెంట్ చేసినట్లు పేర్కొన్నారు. జిల్లా న్యాయ సేవా సాధికార సంస్థ ఆధ్వర్యంలో పోక్సో కేసుల్లో బాధితులకు రూ.25 లక్షల పరిహారం మంజూరు కాగా, ఇప్పటివరకు రూ.4 లక్షలు అందజేసినట్లు తెలిపారు. సెప్టెంబర్ 12న జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌లో పరిష్కరించేందుకు 1,776 కేసులను గుర్తించినట్లు జిల్లా సెషన్స్ జడ్జి తెలిపారు. వీటిలో 518 మందికి ఇప్పటికే నోటీసులు జారీ చేసినట్లు చెప్పారు. అదేవిధంగా చెక్ బౌన్స్‌కు సంబంధించిన 1,323 కేసులను గుర్తించి నోటీసులు జారీ చేస్తున్నట్లు వెల్లడించారు. రాజీ మార్గంలో పరిష్కరిం చుకునే అవకాశం ఉన్న కేసులకు సంబంధించిన కక్షిదారులు సెప్టెంబర్ 12న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకొని తమ కేసులను పరిష్కరించుకోవాలని జిల్లా సెషన్స్ జడ్జి ఆర్ సుదర్శన్ కోరారు.

# ఘనంగా పూజల హరికృష్ణ జన్మదిన వేడుకలు



**నంగునూరు, ఆగస్టు 29, :**
సిద్దిపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ జన్మదిన వేడుకలను శనివారం నంగునూరు మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేసి, బాణాసంచా కాల్చారు. పూజల హరికృష్ణకు నాయకులు, కార్యకర్తలు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఏఎంసీ వైస్ చైర్మన్ సాదుల పవన్ కుమార్ మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారం కోసం పూజల హరికృష్ణ నిరంతరం కృషి చేస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ఆయన అందిస్తున్న సేవలను కొనియాడారు. ప్రజల కోసం మరింతగా సేవలందిస్తూ, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. పూజల హరికృష్ణ ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు సంతోషంగా జీవించాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో రాపోల్ రాజహుదూర్ రెడ్డి, ఎండీ ఇమ్రాన్, కర్ణకంటి రవీంద్రచారి, సర్పంచులు రాధాకృష్ణ, మైపాల్ రెడ్డి, రంగు అశోక్, రంగారెడ్డి, రాజేశ్వర్, శ్రీనివాస్ రెడ్డి, జీవన్ నాయక్, ప్రభాకర్, సామ్ రెడ్డి, సంతోష్ రెడ్డి, రవీందర్ రెడ్డి, కరుణాకర్ రెడ్డి, కాటన్ కనకయ్య, చిన్న అజ్మత్, వెంకటేష్, రమేష్‌తో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# నీట్ పీజీ పరీక్షా కేంద్రాల వద్ద నిషేధాజ్ఞలు

## జిల్లా కలెక్టర్ కట్టా హైమావతి



**సిద్దిపేట కలెక్టరేట్, ఆగస్టు 29, :**
ఈనెల 30వ తేదీ ఆదివారం నిర్వహించనున్న నీట్ పీజీ ప్రవేశ పరీక్ష నేపథ్యంలో జిల్లాలోని రెండు పరీక్షా కేంద్రాల చుట్టూ 200 మీటర్ల పరిధిలో భారతీయ నాగరిక భద్రతా సంహిత- 2023లోని 163వ సెక్షన్ నిబంధనలను అమలు చేయాలని ఆదేశాలు జారీ చేసినట్లు జిల్లా కలెక్టర్ కట్టా హైమావతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్ష ప్రశాంతంగా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా నిర్వహించేందుకు ఈనెల 30వ తేదీ ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు లేదా పరీక్ష పూర్తయ్యే వరకు నిషేధాజ్ఞలు అమల్లో ఉంటాయని తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఇండోర్ ఇంజనీరింగ్ కళాశాల, వెరిటాస్ అండ్ విర్టస్ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన రెండు పరీక్షా కేంద్రాల చుట్టూ 200 మీటర్ల పరిధిలో ఐదుగురు లేదా అంతకంటే ఎక్కువ మంది ఒకచోట గుమికూడడం, కర్రలు, కత్తులు, లాఠీలు, ఆయుధాలు లేదా ఇతర హానికరమైన వస్తువులు కలిగి ఉండడం, చట్టవిరుద్ధంగా గుమికూడడం నిషేధించినట్లు పేర్కొన్నారు. అదేవిధంగా పరీక్షా కేంద్రాల చుట్టూ 200 మీటర్ల పరిధిలో ఉన్న ప్రతుల కేంద్రాలు, అంతర్జాల కేంద్రాలు తదితరాలను పరీక్ష జరిగే సమయంలో మూసివేయాలని ఆదేశించినట్లు తెలిపారు. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో సజావుగా జరిగేలా ప్రజలు, సంబంధిత వ్యాపార సంస్థలు, పరీక్షార్థులు మరియు వారి తల్లిదండ్రులు అధికారులకు సహకరించాలని జిల్లా కలెక్టర్ కట్టా హైమావతి కోరారు.

# జాతీయ స్థాయి కబడ్డీ రెఫరీగా అంగడి నరేంద్ర బాబు

- సిద్దిపేట జిల్లా కబడ్డీకి మరో ఘనత



**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, ఆగస్టు 29, :**
సిద్దిపేట జిల్లా కబడ్డీ క్రీడారంగానికి మరో జాతీయ స్థాయి గుర్తింపు లభించింది. సిద్దిపేట జిల్లా కబడ్డీ సంఘం కోచ్ అంగడి నరేంద్ర బాబు జాతీయ స్థాయి కబడ్డీ రెఫరీగా అర్హత సాధించారు. అమేచ్యూర్ కబడ్డీ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి రెఫరీ పరీక్షలో ఆయన విజయవంతంగా అర్హత సాధించడం పట్ల జిల్లా కబడ్డీ సంఘం సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. అంగడి నరేంద్ర బాబు జాతీయ స్థాయి రెఫరీగా అర్హత సాధించడం సిద్దిపేట జిల్లా కబడ్డీ క్రీడకు గర్వకారణమని సంఘం నాయకులు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా సిద్దిపేట జిల్లా కబడ్డీ సంఘం అధ్యక్షులు ఎన్‌సీ సంతోష్ గుప్తా, ప్రధాన కార్యదర్శి కుంటనోళ్ల శివకుమార్ నరేంద్ర బాబును అభినందించారు. ఇప్పటికే సిద్దిపేట జిల్లా నుంచి చిల్లీ మహేష్, రమ్య జాతీయ స్థాయి కబడ్డీ రెఫరీలుగా అర్హత సాధించగా, తాజాగా అంగడి నరేంద్ర బాబు కూడా ఈ జాబితాలో చేరడం ద్వారా జిల్లాకు మరో ఘనత దక్కిందన్నారు. జిల్లా నుంచి మరింత మంది క్రీడాకారులు, రెఫరీలు జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సంఘం కోశాధికారి సత్యం, ఉపాధ్యక్షులు రాజు, సంయుక్త కార్యదర్శులు మహేష్, కరుణాకర్‌తో పాటు సంఘం సభ్యులు, క్రీడాకారులు పాల్గొని అంగడి నరేంద్ర బాబుకు అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు.

# 45 ఏళ్ల నాటి వేప చెట్ల నరికివేత

- అనుమతి లేకుండా జేసీబీలతో తొలగించారని భూయజమాని ఫిర్యాదు
- ఫారెస్ట్, పోలీస్ అధికారులకు, జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏవోకి వల్లెపు రాజు వినతి



**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, ఆగస్టు 29, :**
తన భూమిలో ఉన్న సుమారు 45 సంవత్సరాల పైబడిన వేప చెట్లను తన అనుమతి లేకుండా కొందరు వ్యక్తులు గొడ్డళ్లతో నరికి, జేసీబీల సహాయంతో తొలగించారని భూయజమాని వల్లెపు రాజు ఆరోపించారు. ఈ ఘటనపై ఫారెస్ట్, పోలీస్ అధికారులకు, జిల్లా కలెక్టర్ కార్యాలయంలో శనివారం అధికారులకు ఫిర్యాదు చేసి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.వల్లెపు రాజు తెలిపిన వివరాల ప్రకారం తన భూమికి సంబంధించి ఇతరులతో వివాదం ప్రస్తుతం హైకోర్టులో పెండింగ్‌లో ఉంది. ఈ నేపథ్యంలో తనకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా భూమిలోకి ప్రవేశించి సుమారు 45 ఏళ్లకు పైబడిన వేప చెట్లను గొడ్డళ్లతో నరికివేసి, జేసీబీల ద్వారా చెట్ల కలపను తొలగించినట్లు తెలిపారు.ఎన్నో సంవత్సరాలుగా పెరిగిన వేప చెట్లను తొలగించడం వల్ల తనకు ఆస్తి నష్టం వాటిల్లడంతో పాటు పర్యావరణానికి కూడా నష్టం కలిగిందని పేర్కొన్నారు. చెట్ల నరికివేతకు బాధ్యులైన వారిని గుర్తించి, వర్తించే అటవీ చట్టాలు, ఇతర చట్టాల ప్రకారం కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. అధికారులు వెంటనే సంఘటనా స్థలాన్ని పరిశీలించి, చెట్ల నరికివేతకు సంబంధించిన వివరాలను నమోదు చేయాలని, జేసీబీల వినియోగం, చెట్ల తొలగింపు తదితర అంశాలపై సమగ్ర విచారణ చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. తన భూమిలో భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, చెట్ల నరికివేతకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు, భూమికి సంబంధించిన పత్రాలు తదితర ఆధారాలను అధికారులకు అందజేసినట్లు వల్లెపు రాజు తెలిపారు. పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా కూడా ఈ ఘటనను తీవ్రంగా పరిగణించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

# రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయకుంటే ఉద్యమం ఉధృతం

- సెప్టెంబర్ 8న హైదరాబాద్‌లో నిరసన దీక్ష
- రాష్ట్ర రెడ్డి జేఏసీ అధ్యక్షులు అప్పమ్మగారి రాంరెడ్డి

**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, ఆగస్టు 29, :**
రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రెడ్డి కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయడంతో పాటు రెడ్డి సామాజిక వర్గంలోని నిరుపేదలను ఆదుకోవాలని రాష్ట్ర రెడ్డి జేఏసీ అధ్యక్షులు అప్పమ్మగారి రాంరెడ్డి డిమాండ్ చేశారు. ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. శనివారం సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో జిల్లా రెడ్డి జేఏసీ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సెప్టెంబర్ 8న హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద నిర్వహించనున్న నిరసన దీక్షకు సంబంధించిన పోస్టర్‌ను అప్పమ్మగారి రాంరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడేళ్లు కావస్తున్నా రెడ్డి సామాజిక వర్గానికి ఇచ్చిన హామీలను ఇప్పటి వరకు నెరవేర్చలేదని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రెడ్డి సామాజిక వర్గాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రతిపక్ష నాయకుడిగా ఉన్న సమయంలో పలు రెడ్డి బహిరంగ సభల్లో హామీ ఇచ్చారని గుర్తుచేశారు. రెండేళ్ల క్రితం రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని ప్రకటించినప్పటికీ ఇప్పటి వరకు అమలు చేయలేదన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రెడ్డి సామాజిక వర్గం కోసం హైదరాబాద్‌లో రెండు ఎకరాల భూమిని కేటాయించిందని, ప్రస్తుతం ఆ భూమిని స్వాధీనం చేసుకునేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ప్రభుత్వం ఆ ప్రయత్నాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. రైతు బీమా పథకాన్ని కూడా ఎత్తివేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. రెడ్డి సామాజిక వర్గ సమస్యలు, హక్కుల సాధన కోసం సెప్టెంబర్ 8న హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద రాష్ట్ర రెడ్డి జేఏసీ ఆధ్వర్యంలో వేలాది మందితో నిరసన దీక్ష




చేపట్టనున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా రెడ్డి సామాజిక వర్గ ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి దీక్షను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా రెడ్డి జేఏసీ అధ్యక్షులు అయిలేని మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రెడ్డి సామాజిక వర్గంలోని నిరుపేదలను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. రెడ్డి సామాజిక వర్గ హక్కుల సాధన కోసం అవసరమైనన్ని పోరాటాలు చేస్తామని తెలిపారు. సెప్టెంబర్ 8న హైదరాబాద్‌లో జరిగే నిరసన దీక్షకు జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా రెడ్డి జేఏసీ గౌరవ అధ్యక్షులు మా రెడ్డి రాంలింగారెడ్డి, ప్రధాన కార్యదర్శి పన్యాల విష్ణువర్ధన్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు ముక్కిస తిరుపతిరెడ్డి, దుర్గారెడ్డి, ఇర్రి ఉమారెడ్డి, చల్లారం పద్మారెడ్డి, వంగ శైలజారెడ్డి, గూడ పద్మారెడ్డి, పాతూరి వెంకట్‌రెడ్డి, పార్థివరెడ్డి, సంతోష్‌రెడ్డి, రాంరెడ్డి, రాజిరెడ్డి, అయిలేని గాల్‌రెడ్డి, లింగారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, గూడ బాల్‌రెడ్డి, చంద్రారెడ్డి, లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఖైదీలకు న్యాయ సహాయం అందించేందుకు ప్రత్యేక చర్యలు

**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, ఆగస్టు 29, :**
తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, హైదరాబాద్, సిద్దిపేట జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ జి సుదర్శన్ ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె సౌజన్య శనివారం సాయంత్రం సిద్దిపేట జిల్లా జైలును సందర్శించారు. ఈ సందర్భంగా జైలులోని ఖైదీలతో ఆమె మాట్లాడి వారి యోగక్షేమాలు, వ్యక్తిగత సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఖైదీల వంటగది, నిల్వ గది, మరుగుదొడ్లను పరిశీలించారు. ఖైదీలకు అందిస్తున్న భోజనం, వసతుల గురించి జైలు సూపరింటెండెంట్




వికాస్‌ను అడిగి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం కె సౌజన్య మాట్లాడుతూ ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. ఖైదీలకు ఎదురవుతున్న సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ప్రతి ఖైదీకి న్యాయవాది ఉండేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. న్యాయవాదులు లేని ఖైదీలకు న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయ సహాయం అందిస్తామని తెలిపారు. న్యాయ సహాయ రక్షణ న్యాయవాదులు ప్రతి వారం జైలును సందర్శించి, న్యాయవాది అవసరమైన ఖైదీలకు తగిన న్యాయ సహాయం అందిస్తారని వివరించారు. ఈ కార్యక్రమంలో సహాయ న్యాయ సహాయ రక్షణ న్యాయవాదులు ఎం. రవికుమార్, డి రవీందర్, జైలు సూపరింటెండెంట్ వికాస్, జైలు సిబ్బంది, న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశాలకు ఎమ్మెల్యే కవ్వంపల్లి హాజరు

- కల సాకారమైన వేళ పేద కుటుంబాల ఆనందం అనిర్వచనీయం

**మానకొండూర్ ప్రతినిధి, ఆగష్టు 29, :**
సొంతింటి కల సాకారమవుతున్న వేళ పేద కుటుంబాల కళ్లల్లో కనిపించే ఆనందాన్ని చూడటం ద్వారా పొందిన అనుభూతి అనిర్వచనీయమని మానకొండూర్ ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. ఇల్లంతకుంట మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసుకున్న 40 మంది లబ్ధిదా[illegible]నిర్వహించిన గృహప్రవేశ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ ఇల్లంతకుంటలో 40 మంది ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు తమ సొంత ఇళ్లలోకి అడుగుపెట్టడం, ఆ ఆనందోత్సవాల్లో తాను భాగస్వామి కావడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. ఎన్నో ఏళ్లుగా సొంతింటి కోసం ఎదురుచూసిన పేద కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలిచి వారి కలను సాకారం చేస్తోందని తెలిపారు. గృహప్రవేశాల సందర్భంగా లబ్ధిదారుల కుటుంబ సభ్యుల కళ్లల్లో కనిపించిన ఆనందం తనను ఎంతో సంతోషానికి గురిచేసిందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. పేద కుటుంబాలకు సొంత ఇల్లు కల్పించి, వారి జీవితాల్లో భద్రత, ఆత్మగౌరవం, ఆనందం నింపడమే ఇందిరమ్మ ఇళ్ల పథకం లక్ష్యమని అన్నారు. ఈ సంతోషాన్ని, ఈ ఆత్మగౌరవాన్ని పేద ప్రజలకు ఇవ్వాలనే రేవంత్ రెడ్డి ప్రభుత్వం కోరుకుంటోందని ఆయన చెప్పారు. ఇది కేవలం ఇల్లు కాదు, ఒక భరోసా అని, ఇందిరమ్మ ఇళ్లు పేదవాడి ఆత్మగౌరవానికి ప్రతీక ఎమ్మెల్యే పేర్కొన్నారు. గత ప్రభుత్వం పేదల ఇళ్ల కలను కల్లలుగా మిగిల్చిందని ఆయన విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రతి నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసిందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ దశలవారీగా ఇల్లు ఇస్తామని ఆయన స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేసుకుని గృహప్రవేశాలు చేసుకున్న కుటుంబాలకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కొత్త ఇళ్లలోకి అడుగుపెట్టిన లబ్ధిదారులు తమ ఆనందాన్ని ఎమ్మెల్యేతో పంచుకున్నారు. తమకు సొంతింటి కల నెరవేరేందుకు సహకరించిన ప్రభుత్వానికి, అధికారులకు, ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. గృహప్రవేశ కార్యక్రమాలు కుటుంబ సభ్యులు, బంధువులు, స్థానికుల సందడితో ఆనందోత్సాహాల మధ్య జరిగాయి.ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి శశికళ, తహసీల్దార్ సురేష్, హౌసింగ్ డీఈ సాజిద్ ఇల్లంతకుంట సర్పంచ్ మామిడి రాజు, ఇల్లంతకుంట ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం చైర్మన్ ఊట్కూరి వెంకటరమణారెడ్డి, రేపాక, రామోజీపేట, వల్లంపట్ల, వెంకట్రావుపల్లి సర్పంచులు కాత మల్లేశం, చొప్పరి భూమయ్య, నేరెళ్ల విజయ్ గౌడ్, చల్ల నవీన్ రెడ్డి, పార్టీ నాయకులు పసుల వెంకటి, ఎలగందుల ప్రసాద్, తిరుపతి, తూముకుంట రాజేందర్ రెడ్డి, బాల్ రెడ్డి, సుధాకర్ రెడ్డితోపాటు వివిధ గ్రామాల పార్టీ అధ్యక్షులు,నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### నోటు బుక్కుల పంపిణీ

మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో



శనివారం మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ విద్యార్థులకు నోటు బుక్కులు పంపిణీ చేశారు. అనంతరం అంగన్ వాడీ కేంద్రం భవనాన్ని ఆయన ప్రారంభించారు.

### వల్లంపట్లలో

ఇల్లంతకుంట మండలం వల్లంపట్ల గ్రామంలో నూతనంగా నిర్మించిన గంగోత్రి మహిళా సంఘం (వీవో) భవనాన్ని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ శనివారం ప్రారంభించారు. సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భవన ప్రారంభోత్సవం జరుపుకోవడం ముదావహమని పేర్కొంటూ స్థల ధాత కట్ట సౌమ్య–శ్రీకాంత్ రెడ్డిలను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో మండల ఎంపీడీవో శశికళ, తహసీల్దార్ సురేష్, వల్లంపట్ల గ్రామ సర్పంచ్ నేరెళ్ల విజయ్ గౌడ్, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు ఆల శ్రీనివాస్ రెడ్డి, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు కట్ట సౌమ్య, పార్టీ నాయకులు ఎల్క అనిల్ కుమార్, నరేందర్, ఎలగందుల ప్రసాద్, శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# రీ సర్వే పనులను పకడ్బందీగా, వేగవంతంగా పూర్తి చేయాలి

- జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) లత
- నాన్ కెడస్ట్రాల్ రిసర్వే, ఎంజాయ్మెంట్ రీ సర్వే పనుల పరిశీలన

**జగిత్యాల/మేడిపెల్లి, ఆగష్టు 29, :**
మేడిపెల్లి మండలం లోని దమ్మన్నపేట గ్రామంలో శనివారం నాన్ కెడస్ట్రాల్ రీసర్వే, ఎంజాయ్ మెంట్ రీ సర్వే పనులను జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) లత క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రీ సర్వే ప్రక్రియను ప్రణాళికాబద్ధంగా, పకడ్బందీగా చేపట్టి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇప్పటివరకు ఎంత విస్తీర్ణంలో రీ సర్వే పూర్తయింది, ఇంకా ఎంత మేర చేపట్టాల్సి ఉంది, పనులు ఎన్ని రోజుల్లో పూర్తవుతాయనే వివరాలను రెవెన్యూ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆయా గ్రామాల్లో భూమి విస్తీర్ణం ఎంత ఉందని ఆరా తీశారు. సర్వే నంబర్ల వారీగా ఎలాంటి పొరపాట్లు లేకుండా ఖచ్చితత్వంతో రీ సర్వే నిర్వహించాలని సూచించారు. భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భూముల రీ సర్వే కార్యక్రమాన్ని చేపడుతోందని తెలిపారు. ఈ రీసర్వేలో భాగంగా గ్రామ సరిహద్దులను నిర్ధారించి, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, అత్యాధునిక సర్వే పరికరాల సహాయంతో వ్యవసాయ భూములను సర్వే చేయనున్నట్లు చెప్పారు. సర్వే పూర్తయిన అనంతరం భూ వివరాలను ప్రజలకు ప్రకటిస్తామని పేర్కొన్నారు. గ్రామస్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పారదర్శకంగా రీ సర్వే ప్రక్రియను నిర్వహించాలని, ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల మేరకు యుద్ధ ప్రాతిపదికన పనులను పూర్తి చేయాలని అధికారులకు



ఆదేశించారు. మొదట గ్రామ బౌండరీ పై లైసెన్సుడ్ సర్వేయర్లు, మండల సర్వేలు కలిసి రీ సర్వే చేస్తారని. తర్వాత ఒక్కొక్క రైతు వారిగా రీ సర్వే నిర్వహిస్తారని తెలిపారు. జగిత్యాల జిల్లాలో మొదటి విడతగా 70 గ్రామాల్లో రీ సర్వే చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించిందని తెలిపారు. ప్రస్తుతం ఎంజాయ్మెంట్ రీసర్వే కొనసాగుతుందని పేర్కొన్నారు. నడికుడగ్రామంలో నాన్ కెడస్ట్రాల్ రీ సర్వే చేపడుతున్నామని తెలిపారు. రైతులు, గ్రామస్థుల అడిగిన సందేహాలకు తగిన సలహాలు, సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల ఆర్డీవో జీవాకర్ రెడ్డి, తహసీల్దార్ నాగార్జున, సర్వేయర్లు, రెవెన్యూ సిబ్బంది, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# తులిప్స్ స్కూల్లో ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం







**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, ఆగస్టు 29, :**
మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని జాతీయ క్రీడా దినోత్సవాన్ని సిద్దిపేట నియోజకవర్గం ఎన్సాన్ పల్లిలోని తులిప్స్ స్కూల్లో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాలబాలికలకు వివిధ క్రీడా పోటీలు, క్విజ్, వ్యాసరచన నిర్వహించారు. ఆయా విభాగాల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీల్లో ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు క్రీడల ద్వారా శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, జట్టు స్ఫూర్తిని పెంపొందించుకోవాలని నిర్వాహకులు సూచించారు. కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ తాటిపాముల కోటేశ్వర్, ప్రిన్సిపాల్ మిద్దె ప్రశంస, ప్రధానోపాధ్యాయులు బాలరాజ్ వెంకటేశం, ఉపాధ్యాయుల బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఆధునిక చర్మ వైద్య సేవలకు ది స్కిన్ అటెలిర్ క్లినిక్ శ్రీకారం



**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, ఆగస్టు 29, :**
మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ కుమార్తె డా. సరిత నూతనంగా ఏర్పాటు చేసిన 'ది స్కిన్ అటెలిర్ క్లినిక్' ప్రారంభోత్సవ కార్యక్రమం శనివారం ఘనంగా జరిగింది. ఈ క్లినిక్ ప్రారంభోత్సవంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో కలిసి మాజీ టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సిరెడ్డి భూపతి రెడ్డి పాల్గొని డా. సరితకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నూతనంగా ఏర్పాటు చేసిన క్లినిక్ ప్రజలకు మెరుగైన చర్మ వైద్య సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఆధునిక వైద్య సదుపాయాలతో ప్రజలకు నాణ్యమైన సేవలు అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్, ఉప్పల్ నియోజకవర్గ ఇన్‌చార్జి మందుముల పరమేశ్వర్ రెడ్డి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హనుమంత్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ నరసింహులు యాదవ్, నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కడియాల ఇందిరా, నిజాంపేట్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కోటపాటి మురళి, బండారి లేఅవుట్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వరగాని వాసు, టేకుల ప్రవీణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సీఐ సురేష్ కు ఘనంగా జన్మదిన శుభాకాంక్షలు

- ఆయురారోగ్యాలతో, ఆనంద సంతోషాలతో మరెన్నో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించిన సొంటి రెడ్డి పున్నారెడ్డి




**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, ఆగస్టు 29, :** జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ సీఐ సురేష్ జన్మదినాన్ని పురస్కరించుకుని శనివారం ఆయనకు మాజీ టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ నాయకులు సొంటి రెడ్డి పున్నారెడ్డి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సీఐ సురేష్‌ను మర్యాదపూర్వకంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన పున్నారెడ్డి, ఆయన ఆయురారోగ్యాలతో, ఆనంద సంతోషాలతో నిండు నూరేళ్లు జీవించాలని ఆకాంక్షించారు. ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందిస్తూ, వృత్తిపరంగా మరెన్నో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అభిలషించారు. ఈ కార్యక్రమంలో వివిధ కాలనీలకు చెందిన కాంగ్రెస్ నాయకులు లెనిన్ నగర్ శ్యామ్, చంద్రగిరి నగర్ మురళింగ, ఉమాదేవి నగర్ మహేష్ కుమార్ గౌడ్, రోడా మేస్త్రి నగర్ హర్భజన్ సింగ్, పీఎం రెడ్డి నగర్ తరుణ్, ఇండస్ట్రియల్ ఈస్ట్ రఘు రెడ్డి తదితరులు పాల్గొని సీఐ సురేష్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించాలి

- బాపూజీ ఉన్నత పాఠశాల చైర్మన్ కరస్పాండెంట్ నవ్వ ప్రభాకర్‌రావు

**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, ఆగస్టు 29, :** విద్యార్థులు చిన్ననాటి నుంచే విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించి తమ ప్రాంతం, జిల్లా, రాష్ట్రం, దేశ ప్రతిష్టను ఇనుమడింపజేయాలని బాపూజీ ఉన్నత పాఠశాల చైర్మన్, కరస్పాండెంట్ నవ్వ ప్రభాకర్‌రావు సూచించారు. జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం జగద్గిరిగుట్ట పరిధిలోని వెంకటేశ్వర నగర్‌లో ఉన్న బాపూజీ ఉన్నత పాఠశాల గ్రౌండ్స్‌లో విద్యార్థులు నిర్వహించిన పలు క్రీడా పోటీలను ఆయన ఉపాధ్యాయులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌రావు మాట్లాడుతూ.. చదువుతో మేధస్సు వికసిస్తుందని, క్రీడలతో మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దారుఢ్యం పెంపొందుతుందని తెలిపారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై కూడా ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. క్రీడా కోటా ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సర్వీసుల్లో ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని వివరించారు. క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచి విజయం సాధించిన విద్యార్థులకు త్వరలో బహుమతులు అందజేస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఈటీ శిక్షకులు జంపయ్య, బాల ప్రసన్నతో పాటు పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.




# జంటనాగుల 6వ వార్షికోత్సవంలో పాల్గొన్న 12వ వార్డు కౌన్సిలర్ పులిమామిడి మమత



**సదాశివపేట, ఆగస్టు 29, :** సదాశివపేట పట్టణం పాతకేరిలోని శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయ ప్రాంగణంలో నెలకొని ఉన్న జంటనాగుల విగ్రహ ప్రతిష్ఠ 6వ వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 12వ వార్డు కౌన్సిలర్ పులిమామిడి మమత రాజు దంపతులు జంటనాగులకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఇట్టి సందర్భంగా పులిమామిడి మమత మాట్లాడుతూ ఇక్కడ ఎల్లమ్మ తల్లి స్వయంబుగా వెలసి ఉన్నారని, కోరిన కోరికలు నెరవేరుస్తూ కొంగు బంగారమై నిలుస్తుందన్నారు. అమ్మవారు చెప్పిన విధంగా ఆలయ ప్రాంగణంలో జంటనాగులను ప్రతిష్టించామని, ఈ నాగులను పూజించి నట్లయితే వారికి సంతానం కలుగుతుందని పులిమామిడి మమత అన్నారు.అనంతరం ఆలయానికి విచ్చేసిన భక్తులకు మహా ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని జంటనాగులను దర్శించుకున్నారు.ఈ కార్యక్రమం ఆలయ అధ్యక్షులు తంగడపల్లి మనోహర్ గౌడ్, కళావతి ఆధ్వర్యంలో జరిగింది. కార్యక్రమంలో పద్మ మాణిక్యం, పరమదాసు, సంగమేష్, మాణయ్య, మడుపతి బ్రహ్మం స్వామి, మహిళలు శశికళ, రాణి, లక్ష్మమ్మ, జయమ్మతో పాటు పీఎంఆర్ యువసేన నాయకులు తాలెల్మ రాము, అనిల్, గుణాకర్, అఖిల్, చెన్వీర్, సోమ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక సమస్యలపై ఆగస్టు 31న మండల కేంద్రాలలో ధర్నాలు జయప్రదం చేయండి

- సిపిఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు

**సదాశివపేట, ఆగస్టు 29, :** సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా అర్హులైన పేదలకు ఇండ్లు, ఇండ్ల స్థలాలు, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, పెన్షన్ లు వెంటనే ఇవ్వాలని సిపిఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు ప్రభుత్వంను డిమాండ్ చేశారు. శుక్రవారం నాడు సదాశివపేట్ లో సిపిఎం కార్యకర్తలు సమావేశంలో మాట్లాడుతూ అర్హులైన పేదలందరికి ఇండ్లు, ఇండ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సదాశివపేట్ లో పేదలు అద్దెలు కట్టలేక అవస్థలుపడుతున్నారని అన్నారు. 260సర్వే నంబర్ లోని ప్రభుత్వం భూమి లో ఇండ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పేదలకు కేరళ రాష్టం మాదిరి రేషన్ షాప్ ద్వారా 14 రకాల నిత్యావసర సరుకులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.విద్యా, వైద్యం ఫ్రీగా అందించాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో నెలకొన్న సమస్యలు వెంటనే పరిష్కారం చేయాలనీ అన్నారు.ప్రభుత్వ ఆసుపత్రి ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేయాలనీ అన్నారు.సూదులు, మందులు,కనీస సౌకర్యాలు కల్పించాలని అన్నారు.పేదలు నివసించే కాలనీలలో డ్రైనేజీ, రోడ్లు, వీదిలైట్లు, మంచినీటి సౌకర్యాలు కల్పించాలని అన్నారు. స్థానిక సమస్యల పరిష్కారం కొరకు ఆగస్టు 31న జరిగే ధర్నా లో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమం సిపిఎం మండల కార్యదర్శి ప్రవీణ్, నాయకులు రమేష్ గౌడ్,గోపాల్,శ్రీనివాస్, దశరథ్ తదితరులు పాల్గొన్నారు.



# నిప్పు లేకుండా 50 రకాల వంటకాలు

## కాకతీయ విద్యార్థుల అద్భుత ప్రతిభ

- ఘనంగా సాంస్కృతిక ఉత్సవం




**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, ఆగస్టు 29, :** సిద్దిపేట జిల్లా కేంద్రంలోని కాకతీయ ఉన్నత పాఠశాలలో ప్రాథమిక తరగతుల విద్యార్థులు నిప్పు ఉపయోగించకుండా వివిధ రకాల ఆహార పదార్థాలను తయారు చేసి తమ ప్రతిభను చాటుకున్నారు. పాఠశాలలో శనివారం నిర్వహించిన సాంస్కృతిక ఉత్సవంలో భాగంగా 'నిప్పు లేకుండా వంట' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు సుమారు 50కి పైగా రకాల వంటకాలను స్వయంగా తయారు చేసి ప్రదర్శించారు. పండ్లు, కూరగాయలు, మొలకలు, సలాడ్లు తదితర ఆరోగ్యకరమైన ఆహార పదార్థాలతో రుచికరమైన వంటకాలను సిద్ధం చేసి అందరినీ ఆకట్టుకున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ బడ్జెట్ పాఠశాలల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జగ్గు మల్లారెడ్డి హాజరై విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్ననాటి నుంచే విద్యార్థులకు స్వయంగా ఆహారాన్ని తయారు చేసుకునే అలవాటును పెంపొం దించడంతో పాటు, ఆరోగ్యకరమైన ఆహారంపై అవగాహన కల్పించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడ తాయని అన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు సంబంధించిన వివిధ రకాల వంటకాలను విద్యార్థులు తయారు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. విద్యార్థుల్లో సృజనాత్మకత, స్వయం ఆధారిత నైపుణ్యాలను పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్ర మాలను మరింతగా నిర్వహించాలని సూచించారు. విద్యార్థులు తయారు చేసిన వంటకాలను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఆసక్తిగా తిలకించి అభినందించారు. కార్యక్రమం సందడిగా సాగింది. పాఠశాల ప్రిన్సిపల్ కవిత, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.





# వంటగది, గురుకుల ప్రాంగణంలో పారిశుధ్యంపై నిర్లక్ష్యం వద్దు

- విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి
- జిల్లా కలెక్టర్ కట్టా హైమావతి

**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, ఆగస్టు 29, :** విద్యార్థులు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా గురుకుల పాఠశాల వంటగది, ప్రాంగణంలో నిత్యం పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కట్టా హైమావతి గురుకుల ప్రిన్సిపల్‌ను ఆదేశించారు. శనివారం మిరుదొడ్డి మండలం అల్వాల గ్రామంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన తయారీ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. విద్యార్థుల కోసం సిద్ధం చేసిన అన్నం, పప్పు, బెండకాయ కూర, రసం, పెరుగు తదితరాలను పరిశీలించిన కలెక్టర్ కూర నాణ్యతను మరింత మెరుగుపరచాలని సూచించారు. సాధారణ ఆహార మెనూ ప్రకారం గుడ్డు ఎందుకు అందించలేదని వంట సిబ్బందిని ప్రశ్నించగా, సాయంత్రం గుడ్డు బజ్జీ అందించేందుకు గుడ్లు ఉడకబెడుతున్నట్లు వారు తెలిపారు. కూరగాయలను కూడా మంచి నాణ్యత కలిగినవే వినియోగించాలని కలెక్టర్ ఆదేశించారు. వంటగది అపరిశుభ్రంగా ఉండటాన్ని గమనించిన కలెక్టర్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. విద్యార్థులు సీజనల్ వ్యాధుల బారిన పడే పరిస్థితి ఎట్టి పరిస్థితుల్లోనూ రాకూడదని స్పష్టం చేశారు. ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం, రాత్రి వంట పూర్తయిన వెంటనే వంటగదిని శుభ్రం చేయాలని ఆదేశించారు. పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం విద్యార్థుల వద్దకు వెళ్లి వారితో కలెక్టర్ ముచ్చటించారు. భోజనం రుచిగా ఉంటుందా.. రోజువారీ మెనూ ప్రకారం ఆహారం అందిస్తున్నారా.. అని అడిగి తెలుసుకున్నారు. భోజనం రుచిగా ఉంటోందని, మెనూ ప్రకారమే ఆహారం అందిస్తున్నారని విద్యార్థులు తెలిపారు. విద్యార్థులు ఆరోగ్యకరమైన అలవాట్లు అలవరుచుకోవాలని సూచించిన కలెక్టర్, ఆహారాన్ని బాగా నమిలి తినాలని, అన్నాన్ని వృథా చేయకూడదని చెప్పారు. అన్నం పరబ్రహ్మ స్వరూపమని, ఆహారానికి విలువనిచ్చి వృథా చేయకుండా తినాలని విద్యార్థులకు సూచించారు.



# అంబేద్కర్ సంఘ భవనాలు పూర్తి చేస్తాం

- అంబేద్కర్ రాజ్యాంగం ద్వారా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు
- దట్నూర్ లో అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన మంత్రి అడ్లూరి

**జగిత్యాల జిల్లా ప్రతినిధి, ఆగష్టు 29, :** జగిత్యాల జిల్లాలో మిగిలిపోయిన అంబేద్కర్ సంఘ భవనాలు పూర్తి చేస్తామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం దట్నూర్ గ్రామంలో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అంబేద్కర్ విగ్రహాన్ని శనివారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి అడ్లూరి మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాజ్యాంగం ద్వారా సమాజంలోని అన్ని వర్గాలకు సమన్యాయం జరుగుతుందని అన్నారు. ప్రపంచం కొనియాడిన మేధావి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అని మంత్రి లక్ష్మణ్ కుమార్ అన్నారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగం ద్వారా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు జరిగిందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ద్వారానే పేద ప్రజల సంక్షేమం జరిగిందని, మాజీ ప్రధాని ఇందిరాగాంధీ ఆలోచనతో దేశంలో ఇందిరమ్మ వాడలు లేని గ్రామాలు లేవని మంత్రి అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని మంత్రి తెలిపారు. గత ప్రభుత్వం సంక్షేమ శాఖకు బాకీ ఉన్న రూ. 100 కోట్లు విడుదల చేసినట్లు మంత్రి వివరించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ తీసుకుంటున్న నిర్ణయాలతో సంక్షేమ హాస్టళ్లలో 10వ తరగతి విద్యార్థులకు 99% ఉత్తీర్ణత సాధించారని మంత్రి వివరించారు. ఎస్సీ సంక్షేమ శాఖ ద్వారా యువతకు ఉన్నత విద్య చదువుకోవడానికి విదేశాల్లో ఉద్యోగ అవకాశాల కోసం శిక్షణ ఇస్తామని మంత్రి తెలిపారు. ధర్మపురి నియోజకవర్గంలో అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని మంత్రి తెలిపారు. బడుగు బలహీన వర్గాలకు ప్రభుత్వం ద్వారా నాణ్యమైన విద్యను అందించడానికి ధర్మపురి నియోజకవర్గంలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటు చేస్తున్నామని ధర్మపురిలో డిగ్రీ కళాశాల మంజూరు చేయించామని మంత్రి వివరించారు. అవకాశాలను సద్వినియోగం చేసుకొని యువకులు రాణించాలని మంత్రి లక్ష్మణ్ కుమార్ పిలుపునిచ్చారు. ధర్మపురి నియోజకవర్గంలో ప్రజలకు అందుబాటులో ఉంది నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నట్లు మంత్రి వివరించారు. దట్నూరు గ్రామంలో బ్రిడ్జి పనులు త్వరలోనే ప్రారంభిస్తామని ఈ సందర్భంగా మంత్రి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బెక్కం గంగారాం, గొల్లపల్లి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రాపల్లి గంగన్న, గొల్లపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ బీమా సంతోష్, జగిత్యాల జిల్లా మాజీ గంధ్రాలయ సంస్థ చైర్మన్ కటారి చంద్రశేఖర్ రావు, అంబేద్కర్ సంఘ జిల్లా అధ్యక్షులు హనుమాడ్లు, గొల్లపల్లి మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు, అంబేద్కర్ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# ప్రజలకు మెరుగైన చర్మ సంరక్షణ సేవలు అందించాలి

- 'ది స్కిన్ అటెలిర్' ప్రారంభోత్సవంలో మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్

**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, ఆగస్టు 29, :** నిజాంపేట్ ఎక్స్ రోడ్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన 'ది స్కిన్ అటెలిర్' స్కిన్ కేర్ సంస్థ ప్రారంభోత్సవ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ శనివారం పాల్గొన్నారు. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ కుమార్తె నూతనంగా ఏర్పాటు చేసిన ఈ సంస్థ ప్రారంభోత్సవానికి హాజరైన కూన శ్రీశైలం గౌడ్, నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ ప్రజలకు మెరుగైన, నాణ్యమైన చర్మ సంరక్షణ సేవలు అందించాలని ఆకాంక్షించారు. 'ది స్కిన్ అటెలిర్' భవిష్యత్తులో మరింత అభివృద్ధి చెంది, ప్రజల ఆదరణ పొందాలని కోరారు. ప్రజల ఆరోగ్యం, అందం, చర్మ సంరక్షణకు సంబంధించిన నాణ్యమైన సేవలు అందించే సంస్థగా మంచి పేరు సంపాదించుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బోడుప్పల్ మాజీ మేయర్ అజయ్ యాదవ్, గ్రంథాలయ చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్ రెడ్డితో పాటు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.



# ఎన్నో ఏండ్ల కల.. నెరవేరిన వేళ..

# సీలింగ్ భూములకు పట్టాల పంపిణీ

- నూతనకల్, మద్దిరాల మండలాల రైతులకు తీరిన భూ సమస్యలు
- భూ సమస్యలకు భూభారతి ద్వారా పరిష్కారం
- మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి





**నూతనకల్, ఆగస్టు 29, :**

రానున్న సంవత్సర కాలంలో రాష్ట్రవ్యాప్తంగా వివాదరహిత భూములన్నిటీని ప్రతి అంగుళాన్ని సర్వే చేసి భూ ఆసాములకు పట్టాలు ఇస్తామని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. శనివారం అయన సూర్యాపేట జిల్లా నూతనకల్ మండల కేంద్రంలో నూతనకల్, మద్దిరాల మండలాలకు సంబంధించి దశాబ్దాల తరబడి పెండింగ్ లో ఉన్న 15 గ్రామాలలోని 1,061 మంది రైతులకు 1,044 ఎకరాలకు పట్టాదారు పాసు పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి మంత్రి మాట్లాడుతూ సాగు చేసుకుంటున్న భూములకు ఏళ్ళ తరబడిగా పట్టాలు లేక రైతులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే భూ భారతి చట్టాన్ని తీసుకువచ్చిందని, దాని ద్వారా వివాద రహిత భూములన్నింటికీ పట్టాదారు పాసు పుస్తకాలు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలలో తాతలనాటి నుండి వస్తున్న భూ సమస్యలకు భూ భారతి ద్వారా పరిష్కారం చేస్తున్నామన్నారు. భూముల సమస్యలకు శాశ్వత పరిష్కారం దిశగా ప్రతి అంగుళం భూమిని అధికారులు సర్వే చేసి నిజమైన ఆసాములకు హక్కు పత్రాలు అందించేందుకు తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తున్నదని వారు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి జిల్లాలో మొదటి విడతన 70 గ్రామాలను ఎంపిక చేసుకొని సర్వే చేయించడం జరిగిందన్నారు. రాష్ట్రంలో పలుచోట్ల రెవెన్యూ, దేవాదాయ, అసైన్డ్ భూములు కబ్జాకు గురవుతుండడం తమ దృష్టికి వచ్చిందని,వీటిని అరికట్టేందుకు తాము కఠిన చర్యలు తీసుకుంటున్నామని, అందులో భాగంగానే రాష్ట్రవ్యాప్తంగా రానున్న సంవత్సరకాలంలో ప్రతి అంగుళాన్ని సర్వే చేస్తామని, వివాదారహిత భూములన్నింటికీ పట్టాదారు పాసుపుస్తకాలు ఇస్తామని పునరుద్ఘాటించారు. పంచాయతీలేని భూములకు, భూములున్న ఆసాములు అందరికీ పట్టాలిస్తామన్నారు. గడచిన రెండున్నర సంవత్సరాలలో రాష్ట్రంలో మహిళలకు 63 వేల కోట్ల రూపాయల వడ్డీ లేని రుణాలు ఇచ్చామని, రానున్న రెండున్నర ఏళ్లలో కూడా అంతే రుణాలు ఇస్తామని, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు, మహిళలకు ఉచిత బస్సు, సన్నబియ్యం, రేషన్ కార్డులు పంపిణీ చేసిన ఘనత తమదేనని మంత్రి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకానికి జనం బ్రహ్మ రథం పడుతున్నారని, రాష్ట్రంలో ప్రతి నియోజకవర్గానికి మొదటి విడత 3500, రెండో విడత 2000 ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చామని, మూడవ, నాలుగో విడతల్లో కూడా ఇస్తామని, ప్రతి నియోజకవర్గంలో అర్హులైన పేదవారందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని మంత్రి వెల్లడించారు. రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 36వేల కోట్ల రూపాయలతో డబుల్, త్రిబుల్ లైన్ల రోడ్లను నిర్మిస్తున్నామని, తుంగతుర్తి నియోజకవర్గానికి 100 కోట్ల రూపాయలతో రోడ్లు మంజూరు చేయడం జరిగిందని, మరో 200 కోట్ల రూపాయల ప్రతిపాదనలు ఉన్నాయని వెల్లడించారు. అలాగే సూర్యాపేట నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు డబుల్ రోడ్లను వేస్తామని తెలిపారు. ప్రజలకు సన్నబియ్యం, రైతు భరోసా, రైతుబంధు ఇస్తున్నామని, ఇందిరమ్మ ఇండ్లను ఎట్టి పరిస్థితులలో ఆపమని, గుడిసె ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చి గుడిశెలేని తెలంగాణగా మారుస్తామని వారు అన్నారు. తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు మాట్లాడుతూ పొలాలను సాగు చేసుకుంటున్న రైతులకు హక్కులు లేనందువల్ల ఎన్నో బాధలకు గురయ్యారని, అలాంటి 60 సంవత్సరాల సమస్య తీర్చినందుకు రెవెన్యూ మంత్రికి రాష్ట్ర ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. పట్టాల పంపిణీతో రైతులు వారి భూములకు హక్కుదారులు అయ్యారని, గతంలో కేంద్రంలో ఉన్న తమ ప్రభుత్వం 25 లక్షల ఎకరాల భూములకు పట్టాలు ఇచ్చిన ఘనత తమకే దక్కిందని, రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో కూడా హక్కు పత్రాలు ఇవ్వడం జరిగిందని, భూమి అనేది రైతుకు ఆత్మ గౌరవం అని, భూమి హక్కు లేకుంటే గుర్తింపు ఉండదని అన్నారు. తుంగతుర్తి నియోజకవర్గంలో పెండింగ్లో ఉన్న రోడ్లను మంజూరు చేయాలని, తుంగతుర్తి నియోజకవర్గానికి అదనంగా ఇండ్లు మంజూరు చేయాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు. జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్ మాట్లాడుతూ దేశంలో సీలింగ్ చట్టం వచ్చిన తర్వాత కూడా అంతకుముందు ఉన్న వివిధ కారణాలవల్ల పట్టాలు రాని వారు రైతుబంధు, రైతు బీమా, రైతు భరోసా, రుణాలు, విత్తనాలు వంటివి రాక అనేక ఇబ్బందులు పడ్డారని, వీటన్నిటిని దృష్టిలో ఉంచుకొని వీటి పరిష్కారానికై రాష్ట్ర ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని తీసుకువచ్చిందని, ఇందులో భాగంగా నూతనకల్ మద్దిరాల మండలాలలోని 15 గ్రామాలలో 3000 ఎకరాలకు పైగా భూములన్ని సర్వే చేసి పరిశీలించి రైతుల పొలాల వద్దకు వెళ్లి వారికి నోటీసులు ఇచ్చిన పిదప ముసాయిదా అర్హుల జాబితాను ప్రకటించడం జరిగిందని, సాగు చేసుకుంటున్న రైతులకు పట్టాలు ఇవ్వడం జరుగుతున్నదని, ఈ రెండు మండలాలలో 1,060 మంది రైతులకు 1,044 ఎకరాలకు పట్టాల పంపిణీ చేస్తున్నట్లు వెల్లడించారు. వీటితోపాటు భూభారతి కింద రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు కూడా ఇస్తున్నామని, ఖాతాలు లేని వారికి కూడా కొత్తగా ఖాతాలు ఇస్తున్నట్టు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో బూస్వాములు జెన్నారెడ్డి వారసులు అయిన రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు జెన్నారెడ్డి వివేక్ రెడ్డిని మంత్రులు సన్మానించారు. రాష్ట్ర రెవెన్యూ, సీసీఎల్ ఏ సెక్రటరీ లోకేష్ కుమార్, ల్యాండ్ సర్వేస్ సెటిల్మెంట్ కమిషనర్ రాజీవ్ గాంధీ హనుమంతు, అడిషనల్ కలెక్టర్ హరి సింగ్, ఆర్డీవోలు, తహసిల్దార్లు పి శ్రీనివాసరావు, రైతు కమిషన్ సభ్యులు చెవిటి వెంకన్న, మార్కెట్ కమిటీ చైర్మన్లు, నూతనకల్ మండల పార్టీ అధ్యక్షుడు కట్ట మల్లారెడ్డి, ఎంపీడీవోలు సునీత, సత్యనారాయణ రెడ్డి వివిధ మండలాల ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

## ప్రజల అవసరాలే ప్రథమ లక్ష్యం.. అభివృద్ధే మా ప్రాధాన్యం

- రూ.1.12 కోట్లతో పెద్దమ్మ నగర్‌లో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన
- బీఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్

**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, ఆగస్టు 29, :**

ప్రజల అవసరాలను తీర్చడమే తమ ప్రథమ లక్ష్యమని, నియోజకవర్గ అభివృద్ధే ప్రధాన ధ్యేయంగా పనిచేస్తున్నామని బీఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ అన్నారు. గాజులరామారం డివిజన్ పరిధిలోని పెద్దమ్మ నగర్ బస్తీలో సుమారు రూ.1.12 కోట్ల నిధులతో నూతనంగా చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు శనివారం ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత 12 ఏళ్లుగా పెద్దమ్మ నగర్ బస్తీలో ప్రజలకు త్రాగునీటి సౌకర్యం, భూగర్భ డ్రైనేజీ వంటి అనేక మౌలిక వసతులను కల్పించడంతో పాటు పలు సమస్యలను పరిష్కరించామని తెలిపారు. ప్రస్తుతం సీసీ రోడ్డు పనులను ప్రారంభించుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. పెద్దమ్మ నగర్ బస్తీ అభివృద్ధికి రానున్న రోజుల్లోనూ తన సహాయ సహకారాలు నిరంతరం అందిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను దశలవారీగా కల్పిస్తూ అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల అధికారులు, పెద్దమ్మ నగర్ బస్తీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు దండుగుల నవీన్, ఉపాధ్యక్షులు దస్తగిరి ఖాన్, మనోహర్, ప్రధాన కార్యదర్శి రమేష్, సంయుక్త కార్యదర్శి జి. ఎస్. శ్రీనివాస్, కోశాధికారి ఎం.డి. ఆరిఫ్, కె. రాము, ఎగ్జిక్యూటివ్ సభ్యులు ఎస్. గోపాల్, పాక్స్ డైరెక్టర్ పరుశ శ్రీనివాస్ యాదవ్, బీఆర్ఎస్ పార్టీ డివిజన్



అధ్యక్షులు విజయరామ్ రెడ్డి, సీనియర్ నాయకులు అడ్వకేట్ కమలాకర్, తెలంగాణ సాయి, సుంకరి చందు, సమ్మయ్య యాదవ్, రాములు గౌడ్, శివ నాయక్, సాయిబాబా, నాగేష్, ఇబ్రహీం ఖాన్, ఇమ్రాన్ బేగ్, చెట్ల వెంకటేష్, మూసాఖాన్, బోయిని మహేష్, చిన్న చౌదరి, బాబీ చౌదరి, ప్రసాద్, శ్రావణ్, అరుణ్, ఆసిఫ్, హమీద్ తదితరులతో పాటు కాలనీ వాసులు పాల్గొన్నారు.

## ఓయూ సిద్దిపేటలో ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో స్పాట్ అడ్మిషన్లు

- ప్రిన్సిపాల్ డాక్టర్ ఛత్రపతి యాదవ్

**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, ఆగస్టు 29, :**

సిద్దిపేటలోని ఉస్మానియా విశ్వవిద్యాలయ పీజీ కళాశాలలో 2026–27 విద్యా సంవత్సరానికి ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో మిగిలిన ఖాళీ సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఛత్రపతి యాదవ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సమగ్ర ఉమ్మడి ప్రవేశ పరీక్ష–2026 స్పాట్ అడ్మిషన్లలో భాగంగా అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. కేటగిరీల వారీగా అందుబాటులో ఉన్న ఖాళీల వివరాలను సంబంధిత ప్రవేశ పరీక్ష వెబ్‌సైట్‌తో పాటు కళాశాల నోటీసు బోర్డులో ప్రదర్శించినట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఆగస్టు 31 నుంచి సెప్టెంబర్ 3వ తేదీ వరకు కళాశాలకు హాజరై పదో తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ, అధ్యయన, కుల, నివాస ధ్రువపత్రాలతో పాటు ప్రవేశ పరీక్ష ర్యాంకు కార్డును సమర్పించాలి. అర్హత సాధించిన అభ్యర్థులు తమ అసలు ధ్రువపత్రాలను తప్పనిసరిగా తీసుకురావాలని, అసలు ధ్రువపత్రాలు లేని అభ్యర్థులకు స్పాట్ అడ్మిషన్ ఇవ్వబడదని స్పష్టం చేశారు. ధ్రువపత్రాల పరిశీలన అనంతరం బదిలీ ధ్రువపత్రం మినహా మిగిలిన అన్ని అసలు ధ్రువపత్రాలను అభ్యర్థులకు తిరిగి అందజేస్తామని తెలిపారు. స్పాట్ అడ్మిషన్ల ద్వారా చేరే అభ్యర్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం వర్తించదని వెల్లడించారు. మొదట ప్రవేశ పరీక్ష–2026లో అర్హత సాధించిన అభ్యర్థులతో ఖాళీలను భర్తీ చేస్తారు. డిగ్రీలో కనీసం 50 శాతం మార్కులు సాధించిన అభ్యర్థులు అర్హులు కాగా, ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులకు 45 శాతం మార్కులు ఉంటే సరిపోతుందని తెలిపారు. అర్హత సాధించిన అభ్యర్థులతో ఖాళీలు పూర్తిగా భర్తీ కాకపోతే, ప్రవేశ పరీక్షలో అర్హత సాధించని అభ్యర్థులతో మిగిలిన సీట్లను భర్తీ చేస్తారు. ప్రవేశ పరీక్ష–2026లో అర్హత సాధించిన అభ్యర్థులకు రూ.1,300, అర్హత సాధించని అభ్యర్థులకు రూ.2,100 ప్రాసెసింగ్ రుసుము చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. మరిన్ని వివరాల కోసం సంబంధిత ప్రవేశ పరీక్ష అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించాలని ప్రిన్సిపాల్ సూచించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఛత్రపతి యాదవ్, సెల్:9848086546 సంప్రదించవచ్చని తెలిపారు.




## ప్రభుత్వ విద్యారంగాన్ని పటిష్టపరచాలి

- కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీని అరికట్టాలి
- సీపీఎం మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్



**కుత్బుల్లాపూర్, ఆగస్టు 29, :**

ప్రభుత్వ విద్యారంగాన్ని పటిష్టపరచడంతో పాటు కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీని అరికట్టాలని సీపీఎం కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్ డిమాండ్ చేశారు. నేడు ప్రగతినగర్‌లో సీపీఎం మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న జిల్లా విద్యా సదస్సును జయప్రదం చేయాలని ప్రజలకు, విద్యావేత్తలకు, ప్రజాస్వామ్య వాదులకు, తల్లిదండ్రుల సంఘాల ప్రతినిధులకు పిలుపునిచ్చారు. జిల్లా విద్యా సదస్సుకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను శనివారం ఉదయం షాపూర్‌నగర్‌లోని సీపీఎం పార్టీ కార్యాలయం వద్ద విడుదల చేశారు. ఈ సందర్భంగా కీలుకాని లక్ష్మణ్ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రభుత్వ రంగ విద్యను బలహీనపరుస్తూ విద్యను కార్పొరేటీకరణ వైపు నడిపిస్తున్నాయని ఆరోపించారు. దీంతో కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీ పెరిగి పేద, మధ్యతరగతి కుటుంబాలు తమ పిల్లలకు నాణ్యమైన విద్య అందించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. దేశంలో అందరికీ నాణ్యమైన ఉచిత విద్య అందించాలంటే విద్యారంగానికి జీడీపీలో కనీసం 6 శాతం నిధులు కేటాయించాలని కొఠారి కమిషన్ నుంచి నూతన విద్యా విధానం–2020 వరకు పలు కమిటీలు, విధానాలు సిఫార్సు చేసినప్పటికీ ఆ స్థాయిలో నిధుల కేటాయింపులు జరగడం లేదని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వాలు కూడా విద్యకు తగిన ప్రాధాన్యం ఇవ్వడం లేదని అన్నారు. కుత్బుల్లాపూర్ మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా తరగతి గదులు లేకపోవడం, మరుగుదొడ్లు అస్తవ్యస్తంగా ఉండటం, తాగునీటి సౌకర్యం సరిగా లేకపోవడం వంటి సమస్యలు తీవ్రంగా ఉన్నాయని లక్ష్మణ్ పేర్కొన్నారు. కొన్ని పాఠశాలల్లో విద్యార్థులు తాగునీటి కోసం చుట్టుపక్కల ఇళ్లను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఉందన్నారు. విద్యార్థుల సంఖ్యకు తగినంత మంది ఉపాధ్యాయులు లేకపోవడంతో పాటు అనేక పాఠశాలల్లో పీఈటీలు లేక విద్యార్థులు క్రీడల్లో వెనుకబడుతున్నారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో కనీస మౌలిక సదుపాయాలు కల్పించకుండా, అక్కడక్కడ కొన్ని తెలంగాణ పబ్లిక్ స్కూళ్లను ఏర్పాటు చేసి ప్రచారానికే ప్రాధాన్యం ఇస్తున్నారని ఆయన విమర్శించారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలను సమానంగా అభివృద్ధి చేసి ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. పేద, మధ్యతరగతి ప్రజల పిల్లలు విద్యకు దూరం కాకుండా ఉచితంగా నాణ్యమైన విద్య అందించాలని, కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీని అరికట్టేందుకు సమగ్ర ఫీజుల నియంత్రణ చట్టాన్ని తీసుకురావాలని కోరారు. విద్యను వ్యాపారంగా మార్చే విధానాలను అరికట్టాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ విద్యను బలోపేతం చేసి పాఠశాలల్లో కనీస సౌకర్యాలు కల్పించకపోతే సీపీఎం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు, పోరాటాలు నిర్వహిస్తామని లక్ష్మణ్ హెచ్చరించారు. నేడు ప్రగతినగర్‌లో జరిగే జిల్లా విద్యా సదస్సుకు ప్రజలు, విద్యావేత్తలు, ప్రజాస్వామ్యవాదులు, తల్లిదండ్రుల సంఘాల ప్రతినిధులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు పసుల అంజయ్య, కరుణాకర్, సాయి, రాజు, రాకేష్, ఉదయ్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

# హలో మాల.. ఛలో సెక్రటేరియట్..

## రోస్టర్ విధానాన్ని సవరించాలని డిమాండ్.



**దుబ్బాక ప్రతినిధి (రాయపోల్), ఆగస్టు 29, :**
మాలల రాజ్యాంగ హక్కులను కాలరాస్తున్న రోస్టర్ విధానాన్ని సవరించాలని డిమాండ్ చేస్తూ 'హలో మాల ఛలో సెక్రటేరియట్' ముట్టడి విజయవంతం చేయాలని జాతీయ మాలమహానాడు పొలిట్ బ్యూరో ఛైర్మన్ ర్యాకం శ్రీరాములు పిలుపునిచ్చారు. శనివారం రాయపోల్ మండల కేంద్రంలో హలో మాల ఛలో సెక్రటేరియట్ ముట్టడి కరపత్రం ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగం మాలలకు కల్పించిన హక్కులను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టు ఆదేశాలు పాటించకుండా ఎస్సీ వర్గీకరణతో మాలలకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. ప్రస్తుతం అమలులో ఉన్న రోస్టర్ విధానం వల్ల మాలలకు అన్యాయం జరుగుతోందని, దీనిని వెంటనే సవరించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. విద్య, ఉద్యోగ రంగాల్లో మాలలకు రాజ్యాంగబద్ధమైన హక్కులు, అవకాశాలు దక్కేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. "హలో మాల.. ఛలో సెక్రటేరియట్" నినాదంతో ఈ నెల 31 సోమవారం సెక్రటేరియట్ ముట్టడికి మాలలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జాతీయ మాలమహానాడు నాయకులు మండల యాదగిరి, మద్దెల చంద్రం, కరికే పర్షరములు, రాంపల్లి సతీష్, నవీన్, అజయ్, భానుప్రసాద్, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

# మద్యానికి బానిస అయిన యువకుడు ఆత్మహత్య

**మిరుదొడ్డి, ఆగస్టు 29, :**
మద్యానికి బానిసైన యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన శనివారం మిరుదొడ్డి మండలంలో చోటుచేసుకుంది. సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండలం ధర్మారం గ్రామానికి చెందిన చిట్యాల రాజిరెడ్డి(34) గత కొద్ది సంవత్సరాలుగా మద్యానికి బానిసై అనారోగ్యానికి గురికావడం జరిగిందని ఎస్సై సతీష్ తెలిపారు. రాజిరెడ్డి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకోవడంతో ఉదయం ఇంటి డోర్లు తెరకపోవడంతో అనుమానం వచ్చిన స్థానికులు కిటికీనుండి చూడడంతో



రాజిరెడ్డి ఆత్మహత్యకు పాల్పడిన విషయాన్ని గమనించి పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

# భాధిత కుటుంబాలను పరామర్శించిన శ్రీనివాస్ రెడ్డి

**దుబ్బాక ప్రతినిధి, ఆగస్టు 29, :**
దుబ్బాక మండలంలో బాధిత కుటుంబాలను దుబ్బాక నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి శనివారం మండల పరిధిలోని గంభీర్‌పూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు భీమసేన తమ్ముడు కరికే అజయ్ కుమార్ మృతి చెందిన విషయం తెలుసుకొని వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా అజయ్ కుమార్ చిత్రపటానికి పూలమాల వేసి







నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి, వారి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అనంతరం ఇటీవల మాతృవియోగం పొందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జింక కనకయ్య కుటుంబాన్ని పరామర్శించారు. దుబ్బాక పట్టణంలోని యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు కడవేర్గు గోపీ తండ్రి నర్సింలు మృతి చెందిన విషయం తెలుకొని నర్సింలు పార్థివదేహనికి పూల వేసి నివాళులు అర్పిచారు. కుటుంబ సభ్యులను పరమర్శించి ప్రగాఢ సనుభూతి తెలిపారు. అంతే కాకుండా పట్టణానికి చెందిన చెట్టి చంద్రకాంత్ అనారోగ్యం మృతి చెందారు. అయన కుటుంబాన్ని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో దుబ్బాక కాంగ్రెస్ పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు మల్లుగారి రామచంద్రారెడ్డి, దుబ్బాక మండల అధ్యక్షుడు కదురి నరేందర్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కొంగరి రవి, వెంకటగిరి తండా గ్రామ సర్పంచ్ రంజ్య నాయక్, కొండే గోపాల్ రెడ్డి, నాయకులు సోలిపేట ప్రసాద్ రెడ్డి, కోమటిరెడ్డి పద్మారెడ్డి, టీజెఎస్ కీసర స్వామి తదితరులు పాల్గొన్నారు.

# ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను వేగవంతం చేయాలి

- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి



**సిద్దిపేట కలెక్టరేట్, ఆగస్టు 29, :**
ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను వేగవంతం చేసి, నోటీసుల జారీ, విచారణ, అభ్యంతరాల పరిష్కారాన్ని నిర్ణీత గడువులో పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం హైదరాబాద్ నుంచి ఉన్నతాధికారులతో కలిసి ఆయన అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులు, ఎన్నికల నమోదు అధికారులు, సహాయ ఎన్నికల నమోదు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో నోటీసుల జారీ, వాటి పంపిణీ, అభ్యంతరాల పరిష్కారం తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న నోటీసులను సంబంధిత వ్యక్తులకు తప్పనిసరిగా అందజేయాలని సూచించారు. నోటీసు అందజేసిన తేదీ నుంచి ఏడు రోజుల గడువు పూర్తైన అనంతరం విచారణ చేపట్టాలని తెలిపారు. ఫిర్యాదులు, అభ్యంతరాలపై నిర్దిష్ట గడువులో విచారణ పూర్తి చేసి, సంబంధిత రికార్డులను పరిశీలించే ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఓటర్ల జాబితాలో గుర్తించిన అసాధారణ అంశాలు, మ్యాపింగ్ జరగని ఓటర్ల జాబితాను గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందుబాటులో ఉంచాలని సూచించారు. అభ్యంతరాలు, దావాల సందర్భంగా సంబంధిత వ్యక్తులు సమర్పించాల్సిన పత్రాలు, ఆధారాలపై ప్రజలకు స్పష్టమైన అవగాహన కల్పించేలా విస్తృత ప్రచారం నిర్వహించాలని తెలిపారు. దావాలు, అభ్యంతరాల ప్రస్తుత స్థితిని ప్రతిరోజూ నోటీసు బోర్డులో నవీకరించాలని, మొత్తం ప్రక్రియలో పారదర్శకత, జవాబుదారీతనం పాటించాలని స్పష్టం చేశారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పరిష్కార ప్రక్రియను సజావుగా నిర్వహించాలని తెలిపారు. ఈ ప్రక్రియకు నియమించిన సహాయ ఎన్నికల నమోదు అధికారులకు అవసరమైన శిక్షణ అందించాలని, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. జిల్లా కలెక్టర్ కట్టా హైమావతి మాట్లాడుతూ జిల్లాలో నోటీసుల విచారణ ప్రక్రియను పూర్తి చేసి, పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. భారత ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా మొత్తం ప్రక్రియను నిర్వహిస్తూ, నిర్ణీత గడువులోగా పూర్తి చేసేలా చర్యలు చేపడుతున్నామని వివరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్, ఆర్డీవోలు సదానందం, చంద్రకళ, రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.




## 22/ఏ జాబితా నుంచి సర్వే నంబర్ల తొలగింపుపై హన్మంత్ రెడ్డికి కాలనీవాసుల కృతజ్ఞతలు

**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, ఆగస్టు 29, :**
నిజాంపేట్ గ్రామంలోని పలు సర్వే నంబర్ల పరిధిలోని భూములను 22/ఏ (ప్రొహిబిటెడ్ ప్రాపర్టీ) జాబితా నుంచి తొలగించేలా కృషి చేసిన కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డికి కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు, నివాసితులు శనివారం ప్రత్యేకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. గత కొంతకాలంగా 22/ఏ నిషేధిత జాబితాలో భూములు ఉండటంతో వెంకట్రాయ్ నగర్, జీఎల్ఎం/జీఎల్ఎస్, సాయి కాలనీ, బాలాజీ కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు తెలిపారు. భూముల క్రయవిక్రయాలు, రిజిస్ట్రేషన్లు తదితర అంశాల్లో సమస్యలు ఎదురవుతున్న నేపథ్యంలో తమ సమస్యను పరిష్కరించాలని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. తాజాగా సర్వే నంబర్లు 233/4, 233/10, 233/11, 233/12తో పాటు



వాటి పరిధిలోని ఇతర భూములను 22/ఏ జాబితా నుంచి మినహాయించేలా చర్యలు తీసుకోవడంతో కాలనీవాసులకు ఎంతో ఊరట లభించిందని తెలిపారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ.. తమ సమస్యను గుర్తించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేసిన కొలన్ హన్మంత్ రెడ్డికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. 22/ఏ జాబితా నుంచి భూములు మినహాయించడంతో తమ భూములకు సంబంధించిన సమస్యలు పరిష్కారమై, భవిష్యత్తులో ఎదురయ్యే అనేక ఇబ్బందులు తొలగుతాయని సంతోషం వ్యక్తం చేశారు. హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ, కాలనీవాసుల సమస్యల పరిష్కారానికి తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని తెలిపారు. ప్రజలకు సంబంధించిన సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారమే తన ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు మురళి, డీసీసీ ప్రధాన కార్యదర్శి మౌళేశ్వర్ రావు, సర్కిల్ అధ్యక్షులు ఇందిరా, సీనియర్ కాంగ్రెస్ నాయకులు సత్యప్రసాద్, శ్రీదేవి, పలు కాలనీ అసోసియేషన్ల నాయకులు, నివాసితులు పాల్గొన్నారు.

# సదాశివపేటలో ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం

- ఒలింపిక్ టార్చ్, బ్యాండ్ మేళాలతో ఆకట్టుకున్న క్రీడా ర్యాలీ – 600 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు

**సదాశివపేట, ఆగస్టు 29, :**
మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని జాతీయ క్రీడా దినోత్సవాన్ని సదాశివపేట పట్టణంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక దుర్గమ్మ గుడి నుండి ప్రారంభమైన క్రీడా ర్యాలీ గాంధీ చౌక్ మీదుగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానానికి చేరుకుంది.ఈ ర్యాలీలో పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన 600 మందికి పైగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థులు ఒలింపిక్ టార్చ్‌లతో పాటు బ్యాండ్ మేళాలతో, తమ తమ పాఠశాలల బ్యానర్లను ప్రదర్శిస్తూ ర్యాలీలో పాల్గొని క్రీడా స్ఫూర్తిని చాటారు.జాతీయ క్రీడా దినోత్సవ కార్యక్రమానికి ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ వెంకటేశం మరియు మున్సిపల్ కమిషనర్ శివాజీ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. శాంతికి చిహ్నంగా శాంతి కపోతాలను గాలిలోకి ఎగరవేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ, మేజర్ ధ్యాన్‌చంద్ దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని, హాకీ క్రీడలో భారతదేశానికి అంతర్జాతీయ స్థాయిలో గౌరవాన్ని తీసుకువచ్చిన గొప్ప క్రీడాకారుడని కొనియాడారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా పాల్గొనాలని, క్రీడలు శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఉల్లాసానికి ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ మంచి అలవాట్లను అలవర్చుకుని ఆరోగ్యకరమైన జీవనశైలిని కొనసాగించాలని సూచించారు.అలాగే ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో విద్యార్థులకు ఉచితంగా క్రీడా శిక్షణ అందిస్తున్న ముజీబ్ మన్సూర్ మాస్టర్‌ను ప్రత్యేకంగా అభినందించారు. పట్టణంలోని విద్యార్థులకు క్రీడా అవకాశాలను అందిస్తూ, ప్రతిభను వెలికితీసేందుకు చేస్తున్న కృషి అభినందనీయమని పేర్కొన్నారు.

### 4×100 మీటర్ల రిలేలో బాలికల ప్రతిభ

అండర్–17 బాలికల 4×100 మీటర్ల రిలే పరుగు పందెంలో మహాత్మ జ్యోతిబాపూలే పాఠశాలకు చెందిన శివాని, ఇందు, ప్రవళిక, స్రవంతి బృందం మొదటి స్థానంలో నిలిచింది. విజేతలకు సంగారెడ్డి జిల్లా సెక్రెటరీ ముజీబ్ గారు ₹2,000 నగదు బహుమతి అందించి అభినందించారు.

### అండర్-17 బాలుర విభాగంలో విజేతలు

అండర్–17 బాలుర పరుగు పందెంలో మోనాప్లే సీబీఎస్ఈ స్కూల్‌కు చెందిన ప్రకాష్ మొదటి స్థానంలో నిలవగా, తారీఫ్ ఖాన్ తెలంగాణ మైనార్టీ స్కూల్‌కు చెందిన విద్యార్థి రెండో స్థానంలో, విజ్ఞాన్ మోడల్ స్కూల్ విద్యార్థి అవేస్ మూడో స్థానంలో నిలిచారు.

### 200 మీటర్ల బాలికల పరుగు పందెం

బాలికలకు నిర్వహించిన 200 మీటర్ల పరుగు పందెంలో మహాత్మ జ్యోతిబాపూలే పాఠశాలకు చెందిన శివాని మొదటి స్థానంలో నిలిచారు. కేజీబీవీ పాఠశాలకు చెందిన పావని రెండో స్థానంలో, విజ్ఞాన్ మోడల్ పాఠశాలకు చెందిన కృషి కుమారి మూడో స్థానంలో



నిలిచారు. విజేతలకు ముఖ్య అతిథులు మెడల్స్ అందజేసి అభినందించారు.ఈ కార్యక్రమంలో డివైఫ్ఐ జిల్లా కార్యదర్శి అనిల్, ఫోటోగ్రాఫర్స్ అధ్యక్షుడు నాగుల విజయకుమార్, వ్యాయామ ఉపాధ్యాయులు కలాలి శ్రీనివాస్ గౌడ్, మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యుడు రెహమత్, శంకర్ గౌడ్, రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు. పట్టణంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులు, యువకులు, క్రీడాభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.క్రీడల పట్ల విద్యార్థుల్లో ఆసక్తిని పెంపొందించడం, ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించడం, పట్టణంలోని ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి వారికి ప్రోత్సాహం అందించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని నిర్వాహకులు తెలిపారు.

# స్వర్గీయ కోట్నక భీంరావుకు ఘన నివాళులు

**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 29,:**
గిరిజన ముద్దుబిడ్డ, ఆదివాసీ తొలి పట్టభద్రుడు, మాజీ గిరిజన శాఖ మంత్రి, తన తండ్రి అయిన స్వర్గీయ కోట్నక భీంరావు 24వ వర్ధంతి సందర్భంగా ఆసిఫాబాద్ శాసన సభ్యురాలు కోవా లక్ష్మీ శనివారం ఆసిఫాబాద్ లోని కోట్నక భీంరావు చిల్డ్రన్ పార్క్ లో ఘన నివాళులు అర్పించారు. తండ్రి విగ్రహానికి పూలమాల వేసి, భావోద్వేగంతో నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "నాన్న చూపిన బాటలోనే నడుస్తూ, ఆదివాసీల అభివృద్ధి కోసం కృషి చేస్తాను. ఆయన ఆశయ సాధనే నా లక్ష్యం" అని అన్నారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, బంధువులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు , ఆదివాసీ సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





# అణు భౌతిక శాస్త్ర పితామహుడు రూథర్‌ఫోర్డ్

## నేడు ఎర్నెస్ట్ రూథర్‌ఫోర్డ్ జయంతి

ఎర్నెస్ట్ రూథర్‌ఫోర్డ్ (ఆగస్టు 30 1871 – అక్టోబరు 19 1937) న్యూజీలాండ్ కు చెందిన ఒక రసాయనిజ్ఞుడు, ఇతనికి అణు భౌతిక శాస్త్ర పితామహుడు అనే బిరుదు గలదు. రసాయన శాస్త్రంలో నోబెల్ బహుమతి (1908) పొందాడు. అణువులలో శక్తితో కూడిన కేంద్రకం వుంటుందని కనిపెట్టాడు. పరమాణువులో ఎలక్ట్రాన్, ప్రోటాన్, న్యూట్రాన్ అనే మూడు ముఖ్యమైన మూలకణాలున్నాయి. ఈ కణాలు పరమాణువులో ఏ విధంగా అమరి ఉన్నాయో తెలియజెప్పేదే పరమాణు నిర్మాణం. దీనికి సంబంధించి శాస్త్రవేత్తలు ఎన్నో నమూనాలను ప్రవేశపెట్టారు. అందులో రూథర్ ఫర్డ్ నమూనా ఒకటి. తను చేసిన – కణ పరిక్షేపణ ప్రయోగ పరిశీలనల ఆధారంగా ఈ నమూనాని ప్రతిపాదించాడు. అణువు యొక్క రూథర్‌ఫోర్డ్ నమూనా (లేదాగ్రహ మండల నమూనా, ఇదే సిద్దాంతం ఆ తరువాత బోర్ నమూనా లేదా కక్ష్యా నమూనాగా ఏర్పడడానికి దోహదపడింది) ను ప్రతిపాదించాడు. ఇతడు రూథర్‌ఫోర్డ్ –కణ పరిక్షేపణ ప్రయోగాన్ని బంగారు రేకు గుండా –కణ పరిక్షేపణ ప్రయోగంచేసి కెంద్రకం యొక్క ఉనికిని కనిపెట్టాడు. ఇతడికి 1908లో రసాయనిక శాస్త్రంలో నోబెల్ బహుమతి లభించింది. న్యూజిలాండ్ లోని నెల్సన్ లో 1871 ఆగస్టు 30న జన్మించిన రూథర్‌ఫర్డ్ కు చిన్నతనంలోనే సైన్స్ పట్ల అభిరుచి కలిగింది. పదేళ్లకే ఎలిమెంటరీ ఫిజిక్స్ పుస్తకాన్ని క్షుణ్ణంగా చదివేశాడు. న్యూజిలాండ్ విశ్వ విద్యాలయంలో స్కాలర్‌షిప్‌తో చేరిన అతడు బీఏ, ఎమ్ఏ, బీఎస్సీ డిగ్రీలు సాధించాడు. ఇంగ్లండ్ లోని కేంబ్రిడ్జి విశ్వ విద్యాలయంలో పోస్ట్‌గ్రాడ్యుయేషన్ చేస్తూనే అత్యంత వేగంగా ప్రయాణించే విద్యుదయస్కాంత తరంగాలను కనిపెట్టి ప్రపంచ రికార్డు సాధించాడు. ఇరవై ఏడేళ్ల వయ–సులోనే కెనడాలోని మెగిల్ విశ్వ విద్యాలయంలో ప్రొఫెసర్‌గా చేరి పరిశోధనల్లో నిమగ్నమయ్యాడు. అక్కడే యురేనియం, థోరియంలాంటి రేడియోధార్మిక పదార్థాలు వెలువరించే ఆల్ఫా, బీటా వికిరణాలను ఆవిష్కరించాడు. రేడియో ధార్మిక విఘటనం (ఞుఒఅశీ ఖ్‌అజవ ఒవఝుఎ) నియమాలను ప్రతిపాదించాడు. ఒక రేడియో ధార్మిక పదార్థంలో ఉండే సగం పరమాణువులు విఘటనం చెందడానికి పట్టే 'అర్థ జీవిత కాలం' ను నిర్వచించాడు. ఈ సూత్రం ప్రకారం రేడియో డేటింగ్ పద్ధతి ద్వారక్వ భూమి వయస్సును కూడా కనుగొనవచ్చని చెప్పాడు. అలాగే కృత్రిమ మూలకాల పరివర్తన ద్వారా నైట్రోజన్‌ను, ఆక్సిజన్‌గా మార్చవచ్చని తెలిపాడు. ఈ పరిశోధనలకు 1908లో నోబెల్ బహుమతి అందుకున్నాడు.

కెనడా నుంచి ఇంగ్లండ్ తిరిగి వచ్చిన తర్వాత పలుచటి బంగారు రేకుపై ధనావేశమున్న ఆల్ఫాకిరణాలను ప్రసరింప చేసినప్పుడు 20000 కణాలలో ఒకటి వెనక్కి తిరిగి రావడాన్ని గమనించాడు. అందుకు కారణం పరమాణువులో ధనావేశమున్న కేంద్రకం ఉండటం కారణంగా కేంద్రకంలో ఉండే ప్రోటాన్లు వాటిని వికర్షించడమేనని కనుగొన్నాడు. సూర్యుడి చుట్టూ గ్రహాలు తిరుగుతున్నట్టే, పరమాణువుల్లోని కేంద్రకం చుట్టూ ఎలక్ట్రాన్లు తిరుగుతూ ఉంటాయని ప్రతిపాదించాడు. ఇదే రూథర్‌ఫర్డ్ పరమాణు నమూనాగా పేరొందింది. దీనినే గ్రహమండల నమూనా అంటారు. ఆ తర్వాత కేంద్రకంలో ప్రోటాన్లతో పాటు న్యూట్రాన్లు ఉంటాయని ఊహించాడు. రసాయన చర్యలతో ఒక మూలకాన్ని వేరొక మూలకంగా మార్చలేం. కానీ కేంద్రక చర్యలతో ఒక మూలకాన్ని మరొక మూలకంగా మార్చవచ్చు. స్థిరమైన మూలక కేంద్రకాలను – కణం లేదా ప్రోటాన్‌తో తాడించడం వల్ల వాటిని వేరొక మూలకాలుగా మార్చొచ్చు. ఈ ప్రక్రియను కృత్రిమ పరివర్తనం అంటారు. రూథర్‌ఫర్డ్ మొదటిసారిగా నత్రజనిని ఆక్సిజన్‌గా మార్చాడు. ఆ విధంగా ఏర్పడిన మూలకాలు కొన్ని రేడియో ధార్మికతను ప్రదర్శిస్తాయి. వాటిని రేడియో ఐసోటోపులు అంటారు. వాటిని మనం వైద్యరంగంలో, వ్యవసాయ రంగంలో, పరిశ్రమల్లో ఉపయోగిస్తున్నాం .ఆయన శిష్యుల్లో చాలా మంది నోబెల్ బహుమతులు సాధించడం విశేషం. అనేక అవార్డులు సాధించిన ఆయన గౌరవార్థం 104 అణుసంఖ్య ఉన్న మూలకానికి రూథర్ ఫోర్డియం అని పేరు పెట్టారు.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# అదృశ్యమైన మనుషులు.. మిగిలేది అంతులేని వేదన!

### నేడు అంతర్జాతీయ తప్పిపోయిన వారి దినోత్సవం

### బలవంతపు అదృశ్యాలు మానవ హక్కులపై చెరగని మచ్చలు

### ఆచూకీ కోసం ఏళ్ల తరబడి కుటుంబాల నిరీక్షణ

### సత్యం చెప్పడం.. న్యాయం చేయడం ప్రభుత్వాల బాధ్యత

### మనిషి స్వేచ్ఛ, గౌరవం కంటే ఏ అధికారమూ గొప్పది కాదు




ప్రపంచంలో ఒక మనిషి మరణించాడని తెలిస్తే కుటుంబం కన్నీళ్లతోనైనా ఆ నిజాన్ని అంగీకరించే ప్రయత్నం చేస్తుంది. కానీ తమ వ్యక్తి బతికే ఉన్నాడో.. మరణించాడో.. ఎక్కడున్నాడో కూడా తెలియకుండా ఏళ్ల తరబడి ఎదురుచూడాల్సి వస్తే..? ఆ బాధకు అంతముండదు. ఆ నిరీక్షణకు సమాధానం ఉండదు. అలాంటి వేలాది కుటుంబాల వేదనను ప్రపంచానికి గుర్తుచేసే రోజే ఆగస్టు 30 – అంతర్జాతీయ తప్పిపోయిన వారి దినోత్సవం.

### నియంతృత్వాల నీడలో మొదలైన పోరాటం

ఈ దినోత్సవం వెనుక మానవ హక్కుల చరిత్రలోనే అత్యంత విషాదకరమైన అధ్యాయం ఉంది. లాటిన్ అమెరికాలో సైనిక నియంతృత్వ పాలనల కాలంలో ప్రభుత్వాలను ప్రశ్నించిన రాజకీయ కార్యకర్తలు, సామాజిక ఉద్యమకారులు, విద్యార్థులు, సామాన్యులు పెద్ద సంఖ్యలో అదృశ్యమయ్యారు. తమవారు ఎక్కడున్నారో చెప్పాలంటూ బాధిత కుటుంబాలు చేసిన పోరాటమే క్రమంగా అంతర్జాతీయ ఉద్యమంగా మారింది. బలవంతంగా అదృశ్యమైన వారి కుటుంబాలకు చెందిన సంఘాలు ఈ సమస్యను ప్రపంచం ముందుకు తీసుకొచ్చాయి. అనంతర కాలంలో ఐక్యరాజ్యసమితి కూడా బలవంతపు అదృశ్యాల సమస్యపై ప్రత్యేక దృష్టి సారించింది. ఇలాంటి ఘటనల పరిశీలనకు ప్రత్యేక కార్యబృందాన్ని ఏర్పాటు చేయడంతో పాటు బలవంతపు అదృశ్యాల నుంచి వ్యక్తులను రక్షించేందుకు అంతర్జాతీయ స్థాయిలో చట్టపరమైన వ్యవస్థలను బలోపేతం చేసే ప్రయత్నాలు జరిగాయి.

### అదృశ్యం అంటే.. ఒక మనిషినే కాదు

బలవంతపు అదృశ్యం అంటే ఒక వ్యక్తిని ప్రభుత్వ యంత్రాంగం, భద్రతా బలగాలు లేదా వాటి మద్దతుతో పనిచేసే వ్యక్తులు అదుపులోకి తీసుకుని.. ఆ తర్వాత అతడి ఆచూకీ లేదా పరిస్థితి గురించి సమాచారం ఇవ్వకుండా దాచిపెట్టడం. ఇది కేవలం ఒక వ్యక్తి స్వేచ్ఛను హరించడం మాత్రమే కాదు. ఒక కుటుంబాన్ని జీవితాంతం అనిశ్చితిలోకి నెట్టే తీవ్రమైన మానవ హక్కుల ఉల్లంఘన. "బతికే ఉన్నారా..? మరణించారా..? ఎక్కడున్నారు..?" అనే ప్రశ్నలకు సమాధానం దొరకక కుటుంబ సభ్యులు అనుభవించే మానసిక వేదన వర్ణనాతీతం. ఆచూకీ కోసం కార్యాలయాల చుట్టూ తిరగడం, న్యాయస్థానాలను ఆశ్రయించడం, ఏ చిన్న సమాచారం వచ్చినా తమవారే కావచ్చనే ఆశతో పరుగులు తీయడం.. ఇలా వారి జీవితమే నిరీక్షణగా మారిపోతుంది.

### ప్రపంచాన్ని వెంటాడుతున్న విషాదం

లాటిన్ అమెరికాలోని అర్జెంటీనా, చిలీ, గ్వాటెమాలా, ఎల్ సాల్వడార్ వంటి దేశాల్లో గత సైనిక పాలనల కాలంలో జరిగిన బలవంతపు అదృశ్యాలపై ఇప్పటికీ బాధిత కుటుంబాలు సత్యం, న్యాయం కోసం పోరాడుతున్నాయి. ఆసియాలో శ్రీలంక అంతర్యుద్ధం, నేపాల్‌లో సాయుధ సంఘర్షణల కాలంలోనూ అనేక అదృశ్యం కేసులు నమోదయ్యాయి. పాకిస్తాన్, బంగ్లాదేశ్ తదితర దేశాల్లోనూ ఇలాంటి ఆరోపణలు మానవ హక్కుల చర్చల్లో తరచూ ప్రస్తావనకు వస్తున్నాయి. సిరియా, ఇరాక్, లెబనాన్ తదితర సంఘర్షణ ప్రభావిత ప్రాంతాల్లో యుద్ధాలు, అంతర్గత ఘర్షణలు, ఉగ్రవాదం కారణంగా ఆచూకీ తెలియకుండా పోయిన వారి సమస్య మరింత సంక్లిష్టంగా మారింది. యుద్ధం ముగిసినా.. పాలకులు మారినా.. తమవారి కోసం ఎదురుచూసే కుటుంబాల నిరీక్షణ మాత్రం ముగియడం లేదు.

### భారత్‌లోనూ వినిపించిన ప్రశ్నలు

భారత్‌లోనూ సంఘర్షణ ప్రభావిత ప్రాంతాల్లో అదృశ్యాల ఆరోపణలు గతంలో చర్చకు వచ్చాయి. ముఖ్యంగా కాశ్మీర్, ఈశాన్య రాష్ట్రాల్లో ఉగ్రవాదం, తిరుగుబాట్లు, భద్రతా చర్యల నేపథ్యంలో పలువురు అదృశ్యమైనట్లు బాధిత కుటుంబాలు, మానవ హక్కుల సంస్థలు ఆరోపించిన సందర్భాలున్నాయి. ఆయా కేసుల్లో నిజానిజాలను వెలికితీసి బాధిత కుటుంబాలకు సమాధానం చెప్పాలని పౌర సమాజ సంస్థలు కోరుతూ వచ్చాయి.

### కుటుంబాలకు కావాల్సింది ఒక్కటే.. నిజం

బలవంతపు అదృశ్యాల విషయంలో బాధిత కుటుంబాలు కోరుకునేది మొదట సత్యమే. తమవారు ఏమయ్యారు..? ఎక్కడున్నారు..? వారికి ఏం జరిగింది..? అనే ప్రశ్నలకు సమాధానం తెలుసుకునే హక్కు వారికి ఉంది. జరిగిన అన్యాయంపై నిష్పక్షపాత విచారణ జరిపి, బాధ్యులను చట్టం ముందు నిలబెట్టడం, బాధిత కుటుంబాలకు తగిన పరిహారం, పునరావాసం కల్పించడం ప్రభుత్వాల బాధ్యత. అంతటితో సరిపోదు. మరో కుటుంబానికి ఇలాంటి వేదన ఎదురుకాకుండా చట్టపరమైన రక్షణ వ్యవస్థలను పటిష్ఠం చేయాలి. అరెస్టులు, నిర్బంధాల విషయంలో పారదర్శకత ఉండాలి. అధికార దుర్వినియోగానికి అవకాశం లేకుండా జవాబుదారీతనాన్ని పెంచాలి. మానవ హక్కుల పరిరక్షణను ప్రభుత్వ వ్యవస్థలో విడదీయలేని భాగంగా మార్చాలి.

### జ్ఞాపక దినం కాదు.. న్యాయం కోసం పిలుపు

అంతర్జాతీయ తప్పిపోయిన వారి దినోత్సవం క్యాలెండర్‌లో మరో జ్ఞాపక దినం మాత్రమే కాదు. సమాధానం కోసం ఎదురుచూస్తున్న కుటుంబాల గొంతుకకు ప్రపంచం చెవివిప్పాల్సిన రోజు. అధికారానికి హద్దులు ఉన్నాయని.. ప్రతి మనిషికీ జీవించే హక్కు, స్వేచ్ఛ, గౌరవం ఉన్నాయని గుర్తుచేసే రోజు. ఒక మనిషిని బలవంతంగా అదృశ్యం చేయడం అంటే అతడి ఉనికిని మాత్రమే చెరిపేయడం కాదు.. ఒక కుటుంబం ఆశలను, వారి ప్రశాంతతను, సమాజం న్యాయంపై పెట్టుకున్న నమ్మకాన్ని కూడా దెబ్బతీయడమే. యుద్ధమైనా.. రాజకీయ సంఘర్షణైనా.. ఉగ్రవాదమైనా.. అధికార ప్రదర్శనైనా.. మనిషి ప్రాణం, స్వేచ్ఛ, గౌరవం కంటే గొప్పవి కావు. అదృశ్యమైన ప్రతి మనిషి వెనుక సమాధానం కోసం ఎదురుచూస్తున్న ఒక కుటుంబం ఉందన్న సత్యాన్ని ప్రపంచం మరవకూడదు.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# వెండితెర సత్యభామ.. జమున

### ఆగస్టు 30.. జమున జన్మదినం

జనాభాయి అంటే ఎవరో చాలామందికి తెలియకపోవచ్చు. జూలూరి జమున అన్నా వెంటనే గుర్తుపట్టకపోవచ్చు. కానీ 'జమున' అనగానే తెలుగు సినీ ప్రేక్షకుల మదిలో ఓ అపురూప రూపం మెదులుతుంది. గడుసుదనం.. గాంభీర్యం.. అందం.. అభినయం.. ఆత్మవిశ్వాసం కలగలిసిన కథానాయిక గుర్తుకొస్తుంది. మరీ ముఖ్యంగా సత్యభామ అంటే జమున.. జమున అంటే సత్యభామ అన్నంతగా ఆ పాత్రపై తనదైన ముద్ర వేసిన అలనాటి మేటి నటి ఆమె. జమున 1936 ఆగస్టు 30న హంపీలో జన్మించారు. తల్లి కౌసల్యాదేవి, తండ్రి వ్యాపారవేత్త నిప్పని శ్రీనివాసరావు. ఆమె బాల్యం గుంటూరు జిల్లా దుగ్గిరాలలో గడిచింది. తల్లిదండ్రులు తొలుత పెట్టిన పేరు జనాభాయి. జన్మ నక్షత్రం ప్రకారం నది పేరు ఉండాలన్న సూచనతో మధ్యలో 'ము' అక్షరాన్ని చేర్చి జమునగా మార్చారు. సినిమా రంగంలోకి వచ్చిన తర్వాత పెట్టుకున్న పేరు కాదది. చిన్నతనం నుంచే జమునకు కళలపై ఆసక్తి ఎక్కువ. శాస్త్రీయ సంగీతం, హార్మోనియంలో శిక్షణ పొందారు. పాఠశాల రోజుల నుంచే నాటకాల్లో నటించేవారు. సినీనటుడు జగ్గయ్యది కూడా దుగ్గిరాల కావడంతో ఆయన కుటుంబంతో జమున కుటుంబానికి పరిచయం ఉండేది. తెనాలి సమీపంలోని మండూరు గ్రామంలో ప్రదర్శించిన 'ఖిల్జీ రాజ్య పతనం' నాటిక కోసం జగ్గయ్య ఆమెను ఎంపిక చేశారు. అందులో గుమ్మడి వెంకటేశ్వరరావు కూడా నటించారు. రంగస్థలంపై జమున చూపిన ప్రతిభే ఆమెకు సినిమా అవకాశాల ద్వారాలు తెరిచింది. బి.వి.రామానందం దర్శకత్వంలో వచ్చిన 'పుట్టిల్లు'తో 1953లో జమున వెండితెరకు పరిచయమయ్యారు. ఆ తర్వాత వెనుదిరిగి చూసుకోవాల్సిన అవసరం రాలేదు. నందమూరి తారక రామారావు, అక్కినేని నాగేశ్వరరావు, జగ్గయ్య వంటి అగ్ర కథానాయకుల సరసన నటించి తెలుగు చిత్రసీమలో అగ్ర కథానాయికగా ఎదిగారు. జమున సినీ జీవితంలో ఎన్నో పాత్రలు పోషించినా 'సత్యభామ' ఆమెకు ప్రత్యేక గుర్తింపు తెచ్చింది. 'వినాయక చవితి'లో తొలిసారి సత్యభామగా కనిపించిన ఆమె, ఆ తర్వాత 'శ్రీకృష్ణ తులాభారం'లో ఆ పాత్రకు మరింత వన్నె తెచ్చారు. కమలాకర కామేశ్వరరావు దర్శకత్వంలో రూపొందిన ఆ చిత్రంలో జమున చూపిన అభినయం ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసింది. సత్యభామలోని ఆత్మాభిమానం, అలక, ప్రేమ, గాంభీర్యాన్ని తన హావభావాలతో పలికించి ఆ పాత్రకు చిరునామాగా నిలిచారు. 'మిస్సమ్మ', 'ఇల్లరికం', 'ఇలవేల్పు', 'లేత మనసులు', 'గుండమ్మ కథ', 'మూగ మనసులు' వంటి ఎన్నో విజయవంతమైన చిత్రాలు ఆమె సినీ ప్రస్థానంలో మైలురాళ్లుగా నిలిచాయి. తెలుగు మాత్రమే కాకుండా తమిళం, హిందీతో పాటు పలు భాషల్లో నటించి సుమారు 200 చిత్రాలకు చేరువైన సినీ ప్రయాణాన్ని సాగించారు. తెలుగు 'మూగ మనసులు' హిందీ రూపాంతరమైన 'మిలన్'లోనూ ఆమె నటనకు విశేష గుర్తింపు దక్కింది. వెండితెరకే జమున జీవితం పరిమితం కాలేదు. సామాజిక సేవలోనూ చురుగ్గా వ్యవహరించారు. కళాకారుల సంక్షేమం కోసం సంస్థాగతంగా సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఇందిరాగాంధీపై ఉన్న అభిమానంతో రాజకీయాల్లోకి వచ్చిన జమున కాంగ్రెస్‌లో చేరారు. 1989లో రాజమండ్రి లోక్‌సభ నియోజకవర్గం నుంచి ఎంపీగా ఎన్నికై పార్లమెంటులో అడుగుపెట్టారు. అనంతరం క్రియాశీల రాజకీయాలకు దూరమైన ఆమె కొంతకాలం తర్వాత భారతీయ జనతా పార్టీ తరఫున ప్రచారం చేశారు. సినీ రంగానికి చేసిన సేవలకు అనేక పురస్కారాలు ఆమెను వరించాయి. 'మిలన్' చిత్రానికి ఉత్తమ సహాయ నటిగా ఫిలింఫేర్ పురస్కారం అందుకున్నారు. తమిళనాడు ప్రభుత్వం నుంచి గౌరవ పురస్కారంతో పాటు ఎన్టీఆర్ జాతీయ పురస్కారాన్ని కూడా అందుకున్నారు. దాదాపు ఏడు దశాబ్దాల పాటు తెలుగు



సినీ ప్రేక్షకుల జ్ఞాపకాల్లో నిలిచిన జమున 2023 జనవరి 27న హైదరాబాద్‌లో కన్నుమూశారు. ఆమె భౌతికంగా దూరమైనా వెండితెరపై సృష్టించిన పాత్రలు మాత్రం సజీవంగానే ఉన్నాయి. ముఖ్యంగా తెలుగు ప్రేక్షకుడు సత్యభామను తలచుకున్న ప్రతిసారీ జమున రూపమే కళ్లముందు కదలాడుతుంది.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# వ్యతిరేకించే ముందు.. విషయం తెలుసుకోండి!

- కాప్ విమర్శలకు అనయా బంగర్ ఘాటు బదులు
- నిబంధనల మేరకే అర్హత పొందానని స్పష్టీకరణ
- ప్రీమియర్ క్రికెట్‌తో పునరాగమనానికి సన్నాహాలు
- భవిష్యత్తులో మహిళల బిగ్‌బాష్ లీగ్ లక్ష్యం
- ఉన్నతస్థాయి క్రికెట్‌కు ఇంకా నిరూపించుకోవాల్సిందే




**సిడ్నీ, ఆగస్టు 29:** మహిళల క్రికెట్‌లోకి తిరిగి వచ్చేందుకు ప్రయత్నిస్తున్న అనయా బంగర్ తనపై వచ్చిన విమర్శలకు స్పందించింది. క్రికెట్ ఆస్ట్రేలియా నిర్ణయాన్ని తప్పుబట్టిన దక్షిణాఫ్రికా స్టార్ ఆల్‌రౌండర్ మారిజానే కాప్ వ్యాఖ్యలకు బదులిస్తూ.. "వ్యతిరేకించే ముందు పూర్తి వివరాలు తెలుసుకోండి" అని సూచించింది. తనకు ఎలాంటి అనుచిత ప్రయోజనం లేదని, క్రికెట్ ఆస్ట్రేలియా నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగానే ముందుకు సాగుతున్నానని పేర్కొంది. అనయా మహిళల క్రికెట్‌లో ఆడేందుకు అవకాశం కల్పించడంపై ఇటీవల కాప్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. క్రికెట్ ఆస్ట్రేలియా నిర్ణయాన్ని ఆమె తప్పుబట్టింది. ఈ నేపథ్యంలో స్పందించిన అనయా.. తన అర్హతకు సంబంధించిన సమాచారాన్ని ఇప్పటికే అందుబాటులో ఉంచినట్లు తెలిపింది. ఈ అంశంపై అభిప్రాయం వ్యక్తం చేసేవారు ముందుగా సంబంధిత నిబంధనలు, వివరాలను పూర్తిగా అర్థం చేసుకోవాలని కోరింది. క్రికెట్ ఆస్ట్రేలియా నుంచి లభించిన అనుమతితో తనకు నేరుగా ప్రొఫెషనల్ జట్టులో చోటు దక్కినట్లు కాదని అనయా స్పష్టం చేసింది. ప్రస్తుతం ఆస్ట్రేలియాలోని రాష్ట్ర లేదా టెరిటరీ స్థాయిలో ప్రీమియర్ క్రికెట్ ఆడేందుకు అవకాశం లభించిందని తెలిపింది. కొన్ని స్థానిక క్లబ్‌లతో చర్చలు జరుపుతున్నట్లు సమాచారం. భవిష్యత్తులో మహిళల బిగ్‌బాష్ లీగ్‌లో ఆడటమే తన ప్రధాన లక్ష్యమని అనయా పేర్కొంది. అయితే అందుకు ముందు క్లబ్ క్రికెట్‌లో రాణించడం, ఫిట్‌నెస్ సాధించడం, తన ఆటతీరుతో సెలెక్టర్ల దృష్టిని ఆకర్షించడం అవసరమని తెలిపింది. తన విషయంలో క్రికెట్ ఆస్ట్రేలియా నిర్ణయం సాధారణ ప్రక్రియలో తీసుకున్నది కాదని అనయా పేర్కొంది. తన వైద్య వివరాలు, శస్త్రచికిత్స చరిత్ర, హార్మోన్, టెస్టోస్టెరాన్ నివేదికలు, క్రికెట్ నేపథ్యం, మ్యాచ్ దృశ్యాలు తదితర అంశాలను పరిశీలించినట్లు తెలిపింది. మాంచెస్టర్ మెట్రోపాలిటన్ యూనివర్సిటీకి చెందిన క్రీడా సంస్థకు సంబంధించిన శాస్త్రీయ, అథ్లెటిక్ పనితీరు సమాచారాన్ని కూడా పరిగణనలోకి తీసుకున్నట్లు పేర్కొంది. జూలైలో నిర్వహించిన రక్త పరీక్షలో తన మొత్తం టెస్టోస్టెరాన్ స్థాయి లీటరుకు 0.6 నానోమోల్‌గా నమోదైందని వెల్లడించింది. అనయా ఉన్నతస్థాయి క్రికెట్‌లోకి తిరిగి వచ్చే అవకాశం భవిష్యత్తులో అమల్లోకి వచ్చే అర్హత నిబంధనలపై ఆధారపడి ఉంటుందని పేర్కొంది. అప్పటివరకు కమ్యూనిటీ లేదా ప్రీమియర్ స్థాయి క్రికెట్‌లో కొనసాగేందుకు అవకాశం ఉందని తెలిపింది. అందువల్ల ప్రస్తుత అనుమతిని మహిళల బిగ్‌బాష్ లీగ్ ఒప్పందంగా లేదా ప్రొఫెషనల్, జాతీయ జట్టులో ఎంపికగా భావించకూడదని స్పష్టం చేసింది. తన వ్యక్తిగత ప్రయాణం గురించి కూడా అనయా స్పందించింది. చాలాకాలం పాటు తాను "సర్వైవల్ మోడ్"లో జీవించానని, గతంలో ఎదురైన పరిణామాలను ఇప్పుడు నెమ్మదిగా అర్థం చేసుకుంటూ జీవితాన్ని తిరిగి సర్దుబాటు చేసుకుంటున్నానని పేర్కొంది. ఇకపై ఒక్కో చిన్న అడుగు వేస్తూ తన క్రికెట్ ప్రయాణాన్ని తిరిగి నిర్మించుకోవాలని భావిస్తున్నట్లు తెలిపింది.



# క్రీడాకారులకు మోడీ శుభాకాంక్షలు

**న్యూఢిల్లీ, ఆగస్ట్ 29 :** జాతీయ క్రీడల దినోత్సవం సందర్భంగా భారత ప్రధాని నరేంద్ర మోదీ క్రీడాభిమానులకు శుభాకాంక్షలు చెప్పారు. యువతరానికి స్ఫూర్తిగా నిలవడంలో క్రీడల ప్రాధాన్యతను పేర్కొన్నారు. నిబద్ధత కలిగిన ప్రతి క్రీడాకారుడిని ప్రశంసించారు. మేజర్ ధ్యాన్‌చంద్‌కు నివాళులర్పించారు. అలాగే భారత మాజీ క్రికెటర్ శిఖర్ ధావన్ కూడా సోషల్ మీడియాలో శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా ఓ వీడియోను షేర్ చేశారు. ప్రతి క్రీడాకారుడికి.. మీ అంకితభావం, అభిరుచి, పట్టుదల అందరికీ గర్వకారణం. తరతరాలకు స్ఫూర్తినిచ్చే ప్రతిభావంతుడైన దిగ్గజ మేజర్ ధ్యాన్ చంద్‌కు నివాళులర్పిస్తున్నానని ప్రధాని మోదీ పేర్కొన్నారు. క్రీడలు అంటే కేవలం గెలవడం మాత్రమే కాదని నేనెప్పుడూ నమ్ముతా. కలలు కనడం, కష్టపడటం, ఎదురుదెబ్బలను తట్టుకొని ముందుకు సాగడం నేర్పిస్తాయి. జాతీయ క్రీడాదినోత్సవం నాడు యువతను మరింత ఎక్కువగా గేమ్స్ ఆడేలా ప్రోత్సహిద్దాం క్రికెటర్ శిఖర్ ధావన్ అన్నారు.

# 47 ఏళ్లకు అరంగేట్రం..

## 51 ఏళ్ల వయసులో ప్రపంచ రికార్డు..

### క్రికెట్‌లో 96 ఏళ్ల రికార్డు బద్దలు

**బుకారెస్ట్:** అంతర్జాతీయ క్రికెట్‌లో మరో అరుదైన రికార్డు నమోదైంది. ఐల్ ఆఫ్ మ్యాన్‌కు చెందిన 51 ఏళ్ల స్పిన్నర్ జోయాన్నే హిక్స్ ఏకంగా 96 ఏళ్లుగా చెక్కుచెదరకుండా ఉన్న రికార్డును బద్దలు కొట్టారు. పురుషులు, మహిళలు అనే తేడా లేకుండా అంతర్జాతీయ క్రికెట్‌లో ఐదు వికెట్ల ఘనత సాధించిన అత్యంత వయసైన బౌలర్‌గా చరిత్ర సృష్టించారు.

**51 ఏళ్ల వయసులో అద్భుత బౌలింగ్**

రొమేనియాలోని మొయారా వ్లాసియే క్రికెట్ గ్రౌండ్‌లో గ్రీస్ మహిళలతో జరిగిన టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌లో జోయాన్నే హిక్స్ అద్భుత ప్రదర్శన చేశారు. 51 సంవత్సరాల 173 రోజుల వయసులో బరిలోకి దిగిన ఆమె కేవలం 10 పరుగులు ఇచ్చి ఐదు వికెట్లు పడగొట్టారు. ఇది హిక్స్ కెరీర్‌లోనే అత్యుత్తమ బౌలింగ్ ప్రదర్శన. అంతేకాకుండా టీ20 అంతర్జాతీయ క్రికెట్‌లో ఆమెకు ఇది మూడో ఐదు వికెట్ల ఘనత కావడం విశేషం.

**5/10తో గ్రీస్ బ్యాటింగ్‌ను కుప్పకూల్చిన హిక్స్**

హిక్స్ స్పిన్ ధాటికి గ్రీస్ బ్యాటింగ్ లైనప్ పూర్తిగా కుప్పకూలింది. ఆమె ఐదు వికెట్లు తీసుకోవడంతో గ్రీస్ జట్టు కేవలం 15 ఓవర్లలో 52 పరుగులకే ఆలౌట్ అయింది. అనంతరం 53 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని ఛేదించేందుకు ఐల్ ఆఫ్ మ్యాన్ జట్టుకు పవర్‌ప్లే సమయం కూడా పూర్తిగా అవసరం కాలేదు. కేవలం తొమ్మిది వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. దీంతో హిక్స్ వ్యక్తిగత రికార్డుతో పాటు జట్టు విజయానికి కూడా కీలకంగా మారారు.

**96 ఏళ్లుగా ఉన్న బెర్ట్ ఐరన్‌మోంగర్ రికార్డు బద్దలు**

జోయాన్నే హిక్స్ సాధించిన ఘనతతో 96 ఏళ్ల క్రితం నమోదైన రికార్డు తెరమరుగైంది. అంతర్జాతీయ క్రికెట్‌లో అత్యంత వయసులో ఐదు వికెట్లు తీసిన బౌలర్‌గా ఇంతకాలం ఆస్ట్రేలియా మాజీ స్పిన్నర్ బెర్ట్ ఐరన్‌మోంగర్ పేరు మీద రికార్డు ఉంది. 1932లో దక్షిణాఫ్రికాతో జరిగిన టెస్టు మ్యాచ్‌లో ఐరన్‌మోంగర్ 49 సంవత్సరాల 314 రోజుల వయసులో ఐదు వికెట్ల ఘనత సాధించారు. ఇప్పుడు 51 సంవత్సరాల 173 రోజుల వయసులో హిక్స్ ఐదు వికెట్లు తీసి ఆ రికార్డును అధిగమించారు.



**ఒకే రోజు ఐరన్‌మోంగర్ రెండు ఫైవ్ వికెట్ల హాల్స్**

1932లో దక్షిణాఫ్రికాతో జరిగిన ఆ మ్యాచ్‌లో బెర్ట్ ఐరన్‌మోంగర్ అద్భుత ప్రదర్శన చేశారు. ఒకే రోజు రెండు ఇన్నింగ్స్‌లలోనూ 5వికెట్లకు పైగా తీశారు. తొలి ఇన్నింగ్స్‌లో 6పరుగులకు 5 వికెట్లు, రెండో ఇన్నింగ్స్‌లో 18 పరుగులకు 6 వికెట్లు పడగొట్టారు. ఆ మ్యాచ్‌లో దక్షి ణాఫ్రికా 36, 45 పరుగులకే ఆలౌట్ కాగా, ఆస్ట్రేలియా 153 పరుగులు చేసి ఇన్నింగ్స్ తేడాతో ఘన విజయం సాధించింది.

**47 ఏళ్ల వయసులో అంతర్జాతీయ అరంగేట్రం**

జోయాన్నే హిక్స్ అంతర్జాతీయ కెరీర్ కూడా ఎంతో ప్రత్యేకమైనది. ఆమె ఏకంగా 47 ఏళ్ల వయసులో ఐల్ ఆఫ్ మ్యాన్ తరఫున అంతర్జాతీయ క్రికెట్‌లో అరంగేట్రం చేశారు. 2024లో గ్రీస్, మాల్టాతో జరిగిన మ్యాచ్‌ల్లో ఆరు రోజుల వ్యవధిలోనే రెండు ఐదు వికెట్ల ఘనతలు సాధించారు. మాల్టాపై ఐదు వికెట్లు తీసినప్పుడు ఆమె వయసు 49 సంవత్సరాల 168 రోజులు. దీంతో అంతర్జాతీయ క్రికెట్‌లో ఐదు వికెట్లు తీసిన అత్యంత వయసైన మహిళా బౌలర్‌గా అప్పట్లో రికార్డు సృష్టించారు.

**ఇప్పుడు మహిళల రికార్డును దాటి ప్రపంచ రికార్డు**

తాజా ప్రదర్శనతో హిక్స్ మరో మెట్టు ఎక్కారు. ఇప్పటివరకు మహిళల విభాగంలో మాత్రమే ఉన్న ఆమె రికార్డు.. ఇప్పుడు పురుషులు, మహిళలు అనే తేడా లేకుండా అంతర్జాతీయ క్రికెట్‌లో అత్యంత వయసులో ఐదు వికెట్లు సాధించిన బౌలర్‌గా మారింది. కేవలం 10 పరుగులకే ఐదు వికెట్లు తీసి గ్రీస్ బ్యాటింగ్‌ను కుప్పకూల్చడంతో పాటు, ఐల్ ఆఫ్ మ్యాన్‌కు ఘన విజయాన్ని అందించడంలో కీలక పాత్ర పోషించారు. 51 ఏళ్ల వయసులో జోయాన్నే హిక్స్ సాధించిన ఈ ఘనత అంతర్జాతీయ క్రికెట్ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోనుంది.

# 7 పరుగులకే ఆలౌట్

## ఇదేం బ్యాటింగ్ బాబోయ్!

## టీ20 చరిత్రలో అత్యల్ప స్కోర్లివే

## 10 పరుగులకే కుప్పకూలిన రెండు జట్లు

## చెత్త రికార్డులో ఐవరీ కోస్ట్ అగ్రస్థానం

## మంగోలియా ఖాతాలోనూ రెండు దారుణ స్కోర్లు

స్పోర్ట్స్ డెస్క్: టీ20 క్రికెట్ అంటేనే ధనాధన్ సిక్సర్లు.. ఫోర్ల వర్షం.. మెరుపు అర్ధశతకాలు. బ్యాటర్లు బౌలర్లపై విరుచుకుపడి భారీ స్కోర్లు సాధించడం ఈ పొట్టి ఫార్మాట్‌లో సర్వసాధారణం. కానీ కొన్నిసార్లు పరిస్థితి పూర్తిగా తలకిందులవుతుంది. భారీ షాట్లు కొట్టేందుకు బరిలోకి దిగిన బ్యాటర్లు కనీసం క్రీజులో నిలబడలేక ఒక్కొక్కరుగా పెవిలియన్‌కు క్యూ కట్టిన సందర్భాలూ ఉన్నాయి. అంతర్జాతీయ టీ20 చరిత్రలో కొన్ని జట్లు కనీసం రెండంకెల స్కోరును కూడా అందుకోలేక అత్యంత దారుణ రికార్డులను మూటగట్టుకున్నాయి. ఈ అవాంఛనీయ రికార్డులో ఐవరీ కోస్ట్ అగ్రస్థానంలో ఉంది. 2024 నవంబర్ 24న నైజీరియాతో జరిగిన మ్యాచ్‌లో లక్ష్య ఛేదనకు దిగిన ఐవరీ కోస్ట్ బ్యాటర్లు పూర్తిగా చేతులెత్తేశారు. ప్రత్యర్థి బౌలర్ల ధాటికి కేవలం 7.3 ఓవర్లలోనే 7 పరుగులకు ఆలౌటయ్యారు. అంతర్జాతీయ టీ20 క్రికెట్‌లో అత్యల్ప జట్టు స్కోరుగా ఇది నమోదైంది. రెండో అత్యల్ప స్కోరు రికార్డును మంగోలియా, ఐల్ ఆఫ్ మ్యాన్ పంచుకున్నాయి. 2024 సెప్టెంబర్ 5న సింగపూర్‌తో జరిగిన మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన మంగోలియా.. ప్రత్యర్థి బౌలింగ్‌ను ఎదుర్కోలేక 10 ఓవర్లలో 10 పరుగులకే ఆలౌటైంది. 2023 ఫిబ్రవరి 26న స్పెయిన్‌తో జరిగిన మ్యాచ్‌లో ఐల్ ఆఫ్ మ్యాన్ పరిస్థితి కూడా ఇలాగే తయారైంది. స్పెయిన్ బౌలర్ల ధాటికి 8.4 ఓవర్లలో 10 పరుగులకే కుప్పకూలింది. ఆ స్వల్ప లక్ష్యాన్ని స్పెయిన్ సునాయాసంగా ఛేదించింది. ఈ జాబితాలో మంగోలియా మరోసారి చోటు దక్కించుకుంది. 2024 మే 8న జపాన్‌తో జరిగిన మ్యాచ్‌లో 8.2 ఓవర్లలోనే 12 పరుగులకు ఆలౌటైంది. దీంతో అంతర్జాతీయ టీ20ల్లో అత్యల్ప స్కోర్ల జాబితాలో మంగోలియా పేరు రెండుసార్లు నమోదైంది. ఐవరీ కోస్ట్ కూడా మరోసారి ఈ అవాంఛనీయ జాబితాలో చేరింది. 2026 మే 24న రువాండాతో జరిగిన మ్యాచ్‌లో 15.2 ఓవర్ల పాటు క్రీజులో ఉన్నప్పటికీ 17 పరుగులకే ఆలౌటైంది. దీంతో రువాండా ఏకపక్ష విజయాన్ని అందుకుంది. సిక్సర్లు, ఫోర్లతో పరుగుల వరద పారే టీ20 క్రికెట్‌లో 7, 10, 12, 17 పరుగులకే జట్లు కుప్పకూలడం క్రికెట్ అభిమానులను ఆశ్చర్యానికి గురిచేసే అంశమే. పొట్టి ఫార్మాట్‌లో ఒక్క చెత్త రోజు ఎదురైతే ఎంతటి దారుణ రికార్డు ఖాతాలో చేరుతుందో ఈ స్కోర్లే చెబుతున్నాయి.




# ఆసియా క్రీడల ముంగిట భారత బృందానికి షాక్

## ప్రాక్టీస్‌లో గాయంతో నీరజ్ చోప్రా పోటీలకు దూరం




**న్యూఢిల్లీ, ఆగస్ట్ 29:** ఆసియా క్రీడల ముంగిట భారత బృందానికి షాక్ తగిలింది. జావెలిన్ స్టార్ నీరజ్ చోప్రా గాయపడ్డాడు. శిక్షణ సమయంలో అతడి చీలమండ లిగమెంట్‌కు గాయమైంది. దీంతో సెప్టెంబరులో జరగనున్న ఆసియా క్రీడలకు దూరం కానున్నాడు. ఈ విషయాన్ని నీరజ్ చోప్రా శనివారం సోషల్ మీడియా ద్వారా తెలియజేశాడు. ఎంతో కష్టపడిన తర్వాత లుసానె డైమండ్ లీగ్‌లో ఈ సీజన్‌లో అత్యుత్తమ (88.05 మీటర్లు)త్రోను అందుకున్నట్లు అనిపించింది. దురదృష్టవశాత్తు ఆ తర్వాత కొద్ది కాలానికే శిక్షణ సమయంలో నా చీలమండ వద్ద లిగమెంట్ చిట్లిపోయింది. వైద్యుడితోపాటు నా టీమ్‌తో చర్చించిన అనంతరం ఈ సీజన్‌లో మిగిలిన మ్యాచ్‌లకు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నాను. ఇది నిరాశ కలిగించే విషయం. నా ఆటలో రిథమ్‌ను అందుకునే దశకు చేరుకున్నానని భావిస్తున్న తరుణంలో ఇలా జరగడం బాధాకరం. ఇప్పుడు నా దృష్టి పూర్తిగా కోలుకోవడం, మరింత దృఢంగా తిరిగి రావడంపైనే ఉంది' అని నీరజ్ చోప్రా పేర్కొన్నాడు. ఈ గాయం కారణంగా సెప్టెంబరు 5న బ్రసెల్స్‌లో జరగనున్న డైమండ్ లీగ్గ ÷నైల్‌కు కూడా నీరజ్ దూరంకానున్నాడు. సెప్టెంబరు 11 నుంచి 13 వరకు జరగనున్న ప్రపంచ అ÷-లథెటిక్స్ అల్టిమేట్ ఛాంపియన్‌షిప్స్‌లోనూ పాల్గొనడం లేదు. ఆసియా క్రీడలు సెప్టెంబరు 19 నుంచి జపాన్‌లో ప్రారంభంకానున్న విషయం తెలిసిందే.







## ప్యారడైజ్ నుంచి యెష నాగుల కట్టమీద పాట విడుదల

నేచురల్ స్టార్ నాని, టాలెంటెడ్ డైరెక్టర్ శ్రీకాంత్ ఓదెల క్రేజీ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న మోస్ట్ అంటెసిపేటెడ్ పాన్ ఇండియా మూవీ 'ది ప్యారడైజ్' నుంచి మేకర్స్ క్రేజీ అప్‌డేట్‌ను అందించారు. ఈ చిత్రం నుంచి రెండో సింగిల్‌గా మోస్ట్ పాపులర్ ఫోక్ సాంగ్ అయిన 'యెష నాగుల కట్ట మీద' పాటను డిజిటల్ వేదికగా విడుదల చేశారు. తెలంగాణ నేటివిటీని ప్రతిబింబించేలా సాగే ఈ జానపద గీతాన్ని సినిమాలో మరింత మాస్ వైబ్‌తో రీమిక్స్ వెర్షన్‌గా తెరకెక్కించారు. ఇప్పటికే సోషల్ మీడియాలోనూ, ప్రజల నోళ్లలోనూ నానుతున్న ఈ పాటకు అనిరుధ్ రవిచందర్ అందించిన రాకింగ్ మాస్ బీట్స్ ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి. 'దసరా' బ్లాక్‌బస్టర్ తర్వాత నానితో పాటు తెరపై ఈ పాటకు రాబోయే మాస్ స్టెప్స్ సినిమాపై అంచనాలను తారాస్థాయికి చేర్చుతున్నాయి. ఈ క్యాచీ సాంగ్‌కు కాసర్ల శ్యామ్ సాహిత్యాన్ని అందించగా, జంగి రెడ్డి మరియు సింగర్ ప్రభ తమ శక్తివంతమైన గాత్రంతో ప్రాణం పోశారు. ఎస్.ఎల్.వి. సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి అత్యంత భారీ బ్జడెట్‌తో నిర్మిస్తున్న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా సెప్టెంబర్ 24, 2026న గ్రాండ్‌గా ప్రేక్షకుల ముందుకు రానుంది.



## నాగార్జున వందో సినిమా
### కింగ్ 100 గ్లింప్స్ విడుదల

అక్కినేని అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న నాగార్జున కెరీర్‌లోని ప్రతిష్టాత్మక 100వ సినిమా సందడి మొదలైంది. 'కింగ్ 100'గా ప్రచారంలో ఉన్న ఈ ల్యాండ్‌మార్క్ ప్రాజెక్ట్‌కు సంబంధించిన టైటిల్‌ని గ్లింప్స్ ద్వారా రివీల్ చేశారు. సినిమా టైటిల్‌ని 'కింగ్ 100' అని పెట్టడం గమనార్హం. అన్నపూర్ణ స్టూడియోస్ బ్యానర్ పై అక్కినేని ఫ్యామిలీ నిర్మాణంలో తమిళ దర్శకుడు రా కార్తీక్ దర్శకత్వంలో ఈ సినిమా తెరకెక్కుతుంది. నేడు నాగార్జున పుట్టిన రోజు సందర్భంగా సినిమా ఫస్ట్ గ్లింప్స్ ని రిలీజ్ చేసారు. మనుషుల్లో రెండు రకాలు.. ఒకటి డబ్బున్న వాళ్లు, మరొకటి డబ్బు లేని వాళ్లు అనే పవర్ ఫుల్ డైలాగ్‌తో నాగార్జునని పరిచయం చేశారు. గ్లింప్స్ చూస్తుంటే డబ్బు లేని ఓ పేదవాడు కసిగా ఎదిగి, మోసాలు చేస్తూ బాగా సంపాదించి కింగ్ స్థాయికి ఎలా ఎదిగాడు అనేది చిత్రంలో చాలా ఇంట్రెస్టింగ్‌గా చూపించనున్నట్టు అర్థమవుతుంది. మరోవైపు చిత్రంలో ఫాదర్ ఎమోషన్ కూడా ఉండబోతుంది అని, నాగార్జున ఇందులో ఫ్లాష్ బ్యాక్ లో యంగ్ వర్షన్ లో కూడా కనిపించబోతున్నట్టు అర్థమవుతుంది. చిన్న గ్లింప్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో ఆసక్తిని రేపుతోంది. కేవలం కొద్ది సెకన్ల వీడియోతోనే చిత్రంపై భారీ హైప్‌ను క్రియేట్ చేయడంలో మేకర్స్ సక్సెస్ అయ్యారు. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌లో మరో ప్రధాన ఆకర్షణగా నిలుస్తున్న అంశం టబు ఎంట్రీ. గతంలో నాగార్జున, టబు కలిసి నటించిన 'నిన్నే పెళ్లాడుతా', 'ఆవిడా మా ఆవిడే' వంటి సినిమాలు ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. చాలా ఏళ్ల తర్వాత ఈ హిట్ జోడీ మళ్లీ ఒకే సినిమాలో కనిపించబోతుండటంతో అభిమానుల్లో ప్రత్యేకమైన ఆసక్తి నెలకొంది. ఈ సినిమాలో టబు పాత్ర చాలా కీలకంగా ఉంటుందని, కథను మలుపు తిప్పే పవర్‌ఫుల్ క్యారెక్టర్‌లో ఆమె కనిపించనున్నారని సమాచారం. దీంతో నాగ్-టబు కాంబినేషన్‌పై అంచనాలు భారీగా పెరిగాయి. 'నితమ్ ఒరు వానమ్' చిత్రంతో దర్శకుడిగా తనదైన గుర్తింపు తెచ్చుకున్న రా కార్తీక్ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. భావోద్వేగాలకు, కమర్షియల్ ఎలిమెంట్స్‌కు సమాన ప్రాధాన్యం ఇస్తూ నాగార్జున 100వ సినిమాను ప్రత్యేకంగా తీర్చిదిద్దుతున్నట్లు తెలుస్తోంది. గ్లింప్స్‌ను బట్టి చూస్తే, దర్శకుడు ఈసారి ఫీల్‌గుడ్ కథకు భిన్నంగా మిస్టరీ, యాక్షన్ అంశాలతో కూడిన కథను ఎంచుకున్నట్లు అంచనా వేస్తున్నారు. ఈ భారీ ప్రాజెక్ట్‌కు రాక్‌స్టార్ దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు. ఈ మూవీని డిసెంబర్ 24న విడుదల చేయనున్నట్టు గ్లింప్స్ తో తెలియజేశారు.

## మహేంద్రగిరి వారాహి ట్రైలర్ విడుదల

టాలీవుడ్ నటుడు సుమంత్ హీరోగా, సంతోష్ జాగర్లపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న డివోషనల్ మిస్టరీ థ్రిల్లర్ 'మహేంద్రగిరి వారాహి' ఈ సినిమాకు సంబంధించిన థియేట్రికల్ ట్రైలర్‌ను శుక్రవారం చిత్రబృందం విడుదల చేసిన సంగతి తెలిసిందే. అయితే ఈ ట్రైలర్ సోషల్ మీడియాలో వ్యూస్‌తో దూసుకుపోతుంది. ఇక రాజశ్యామల ఎంటర్‌టైన్‌మెంట్స్, బ్రిడ్జ్ ఫిలిమ్స్ బ్యానర్లపై లక్ష్మణ్, కలిపు మధు సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్ర ట్రైలర్‌ను ప్రముఖ డైరెక్టర్ వెంకీ అట్లూరి ముఖ్య అతిథిగా విచ్చేసి ఆవిష్కరించారు. పరమశివుడి ఆజ్ఞతో మహేంద్రగిరిలో కొలువుదీరిన గ్రామదేవత 'వారాహి మాత' నేపథ్యంతో ఈ కథ సాగుతుంది. మహేంద్రగిరి రాజకుటుంబానికి చెందిన వారు గత 150 ఏళ్లుగా అనుమానాస్పద స్థితిలో వరుసగా మరణిస్తుండటం, ఇదంతా అమ్మవారి శాపం వల్లే జరుగుతోందనే నమ్మకం చుట్టూ ఈ ట్రైలర్ ఆద్యంతం ఉత్కంఠను రేకెత్తిస్తోంది. ఆ రహస్యాన్ని ఛేదించేందుకు హీరో సాహసించే తీరు సినిమాపై ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచుతోంది. ఈ చిత్రంలో వారాహి మాతగా నటి ఐశ్వర్య రాజేష్ అలరించనుండగా, 'స్టార్ బాయ్' సిద్ధు జొన్నలగడ్డ ఒక కీలక పాత్రలో ట్రైలర్‌లో సర్ ప్రైజ్ ఎంట్రీ ఇచ్చి అంచనాలను అమాంతం పెంచేశారు. వీరితో పాటు మీనాక్షి గోస్వామి, మాళవిక నాయర్, బ్రహ్మానందం, వెన్నెల కిశోర్, రాజీవ్ కనకాల తదితరులు ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. అనూప్ రూబెన్స్ సంగీతం అందిస్తున్న ఈ సోషియో-ఫాంటసీ థ్రిల్లర్‌ను ప్రపంచవ్యాప్తంగా సెప్టెంబర్ 11, 2026న గ్రాండ్‌గా విడుదల చేయనున్నారు. వారాహికి ఎదురెళ్లి ఈ శాపాన్ని తప్పిస్తాను' అంటున్నారు సుమంత్. మహేంద్రగిరి రాజ వంశస్థులకు వారాహి అమ్మవారి శాపం ఎలా తగిలింది? అందుకు కారణం ఏంటి? మరి అన్నట్లుగానే ఆ శాపం ఏంటో కథానాయకుడు కనుగొన్నాడా? శాప విమోచనకు ఏం చేశాడు? అన్నది తెలియాలంటే 'మహేంద్రగిరి వారాహి' చూడాల్సిందే. సుమంత్ హీరోగా దర్శకుడు సంతోశ్ జాగర్లపూడి తెరకెక్కించిన సోషియో ఫాంటసీ చిత్రమిది. ఐశ్వర్య రాజేశ్, మాళవికా నాయర్, తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ మూవీ సెప్టెంబరు 11న విడుదల కానుంది. ఈ సందర్భంగా శుక్రవారం ట్రైలర్ విడుదలైంది. ఆద్యంతం థ్రిల్ పంచేలా మూవీని తీర్చిదిద్దినట్లు ప్రచార చిత్రం చూస్తే అర్థమవుతోంది.


## బేబీమూన్ ట్రిప్‌ను ఎంజాయ్ చేస్తోన్న సామ్

ప్రస్తుతం సమంత తల్లికాబోతున్న ఆనందంలో ఉన్నారు. ఒకవైపు బేబీమూన్ ట్రిప్‌ను ఎంజాయ్ చేస్తోన్న సామ్.. మరోవైపు వ్యాయామం చేస్తూ అభిమానులతో ఫొటోలు పంచుకుంటున్నారు. తాజాగా ఇన్‌స్టా వేదికగా ఫ్యాన్స్‌తో ముచ్చటించారు. కొందరు తల్లులు ఆమెకు సలహాలు ఇవ్వగా.. మరికొందరు ఆమెతో వారి అనుభవాలు పంచుకున్నారు. బేబీ కోసం కావాల్సిన వస్తువులన్నీ కొన్నాను. వాటిని చూస్తుంటే కాస్త కంగారుగా ఉంది. అందుకే ప్రస్తుతానికి వాటిని ప్యాక్ చేసి ఆ బ్యాగ్‌ను ఒక లాప్‌టాప్ స్టాండ్‌గా వాడుతున్నానన్నారు. ప్రెగ్నెన్సీతో ఉన్నప్పటి నుంచి నాకు కలలు వస్తున్నాయి. మీకు కూడా వస్తున్నాయా అంటూ ప్రశ్నలు వేస్తున్నారు. నిజంగానే.. ఈ విచిత్రమైన కలల గోల ఏంటో అర్థం కావట్లేదు. మరోవైపు11 కేజీలు పెరిగాననన్నారు. కొత్తగా తల్లి అయిన తర్వాత చాలా మార్పులు వస్తాయట. నేను ఆ క్షణాల కోసం ఆత్రుతగా ఎదురుచూస్తున్నాను. పుట్టినవారికి పాలు పట్టడం, జోలపాడి నిద్రపోయేలా చేయడం.. ఈ పనులు ఫుల్ టైమ్ జాబ్‌లా మారిపోతాయి. అది చాలా అందమైన, గొప్ప అనుభూతి. జీవితాన్ని మార్చే అనుభవం. మాతృత్వం ఆత్మవిశ్వాసాన్ని మరింత పెంచుతుంది. మాతృత్వం వల్ల ఆత్మవిశ్వాసం పెరుగుతుందని ఇప్పటి వరకు తెలియదు. నేను ఊహించలేదు కూడా. మంచి విషయాన్ని తెలిపారు. ధన్యవాదాలు అంటున్నారు. పుట్టబోయే బిడ్డకు ఏం పేరు పెడతారంటే ..ఓ పేరును ఎంచుకోవడం చాలా కష్టం.. దీనికి మీ అందరి సహాయం కావాలి. స్కానింగ్ రిపోర్ట్స్ వచ్చేదాక చాలా టెన్షన్‌గా ఉంటుంది. అయితే ఈ కొత్త దశను పూర్తిగా ఆస్వాదిస్తున్నానని సమంత ఆనందంగా చెప్పారు.



## నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమ్‌కు ఇరుముడి రెడీ

మాస్ మహారాజా రవితేజ హీరోగా, ప్రతిభావంతుడైన దర్శకుడు శివ నిర్వాణ దర్శకత్వంలో తెరకెక్కిన హార్ట్ టచింగ్ బ్లాక్‌బస్టర్ చిత్రం 'ఇరుముడి' . ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ అత్యున్నత ప్రమాణాలతో నిర్మించిన ఈ చిత్రం ఆగస్ట్ 21న ప్రేక్షకుల ముందుకు వచ్చి అనూహ్య విజయాన్ని సొంతం చేసుకుంది. మొదటి రోజు నుంచే అద్భుతమైన పాజిటివ్ టాక్‌తో బాక్సాఫీస్ వద్ద రికార్డు స్థాయి కలెక్షన్లతో దూసుకుపోతోంది. రవితేజ కెరీర్‌లోనే ప్రత్యేకమైన చిత్రంగా నిలిచిన 'ఇరుముడి', భావోద్వేగాలతో కూడిన కంటెంట్‌తో అన్ని వర్గాల ప్రేక్షకులను థియేటర్లకు రప్పిస్తూ ఘన విజయంతో సక్సెస్‌ఫుల్‌గా రన్ అవుతోంది. పాన్-ఇండియా స్థాయిలో విడుదలైన యశ్ 'టాక్సిక్' వంటి భారీ బ్జడెట్ చిత్రం బరిలోకి దిగినప్పటికీ, 'ఇరుముడి' క్రేజ్ ఏమాత్రం తగ్గకపోవడం విశేషం. ఆ పోటీని సైతం తట్టుకుని రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు ఓవర్సీస్‌లోనూ హౌస్‌ఫుల్ బోర్డులతో స్టాం÷-రగ్ కలెక్షన్లను రాబడుతోంది. రవితేజ మార్క్ ఎనర్జీతో పాటు త్రినాథ్ పాత్రలో ఆయన పండించిన ఎమోషన్స్, శివ నిర్వాణ టేకింగ్, జీవీ ప్రకాశ్ సంగీతం సినిమా విజయానికి ప్రధాన బలంగా నిలిచాయి. థియేటర్లలో ఇంకా కలెక్షన్ల సునామీ కొనసాగుతున్న తరుణంలోనే, ఈ చిత్ర డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులకు సంబంధించిన ఆసక్తికరమైన సమాచారం బయటకు వచ్చింది. తాజా సమాచారం ప్రకారం, 'నెట్‌ఫ్లిక్స్' ఈ చిత్ర డిజిటల్ రైట్స్‌ను భారీ ఫ్యాన్సీ ధరకు దక్కించుకుంది. థియేట్రికల్ రన్ ముగిసే సమయానికి, అంటే సెప్టెంబర్ 18 నుంచి 'ఇరుముడి' చిత్రాన్ని నెట్‌ఫ్లిక్స్‌లో అధికారికంగా స్ట్రీమింగ్ చేయనున్నట్లు తెలుస్తోంది. సినిమా విడుదలైన నాలుగు వారాల విండో తర్వాత తెలుగుతో పాటు ఇతర ప్రధాన భాషల్లో కూడా ఇది అందుబాటులోకి రానుంది.




This newspaper is Owned and Published by **MOHAMMED IMRAN** from H.No. 5-2-109, Osmanpura, Jagitial, Telangana, 505327. Edited by **MOHAMMED IMRAN** and Printed by MAHEERA PRINTERS at H.No.5-2-110, Near Goremiya Chowrastha, Osmanpura, Jagitial Dist. Jagitial ,Telangana-505327. **RNI REGD NO. TELTEL/2006/16536**. Contact No.+91 9848999998, editor@churakalu.com